# క్రాంతి

## లోపలి పేజీల్లో..


| | | |
|---|---|---|
| సీఎమ్‌సీ పిలుపు | - | 3 |
| అమెరికా ఎన్నికలు | - | 7 |
| రైతుల ఆందోళన | - | 13 |
| బిహార్ ఎన్నికలు | - | 17 |
| హాథ్రాస్ ఘటన | - | 18 |
| శ్రద్ధాంజలి | - | 20 |
| ఏఓబీ, తెలంగాణ డీకే రిపోర్టులు | - | 28 |



సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., తెలంగాణ, ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక

సంపుటి: 45 సంచిక: 4 అక్టోబర్-డిసెంబర్, 2020 వెల: పది రూపాయలు


# పీఎల్‌జీఏ 21వ వార్సికోత్సవానికి విప్లవ జేజేలు

## 'ప్రజాసైన్యం లేకుండా ప్రజలకుండేదేమీ లేదు'- మావో



### యుద్ధం మధ్యన యుద్ధం నేర్వడం- శత్రు ఆయుధాలతో సాయుధం కావడం ప్రజాయుద్ధ రహస్యం

సరిగ్గా 20 సంవత్సరాల క్రితం భారత విప్లవ ప్రజల సైన్యం 'ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం' 2 డిసెంబర్ 2000 రోజ ఆవిర్భవించింది. అది ప్రారంభం నుండి శత్రు బలగాలతో యుద్ధం చేస్తూ యుద్ధాన్ని అభ్యసిస్తోంది. అది తన 20 వసంతాలలో అనేక గొప్ప విజయాలను జయించింది. అలాగే అదే సమయంలో అది భారీ నష్టాలనూ చవిచూసింది. 2005 నుండి 2009 మధ్య వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో స్థానిక రియాక్షనరీ శక్తుల నాయకత్వంలో ఒకవైపు దండకారణ్యంలో సల్వాజుడుం, మరోవైపు ఝార్ఖండ్‌లో సెంద్రా పేర్లతో శ్వేత మిలీషియా ఏర్పడి విప్లవ ప్రజలలో భయ బీభత్స వాతావరణాన్ని సృష్టించాయి. ఆ సమయంలో బాల్యావస్థలో నున్న విప్లవ ప్రజల పీఎల్‌జీఏ ప్రజల పక్షాన నిలిచి శ్వేత మిలీషియాను మట్టుపెట్టింది. ఆ వెన్వెంటనే భారత పాలక వర్గాలు లక్షలాది తమ భద్రతా బలగాలతో దేశ వ్యాపితంగా అప్రకటిత 'ఆపరేషన్ గ్రీన్‌హంట్'ను ప్రారంభించాయి. 2004లో దేశంలోని రెండు విప్లవ ప్రవంతుల సమైక్యతతో ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)ను 2005లో భారత ప్రభుత్వం దేశ అంతర్గత భద్రతకు ఏకైక పెనుముప్పుగా ప్రకటించాయి. ఆ పార్టీని దాని నాయకత్వంలోని ప్రజా సైన్యాల

విలీనంతో నూతన శక్తితో ఉనికిలోకి వచ్చిన పీఎల్‌జీఏను సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో దీర్ఘకాల కెంపెయిన్ 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' 2017 మధ్య వరకు సాగింది. 2009 ఏప్రిల్‌లో దండకారణ్యంలోని తాడిమెట్లలో 76మంది సీఆర్‌పీ బలగాలను మట్టుపెట్టిన నాటి నుండి 2017లో బుర్కపాల్‌లో దాదాపు ప్లాటూన్ సంఖ్యలో కేంద్ర భద్రతా బలగాలను నిర్మూలించేవరకు పీఎల్‌జీఏ అనేక సమరాలలో గొప్ప విజయాలు సాధించింది. తాను ఆశించిన లక్ష్యాలను సాధించలేకపోతున్న భారత పాలక వర్గాలు వారి భద్రతా బలగాలు గతాన్ని సమీక్షించుకొని మరో నూతన బహుముఖ దాడి 'ఆపరేషన్ సమాధాన్'ను ఐదేళ్ల కాలవ్యవధితో చేపట్టింది. అయినప్పటికీ వారు ఆశించిన ఫలితాలు పొందలేకపోవడంతో 'ఆపరేషన్ సమాధాన్'లో భాగంగానే 2019 డిసెంబర్‌లో 'ఆపరేషన్ ప్రహార్' పేరుతో నార్త్‌బ్లాక్ (కేంద్ర ప్రభుత్వ గృహ విభాగ కార్యాలయం) ఒక నూతన కెంపెయిన్‌కు పథకం సిద్ధం చేసింది. 2020 జనవరి నుండి ఆపరేషన్ ప్రహార్ దాడులు ప్రారంభమైనాయి. ఆ సమయంలో పీఎల్‌జీఏ నిర్వహించిన ఒక ఎత్తుగడలపర ఎదురుదాడిలో సుక్మా జిల్లాలోని మినప గ్రామం వద్ద భారత భద్రతా బలగాలకు చెందిన 40 మంది దెబ్బతిన్నారు. వారిలో డీఆర్‌జీ (డిస్ట్రిక్ట్ రిజర్వు పోలీసు)ల ముసుగులోనున్న భారత సైన్యాలకు చెందిన నలుగురు మృతి చెందిన విషయాన్ని పోలీసు వర్గాలు అధికారికంగా ప్రకటించడంతో భారత సైన్యాలు భారత ప్రజలపై యుద్ధానికి దిగిన విషయం వెలుగులోకి వచ్చింది. మినపదాడి నార్త్‌బ్లాక్‌ను తీవ్ర ఆందోళనకు గురి చేసింది.

15 అక్టోబర్ 2020నాడు జాతీయ భద్రతా సలహాదారు సీఆర్‌పీఎఫ్ విశ్రాంత డీజీ, బ్రిగ్గర్ హ్యాపీ కే. విజయ్ కుమార్ నేతృత్వంలో ఐదు రాష్ట్రాలు-తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర-లకు చెందిన అత్యున్నత పోలీసు, సివిల్ అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించినాడు. దేశ వ్యాపితంగా కోరోనా విజృంభిస్తున్న పరిస్థితులలో ఆ అధికారులు భారత విప్లవోద్యమంపై 8 మాసాల **నిర్ణయాత్మక దాడి**కి పది ఎత్తుగడలతో పథకాన్ని రూపొందించారు. 2020 నవంబర్ నుండి 2021 జూన్ వరకు ఆ నిర్ణయాత్మక దాడి జరుగుతుందని ప్రకటించి తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల నుండి తెలంగాణ విప్లవ గెరిల్లా బలగాలపై దాడులు ప్రారంభించారు. ప్రస్తుతం పీఎల్‌జీఏ ఆ నిర్ణయాత్మక దాడుల మధ్య తన 20 వసంతాల వేడుకలను అత్యంత ఉత్సాహంగా, ప్రజా యుద్ధ వాతావరణంలో జరుపుకుంటున్నది. పీఎల్‌జీఏ తన 20 సంవత్సరాల ప్రస్థానంలో సాధించిన గొప్ప విజయాల పరంపరను తుది వరకు కొనసాగించి తీరుతుందనీ, అది ఎదుర్కొన్న భారీ ఓటముల నుండి గుణపాఠాలు తీసుకుంటుందనీ, దాని ప్రజా యుద్ధ అనుభవాల కొలిమిలో మరింత రాటుతేలి వర్తమాన నిర్ణయాత్మక దాడినే కాకుండా, మొత్తం ఆపరేషన్ సమాధాన్‌ను ఓడించి తీరుతుందనీ క్రాంతి దృఢంగా విశ్వసిస్తోంది. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నాయకత్వంలో ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం భారత ప్రజల ప్రజాస్వామిక విప్లవ విజయ సాధనలో తిరుగులేని ఆయుధంగా నిలుస్తుందనీ, ప్రజాసైన్యం లేకుండా ప్రజలకు ఉండేదేమీ లేదన్న వాస్తవాన్ని మరోమారు నిరూపించి తీరుతుందనీ క్రాంతి సంపూర్ణ విశ్వాసంతో ద్విదశాబ్ది వేడుకలకు విప్లవ జేజేలు తెలుపుతుంది. వీర గెరిల్లాలకు, కమాండర్లకు విప్లవాభివందనాలు అందచేస్తున్నది.

గడచిన 20 వసంతాల ప్రజా యుద్ధంలో తమ రక్తాన్ని చిందించి ప్రజా యుద్ధాన్ని పురోగమింపచేసిన 4,483మంది వీర గెరిల్లాలు, కమాండర్లకు క్రాంతి తలవంచి వినమ్రంగా విప్లవ జోహార్లర్పిస్తోంది. భారత నూతన ప్రజాతంత్ర విప్లవ విజయాన్ని తమ విముక్తికి ముందు షరతుగా భావించి పురుషులతో సమానంగా యుద్ధభూమిలో తెగించి నిలిచి ప్రజాయుద్ధ కీలలలో 839 మంది వీరాంగణలు తమ అమూల్యమైన ప్రాణాలను సమర్పించారు. వారంతా మహిళా విముక్తికి ధృవతారలై నిలిచారు. పీఎల్‌జీఏ నిర్వహించిన గొప్ప సమరాలలో వారు అసమాన ధైర్య సహసాలు ప్రదర్శిస్తూ 2,958 మంది శత్రు బలగాలను మట్టుపెట్టి 3,507మందిని క్షతగాత్రులను చేసి 3,208 ఆధునిక ఆయుధాలను 1,52,819 తూటాలను సంపాదించి ప్రజా సాయుధ బలగాలు (పీఎల్‌జీఏ)ను పటిష్టం చేసారు. వారి యుద్ధ అనుభవాల నుండి, అసమాన త్యాగాల నుండి ఉన్నతమైన ఆదర్శాలను స్వీకరిస్తూ వారి త్యాగాలు వృధా పోవనీ భారత నూతన ప్రజాతంత్ర విప్లవాన్ని జయప్రదం చేద్దాం. దేశానికి ప్రధాన ప్రమాదకారిగా నిలిచిన బ్రాహ్మణవాద హిందుత్వను వారికి పూర్తి అండగా నిలిచిన సామ్రాజ్యవాదాన్ని మట్టుబెడుదాం. ఈ వేడుకల సందర్భంగా మనమంతా అందుకు త్రికరణశుద్ధిగా అంకితమవుతామని ప్రతిజ్ఞ చేద్దాం. ఈ సందర్భంగా మన సహచర గెరిల్లాలు అనేక మంది దేశంలోని వివిధ జైళ్లలో దీర్ఘకాలంగా మగ్గుతున్నారు. వారు శత్రు శిబిరంలో తలవంచని విప్లవ పట్టుదలతో శత్రువును ఎదిరిస్తున్నారు. వారికి 'క్రాంతి' విప్లవాభివందనాలు తెలియజేస్తున్నది. వారు లేని లోటు పీఎల్‌జీఏ వారి విడుదల ద్వారనే పూడ్చుకుంటుంది. ✶

(పీఎల్‌జీఏ 21వ వార్షికోత్సవ సందర్భంగా 'సెంట్రల్ మిలిటరీ కమీషన్' ఆహ్వానాన్ని సంక్షిప్తీకరించి ఇస్తున్నాం.)

'తయారీలు లేకుండా సమరాలకు దిగకూడదు. గెలుస్తామనే పూర్తి నమ్మకం లేకుండా ఏ సమరానికి పూనుకోవద్దు. ఏ సమరానికైనా ఉన్న అన్ని అవకాశాలను పూర్తిగా వినియోగించుకొని తయారీలు పూర్తి చేసుకోవాలి. మనకు సంబంధించిన శత్రువుకు సంబంధించిన నిర్దిష్ట పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని గెలువడానికి శక్తి వంచన లేని ప్రయత్నం చేయాలి' - మిలిటరీ చర్యల పది ముఖ్య నియమాలు-1947.

'శత్రు కెంపెయిన్ల మధ్య కాలాన్ని మన సైనికులకు విశ్రాంతి, కన్సాలిడేషన్, శిక్షణకు సద్వినియోగం చేసుకోవాలి. విశ్రాంతి కోసం, కన్సాలిడేషన్ నిమిత్తం, శిక్షణ అవసరాలకు సాధారణంగా అధిక సమయాన్ని వెచ్చించవద్దు. వీలైన మేరకు శత్రువుకు ఊపిరి సలుపుకోనీయకూడదు' - మిలిటరీ చర్యల పది ముఖ్య నియమాలు- మావో - 1947

'సెంట్రల్ మిలిటరీ కమీషన్ పిలుపు'

# భారత విప్లవోద్యమ నిర్మూలనకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న విప్లవ ప్రతీఘాతుక 'సమాధాన్' వ్యూహాత్మక దాడిని తిప్పికొట్టండి!

**ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా!**

**పీఎల్‌జీఏ ద్విదశాబ్ది ఉత్సవాల సందర్భంగా యావత్తు పార్టీ కమిటీలకు, సభ్యులకు; పీఎల్‌జీఏ కమాండ్లకు, కమాండర్లకు, పోరాట యోధులకు, ప్రజా మిలిషియా బలగాలకు, విప్లవ ప్రజా ప్రభుత్వాల, ప్రజా సంఘాల నాయకులకు, కార్యకర్తలకుసెంట్రల్ మిలిటరీ కమీషన్ (సీఎమ్‌సీ), సీపీఐ (మావోయిస్టు) పిలుపు!**

పీఎల్‌జీఏ ఏర్పడి 20 యేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ సంవత్సరం డిసెంబర్ 2 నుండి 2021 డిసెంబర్ 2 వరకు సంవత్సర కాలంపాటు దేశవ్యాప్తంగా ఉద్యమ ప్రాంతాలంతటా గ్రామాల్లో, పట్టణాల్లో పీఎల్‌జీఏ 21వ వార్షికోత్సవాలను విప్లవోత్సాహంతో, ఘనంగా జరపాల్సిందిగా యావత్తు పార్టీ శ్రేణులకు, పీఎల్‌జీఏ యూనిట్లకు, విప్లవ ప్రజా ప్రభుత్వాలకు, ప్రజాసంఘాలకు, విప్లవ ప్రజానీకానికి సెంట్రల్ మిలిటరీ కమీషన్ (సీఎమ్‌సీ) పిలుపునిస్తోంది.

శత్రువు కొనసాగిస్తున్న విప్లవ ప్రతీఘాతుక 'సమాధాన్' వ్యూహాత్మక దాడి నుంచి పార్టీనీ, పీఎల్‌జీఏనీ పరిరక్షించి బలోపేతం చేసే లక్ష్యంతో, గత సంవత్సరం మన కేంద్రకమిటీ పిలుపుననుసరించి, దేశవ్యాప్తంగా 2020 డిసెంబర్ నుండి 2021 డిసెంబర్ వరకు కన్సాలిడేషన్ క్యాంపెయిన్‌ను కొనసాగించాలనీ, ఆయా రాష్ట్రాల పరిస్థితులను బట్టి ఈ సంవత్సర కాలంలో విప్లవ ప్రచారం, ప్రతిఘటన, కన్సాలిడేషన్ కార్యక్రమాలను సమన్వయంతో నడపాలనీ సీఎమ్‌సీ పిలుపునిస్తోంది.

ఈ రెండు దశాబ్దాల కాలంలో భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసే లక్ష్యంతో 4,483 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. వీరిలో 839 మంది మహిళా కామ్రేడ్స్ వున్నారు. శత్రువుపై మన పీఎల్‌జీఏ బలగాలు చేసిన దాడులలో, కౌంటర్ దాడుల్లో 283 మంది కామ్రేడ్స్ అమరులు కాగా మిగతా కామ్రేడ్స్ శత్రువు మన పీఎల్‌జీఏ బలగాలపై, విప్లవ ప్రజలపై చేసిన దాడులలో (ఎన్‌కౌంటర్లలో-శత్రు కోవర్ట్ ఆపరేషన్లలో-బూటకపు ఎన్‌కౌంటర్లలో), జైళ్లలో, అనారోగ్యాలతో, దుర్ఘటనలతో ఇతర కారణాలతో అమరులయ్యారు.

విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో భారత దోపిడీ పాలకవర్గాలు దఫదఫాలుగా సాగించిన పలు విప్లవ ప్రతిఘాతుక వ్యూహాత్మక దాడి పథకాలను ఓడించేందుకు ఎత్తుగడల ఎదురుదాడులను, క్యాంపెయిన్‌లను సాహసోపేతంగా విజయవంతం చేసే క్రమంలో; శత్రు సాయుధ బలగాలు మన బలగాలపై చేసిన దాడులను సాహసోపేతంగా ప్రతిఘటిస్తూ నాయకత్వ కామ్రేడ్స్‌ను, పార్టీ, పీఎల్‌జీఏ బలగాలను, విప్లవ ప్రజానీకాన్ని కాపాడే క్రమంలో; ఇతర కారణాలతో అసువులు బాసిన వీర గెరిల్లాలకూ, అమరులందరికీ సీఎమ్‌సీ తలవంచి వినమ్రంగా విప్లవ జోహార్లర్పిస్తోంది. అమరులు ఆచరించిన కమ్యూనిస్టు జీవన విలువలను, శత్రువుకు తలవంచని వారి ధీరోదాత్తతను, చావుకు వెరువని, అలుపెరుగని పోరాట శైలిని, ప్రజల పట్ల వారి అంకిత భావాన్ని ఆదర్శాలుగా తీసుకుని ఆచరిద్దాం. వారి ఆశయసాధనకై, వారి కలల సాఫల్యం కోసం చివరి వరకు పోరాడుదామని శపథం చేద్దాం.

భారత దేశంలో విప్లవాన్ని సరైన మార్గంలోకి తెచ్చిన నక్సల్బరీ, శ్రీకాకుళ రైతాంగ పోరాటాలు (1967-72) తాత్కాలికంగా వెనుకపట్టు పట్టినప్పటికి, 1977 నుంచీ సాయుధ వ్యవసాయ విప్లవం ఆంధ్రప్రదేశ్, బీహార్-ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, తమిళనాడు, కర్నాటక, కేరళం, పశ్చిమ బెంగాల్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, అస్సోం మొదలైన రాష్ట్రాలకు వ్యాపించింది.

విప్లవోద్యమ పురోగమన క్రమంలో ఆవిర్భవించిన ప్రజాగెరిల్లా శక్తులు క్రమబద్ధంగా అభివృద్ధి చెందుతూ, ఆ తర్వాతి క్రమంలో భారత విప్లవ చరిత్రలో మొట్టమొదటిసారిగా 2000 డిసెంబర్ 2న అమరులైన కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళీల స్మృతిదినాన ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పీఎల్‌జీఏ) ఏర్పడింది.

2004 లో పీపుల్స్‌వార్, ఎమ్‌సీసీ లు ఐక్యమైనపుడు తమతమ ప్రజా గెరిల్లా సైన్యాలను కలిపి ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పీఎల్‌జీఏ) గా పిలవాలనుకున్నాం. 2007లో జరిగిన ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్‌లో మన రాజకీయ-మిలిటరీ పంథాను మరింత సంపద్వంతం చేసుకున్నాం. ఈ పంథాపై ఆధారపడి సైద్ధాంతికంగా, రాజకీయంగా, మిలిటరీపరంగా, నిర్మాణపరంగా, సాంస్కృతికంగా ఎన్నో విలువైన అనుభవాల్ని సంపాదించాం.

పీఎల్‌జీఏ కు ఒక చరిత్ర, ఒక రాజకీయ లక్ష్యం, ఒక నిర్దిష్టమైన కార్యక్రమం ఉంది. పీఎల్‌జీఏ గడిచిన 20 సం॥లలో ఎన్నో

విజయాలను సాధించి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకుంది. ఆ వివరాల్లోకి వెళ్ళి పీఎల్‌జీఏని అర్థం చేసుకుందాం.

గత 20 సంవత్సరాల్లో మన పీఎల్‌జీఏ అనేక రకాల ఎత్తుగడల ద్వారా 208 పెద్దరకం, 318మధ్యరకం, ఇంకా 3,948 చిన్నరకం గెరిల్లా చర్యల్ని నిర్వహించింది.

గత రెండు దశాబ్దాల కాలంలో, 2006 వరకు బీహార్-ఝార్ఖండ్ (బీజే), దండకారణ్యం (డీకే), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ (2001 నుంచి ఏఓబీ), ఉత్తర ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్‌లలో పీఎల్‌జీఏ గెరిల్లాయుద్ధాన్ని విస్తృతంగా-తీవ్రంగా సాగించింది. 2007 నుండి బీజే, డీకేలతో పాటు, 2011 వరకు పశ్చిమబెంగాల్‌లో, 2014 నుంచి నూతన తూర్పు బీహార్-ఈశాన్య ఝార్ఖండ్ (తూ.బీ.-ఈ.ఝా.) ప్రాంతంలో అది కొనసాగింది. 2006 నుంచి ఆంధ్ర-ఒడిశా బార్డర్ (ఏఓబీ)లో కొన్ని పెద్ద, మధ్యరకం చర్యలతో పాటు పలు చిన్న గెరిల్లా చర్యలు నిర్వహించింది. తెలంగాణ, బాలాఘాట్, గోందియాలలో 2016 నుంచి మహారాష్ట్ర-మధ్యప్రదేశ్-ఛత్తీస్‌గఢ్ (ఎమ్ఎమ్‌సీ) ప్రాంతంలో, ఒడిశా, కర్ణాటక, 2012 తర్వాత ట్రైజంక్షన్‌లో చిన్న గెరిల్లా చర్యలను నిర్వహించింది.

గత రెండు దశాబ్దాల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విప్లవ ప్రతీఘాతక పథకాల్ని, దాడుల్ని పార్టీ నాయకత్వంలో, ప్రజల క్రియాశీల భాగస్వామ్యంతో పీఎల్‌జీఏ గెరిల్లాయుద్ధ చర్యల ద్వారా తిప్పికొడుతూ వస్తోంది. ఈ క్రమంలో శత్రువు దెబ్బతిన్న ప్రతిసారి ముందుకు తెచ్చిన నూతన ఎత్తుగడలను నూతన ప్రతిదాడి ఎత్తుగడలతో తిప్పికొట్టింది.

2005 నుండి 2009 మధ్యకాలంలో సల్వాజుడుం, సేంద్ర, శాంతిసేన, నాగరిక్ సురక్షా సమితి, లాంటి విప్లవ ప్రతీఘాతుక శ్వేత మిలిషియాలను ముందుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగించిన దాడులను దేశంలోని ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాల్లో, గెరిల్లా జోన్లలో వందలాది గెరిల్లా చర్యల్ని నిర్వహించి ఓడించింది.

గెరిల్లాయుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా అభివృద్ధి చేయాలనే 2007 ఐక్యత కాంగ్రెస్ నిర్ణయాన్ని అనుసరించి ఏప్రిల్ 6, 2010న ముకరం (డీకే) వద్ద ఒక పెద్ద ఆంబుష్ నిర్వహించి సీఆర్‌పీఎఫ్‌కు చెందిన ఒక కంపెనీ బలగాల్ని (మొత్తం 76 మందిని) తుడిచిపెట్టింది. 2008లో ఏఓబీలోని బలిమెల రిజర్వాయర్‌లో ఒక పెద్ద ఆంబుష్ చేసి 38 మంది ఆంధ్రప్రదేశ్ గ్రేహౌండ్స్ పోలీసులను, మరో నలుగురు పోలీసులను నిర్మూలించింది. బీహార్-ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఏఓబీల్లో రైళ్లల్లో ప్రయాణించే శత్రు సాయుధ బలగాలపై పీఎల్‌జీఏ ఆంబుష్‌లు నిర్వహించింది. డీకే, బీజేల్లో కొన్నిచోట్ల హెలికాప్టర్లపై దాడి చేసి శత్రువును ఓ మేరకు నష్టపరిచింది. డీకే, బీజేల్లో అనేక చోట్ల నైట్ ఆంబుష్‌లు చేసింది.

దేశవ్యాప్తంగా ప్రజా శత్రువులైన రాజకీయ నాయకులను ఎందరినో పీఎల్‌జీఏ శిక్షించింది. ప్రజా శత్రువులైన కొంతమంది ఎంపీలను, ఎమ్ఎల్ఏలను, సర్పంచ్‌లను, బూర్జువా, రివిజనిస్టు, నయా రివిజనిస్టు, హిందుత్వ పార్టీల రాజకీయ నాయకులను నిర్మూలించింది. 2003లో అలిపిరిలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై, 2007లో అదే రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జనార్ధన్‌రెడ్డిపై, 2008లో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి బుద్ధదేవ్‌పై సాహసిక ఆంబుష్‌లు నిర్వహించింది. 2013లో డీకేలో జీరంఘాటీ వద్ద సల్వాజుడుం నాయకుడు, నరహంతకుడయిన మహేంద్రకర్మను తుడిచిపెట్టింది. డీకే, బీజేల్లో కొన్నిచోట్ల ఎస్పీ, ఏఎస్పీ ర్యాంకు పోలీసు అధికారులను నిర్మూలించింది. శత్రు ఇంటలిజెన్స్-ఇన్‌ఫార్మర్-కోవర్ట్ వ్యవస్థను, విప్లవ ప్రతీఘాతుకులను ఒక మేరకు దెబ్బతీస్తూ వస్తోంది.

ఉద్యమ ప్రాంతాలలో ప్రజాపునాది వున్న చోట విప్లవ ప్రజలను, మిలీషియాను కదలించి పలుమార్లు శత్రు సప్లయిల్ని స్వాధీనం చేసుకుంది, ప్రభుత్వ, విదేశీ బహుళజాతి-స్వదేశీ దళారీ కార్పొరేట్ కంపెనీల, భూస్వాముల, ప్రజా శత్రువుల ఆస్తులపై వందలాది సాబోటేజ్ చర్యల్ని నిర్వహించింది.

ఈ 20 ఏళ్ల కాలంలో దేశంలో దోపిడీ పాలకవర్గాలు నిర్వహించిన బూటకపు పార్లమెంటరీ ఎన్నికలను, అనేక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించే క్యాంపెయిన్లను విజయవంతం చేయడంలో భాగంగా టీసీఓసీలను (టాక్టికల్ కౌంటర్ అఫెన్సివ్ క్యాంపెయిన్)లను చేపట్టింది.

ఈ 20 ఏళ్ల కాలంలో బీహార్-ఝార్ఖండ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఏఓబీ, దండకారణ్యం, పశ్చిమ బెంగాల్‌ల్లో పదుల సంఖ్యలో రెయిడ్లు చేసి విలువైన అనుభవాల్ని సంపాదించింది. ఇందులో ఒక్కో రెయిడ్‌కు ఒక్కో ప్రాధాన్యత వుంది. బీజేలో గిరిడి, జహానాబాద్, జాజ్‌పుర్ రెయిడ్లు, ఏఓబీలో కలిమెల-మోటు సంయుక్త రెయిడ్, ఆర్.ఉదయగిరి మల్టిపుల్ రెయిడ్, కోరాపుట్ క్యాంపెయిన్, డీకేలో మురికినార్, రాణిబోదిలి రెయిడ్లు, పశ్చిమ బెంగాల్‌లో శిల్దా రెయిడ్, సీఎమ్‌సీ ప్రత్యక్ష నాయకత్వంలో ఈస్ట్రన్, సెంట్రల్ రీజియన్ల సంయుక్త కమాండింగ్‌లో జరిగిన నయాగఢ్ రెయిడ్లకు ప్రత్యేక ప్రాధాన్యత వుంది.

కమీషన్లు-కమాండ్ల కర్తవ్యాలు-ఫంక్షనింగ్ పై రాజకీయ-సైనిక విధానపర సర్క్యులర్, వ్యూహాత్మక ప్రాంతాల్లోకి చొరబడుతున్న శత్రువును ప్రతిఘటించే ఎత్తుగడలు వంటి సైనిక మాన్యువళ్లను విడుదల చేసింది. శత్రు కౌంటర్ ఇన్‌సర్జెన్సీ వ్యూహాన్ని అర్థం చేసుకునేందుకై అవసరమైన సాహిత్యాన్ని విడుదల చేసింది. రాజకీయ-సైనిక ఇంటలిజెన్స్‌ను నిర్మాణం చేసి అభివృద్ధి చేసేందుకు ఆరోప్రాణం గ్రంథంతో పాటు ఇతర సాహిత్యాన్ని విడుదల చేసింది. ఒక సెంట్రల్ ఇన్‌స్ట్రక్టర్ టీమును ఏర్పాటు చేసింది.

సామ్రాజ్యవాద, భూస్వామ్య కుసంస్కృతిని ప్రజల మనస్సుల నుండి కూకటివేళ్ళతో పెకిలించి శాస్త్రీయమైన, ప్రగతిశీల, ప్రజాస్వామ్య, విప్లవకర సంస్కృతిని ప్రజల మనస్సుల్లో



**ప్రజా యుద్ధంలో ప్రహార్‌కు దీటుగా కవాతు జరుపుతున్న ప్రజా సైనికులు**

రంగరింపజేసే సాంస్కృతిక కర్తవ్యం కూడా పీఎల్‌జీఏ నిర్వహిస్తున్నది.

మన పార్టీ నాయకత్వంలో సాగుతున్న దీర్ఘకాల ప్రజాయుద్ధ క్రమంలో పోరాట, నిర్మాణ రూపాలలో సంపన్నమైన అనుభవాలు లభించాయి. గెరిల్లా యుద్ధం, ప్రజాసైన్యం, ప్రజల రాజకీయాధికారం, గెరిల్లాజోన్లు, గెరిల్లాబేసులు, విముక్తి ప్రాంతాల గురించిన పార్టీ ఆచరణాత్మక, సూత్రబద్ధ అవగాహన పెరిగింది. గెరిల్లాజోన్లలో గెరిల్లా సైన్యం, గెరిల్లా యుద్ధం ప్రధాన నిర్మాణ, పోరాట రూపాలుగా ఉంటాయనీ, పిఎల్‌జిఏ సంఘటితం అవుతున్న కొద్దీ గెరిల్లా యుద్ధం తీవ్రతరమవుతుందనీ మన ఆచరణలో మరోమారు రుజువైంది.

గెరిల్లా యుద్ధంలో గొప్ప నమూనాలుగా నిలిచే ఉన్నత స్థాయి ఎత్తుగడల ఎదురుదాడులు నిర్వహించి శత్రువును పిఎల్‌జిఏ కంగు తినిపించింది. గెరిల్లా నియమాలైన రహస్యం,వేగం,దృఢసంకల్పాన్ని పరిస్థితులకు తగిన విధంగా తు.చ.తప్పకుండా అమలు పర్చడం వల్లనే ఈ దాడులలో అది విజయాలను సాధించగలిగింది.

శతృదాడి నుండి విప్లవోద్యమాన్ని, ప్రజా ఉద్యమాలను, ప్రజల నూతన రాజకీయాధికార అంగాలను కాపాడుతూ విస్తరింపజేయడంలో కీలకపాత్ర పోషించింది. శత్రువుతో జరిపిన యుద్ధంలో పురోగతిని సాధిస్తూ ఎత్తుగడల రూపకల్పనలో పార్టీకి గొప్ప అనుభవాలను సమకూర్చింది.

రెయిడ్లు, వివిధ రకాల ఆంబుష్‌లు, బూబీట్రాప్స్, స్పెషల్ యాక్షన్స్, ఆర్థికదాడులు, మెరుపుదాడులు ఇలా అనేక రూపాలలో గెరిల్లా చర్యలు నిర్వహించిన పిఎల్‌జిఏ గెరిల్లా యుద్ధతంత్రంలో అనేక నూతన అనుభవాలను నేర్చుకుంది. దాడులు, హెలికాప్టర్ల పై దాడులు, మెరుపు దాడులు, సింగిల్ యాక్షన్లు మొదలైన రూపాలలో చర్యలు నిర్వహించి గెరిల్లా యుద్ధంలో పిఎల్‌జిఏ అనేక నూతన అనుభవాలను గడించింది. అది కరుడుగట్టిన రాజకీయ నాయకులను, భూస్వాములను, పోలీసు అధికార్లను, ఇన్‌ఫార్మర్లను, విప్లవ ద్రోహులను నిర్మూలించింది. విప్లవ ప్రతీఘాతుక సల్వాజుడుం, సేంద్ర, నాగరిక్ సురక్షా సమితి, సోషల్ ఫాసిస్టు హర్మద్ వాహినిలను, రణవీర్ సేన వంటి ప్రైవేట్ సైన్యాలను ఓడించింది. టిపిసి, జెపిసి, జెఎల్‌టి, పిఎల్‌ఎఫ్‌ఐ, ఎస్‌పిఎం, శాంతిసేన, శాంతి కమిటీ, భైరవ సేన వంటి విప్లవ ప్రతీఘాతుక గ్యాంగుల అహంకారాన్ని అణచేందుకై హోరాహోరీ పోరాడుతున్నది.

విప్లవోద్యమ నిర్మూలనకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎల్‌ఐసిలో భాగంగా అనేక విప్లవ ప్రతీఘాతుక సైనిక క్యాంపెయిన్లను కొనసాగిస్తూ దేశవ్యాప్తంగా కార్పెట్ సెక్యూరిటీని, ఫోర్టిఫైడ్ క్యాంపులను, స్టేషన్లను విస్తరింపజేస్తున్నాయి. వీటిని దెబ్బతీయడంలో భాగంగా మన పిఎల్‌జిఏ రాణిబోదిలి, మురికినార్, బట్‌గావ్, మధుబని, ఆరా, ఎన్‌ఎండిసి, బొకారో, ఆర్.ఉదయగిరి, ఖాస్ మహల్, రాజ్‌పూర్-బఘేలా, సాంక్రైల్, నాల్కో, సిల్దా తదితర షార్ట్ సర్‌ప్రైజ్ అటాక్‌లను, రెయిడ్లను పిఎల్‌జిఏ నిర్వహించింది. పెద్ద సంఖ్యలో శత్రు బలగాలను నిర్మూలించడం ద్వారా ఈ దాడులు దేశవ్యాప్తంగా గెరిల్లా యుద్ధానికి గొప్ప ప్రేరణగా నిలిచాయి. ఇవి తాత్కాలికంగానైనా ఫోర్టిఫైడ్ క్యాంపులు, స్టేషన్లలో ఉంటున్న శత్రు బలగాల మనోస్థైర్యాన్ని దెబ్బతీయగలిగాయి.

కాలినడకన ఎక్కువ సంఖ్యలో లోతట్టు ప్రాంతాల్లోకి చొరబడి మాపింగ్‌అప్ చర్యలు, కూంబింగులు నిర్వహిస్తున్న శత్రు బలగాలను ఉర్పల్‌మెట్ట (దంతేవాడ), మినప (దంతేవాడ), జోర్కో-ఇందిపిడీ

(ఖుంటీ), బెహ్‌రాడీహ్ (పలామూ), లాతేహార్, కజరా (లఖిసరాయ్), ధర్‌ధరియా (లోహర్‌దగా) లాంటి దాడులలో వాటి వెంటబడి, వాటిని ముక్కలు, ముక్కలుగా విభజించి బలహీనమైన శత్రు భాగాన్ని ఎక్కువ సంఖ్యలో నిర్మూలించడం ద్వారా పిఎల్‌జిఏ వారిని ఎదుర్కొంది. ఈ చర్యలలో అది తన విన్యాసాల సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవడం ద్వారా కాలినడకన వచ్చే శత్రు బలగాలను నష్టపర్చడంలో ఒక గుణాత్మకమైన మార్పును అది తీసుకువచ్చింది. అనేక పెద్ద, మధ్య రకం దాడుల ద్వారా పిఎల్‌జీఏ శత్రు రోడ్ ఓపెనింగ్ పార్టీలను దెబ్బతీసి శత్రు సప్లైలకు, బలగాల బదిలీలు-తరలింపులకు, అధికార్ల పర్యటనలకు గ్యారంటీ లేని స్థితికి తాత్కాలికంగా నెట్టగలిగింది.

పిఎల్‌జిఏ గెరిల్లా బలగాల నుండి రక్షణ కోసం, బలగాల తరలింపు కోసం, వాటిపై దాడుల కోసం శత్రువు ఎంపివిలను, హెలికాప్టర్లను పెద్దయెత్తున ఉపయోగించడం మొదలైంది. ఎంపివిలు, వాహనాల్లో ప్రయాణిస్తున్న శత్రు బలగాలను దెబ్బతీయడం కూడా పిఎల్‌జిఏకు సాధారణంగా మారింది. మైన్ యుద్ధతంత్రాన్ని పిఎల్‌జిఏ సృజనాత్మకంగా అభివృద్ధి చేసి వివిధ సైజులలో ఇంప్రూవైజ్డ్ మైన్లను రూపొందించి శత్రు బలగాల మైన్ ప్రూఫ్/ బుల్లెట్ ప్రూఫ్/ సాధారణ వాహనాల పై విజయవంతంగా ప్రయోగించి పెద్దసంఖ్యలో వాటిని నిర్మూలించి, ఆయుధాలు స్వాధీనం చేసుకుంది.

శత్రు బలహీనతలను ఉపయోగించుకుని అనేక చర్యలలో పిఎల్‌జిఏ పోలీసుస్టేషన్/క్యాంపుల సమీపానికి వెళ్ళి శత్రువును దెబ్బతీసింది. వందలాది సింగిల్ ఏక్షన్స్ నిర్వహించడం ద్వారా ఉద్యమానికి వ్యతిరేకంగా నిలిచిన అనేకమంది భూస్వాములను, వారి ఏజెంట్లను, విప్లవ ప్రతీఘాతుక శక్తులను పిఎల్‌జిఏ నిర్మూలించింది. సల్వాజుడుంకు వెన్నుదన్నుగా నిలిచిన ప్రజావ్యతిరేక బూర్జువా పార్టీ నాయకులను, క్రూరులైన భూస్వాములను, పెత్తందారులను, జుడుం గూండాలను, ఎస్‌పిఓలను, క్రూరులైన కొందరు పోలీసు అధికారులను పిఎల్‌జిఏ అంతమొందించింది.

ప్రజా ప్రతిఘటనతో హర్రాకోడేర్ (తూర్పు బస్తర్)లోను, సాయుధ ప్రతిఘటన ద్వారా మినప (సుక్మా)లోను పెట్టిన క్యాంపులను ఎత్తి వేయించారు. ఇంకా అనేక చోట్ల పోలీసు క్యాంపులు వేయకుండా ప్రజలు అడ్డుకుంటున్నారు. ఏఓబి, డీకే, ఒడిషా లలో ప్రజలు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు.

పిఎల్‌జిఏ సాధించిన ఈ విజయాలన్నింటికి ప్రజల గొప్ప త్యాగాలు, ప్రజాయుద్ధంలో వారి క్రియాశీల భాగస్వామ్యమే ప్రధాన కారణం. క్రమంగా పిఎల్‌జిఏ సమీకరణ సామర్థ్యం పెరిగి శత్రువుతో గంటల తరబడి పోరాడడం, వెంటబడి తరమడం చేస్తున్నది.

గత 20 ఏళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మన ఉద్యమాన్ని నిర్మూలన కోసం అనేక విప్లవ ప్రతీఘాతుక పథకాల్ని రూపొందించి తీవ్రమైన దాడులు చేస్తున్నాయి.

ఇలా దాడులు కొనసాగడంతో దేశంలోని ఎర్ర ప్రతిఘటన ప్రాంతాల్లో, గెరిల్లా జోన్లలో మన పార్టీ, పీఎల్‌జీఏ, విప్లవ ప్రజాసంఘాలు, విప్లవ ప్రజా ప్రభుత్వాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వాటిని పునర్నిర్మించుకోవాలి. ఉద్యమాన్ని మరింత సంఘటిత పరుచుకోవాలి.

పిఎల్‌జీఏను రాజకీయంగా-మిలిటరీపరంగా-నిర్మాణపరంగా సంఘటితం (కన్సాలిడేషన్) చేసుకోవాలి. సామ్రాజ్యవాద, భూస్వామ్య విషసంస్కృతికి వ్యతిరేకంగా పోరాడుతూ నూతన ప్రజాస్వామిక సంస్కృతిని అభివృద్ధి చేసేందుకు సాంస్కృతిక రంగంలో సృజనాత్మక పద్ధతులలో కృషి చేయాలి. ప్రజలకు సేవకులుగా, వారితో భుజం-భుజం కలిపి పోరాడే సహయోధులు/యోధులుగా పార్టీ, పీఎల్‌జీఏ శ్రేణులు/బలగాలలో కమ్యూనిస్టు విలువలను పెంపొందించడం కోసం ప్రత్యేక కృషి జరపాలి.

దేశంలోనూ, ప్రపంచంలోనూ అనుకూల విప్లవ పరిస్థితిని వినియోగించుకుని వేగంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తగిన ఎత్తుగడలు చేపట్టి విప్లవ వెల్లువను సృష్టించండి. విప్లవోద్యమంలో లోపాలను చక్కదిద్దుకుంటూ, బలహీనతలను అధిగమిస్తూ, తప్పుల నుండి నేర్చుకున్న పాఠాలపై ఆధారపడి శత్రు వ్యూహాత్మక 'సమాధాన్' పథకాన్ని సాహసంగా ఎదుర్కోండి. సోషలిజం-కమ్యూనిజం లక్ష్యంతో దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో విప్లవోద్యమాన్ని మరిన్ని విజయాలు సాధించే వైపు పురోగమింపజేయండి. అంతిమ విజయం నిశ్చితంగా ప్రజలదే!

ప్రజల కష్టాలు,కన్నీళ్ళకు కారణమైన వారి దైనందిన సమస్యలతో పూర్తి స్థాయిలో మమేకమవుతూనే, మౌలిక సమస్యల పరిష్కారం కోసం వారిని చైతన్యపరుస్తూ, ప్రజలను సాయుధం చేయడం నేటి మన ముఖ్య కర్తవ్యం

పీఎల్‌జీఏ ప్రతి విషయంలో స్వయం సమృద్ధం కావడం ద్వారా నేటి క్లిష్ట పరిస్థితులను అధిగమించి ఉన్నత స్థాయికి ఉద్యమాన్ని అభివృద్ధి చేయగలుగుతుంది. ✶

'మన యుద్ధ శైలిని పూర్తిగా వికసింపచేయండి. యుద్ధంలో సాహసాన్ని ప్రదర్శించడం, త్యాగానికి, అలసటకు వెరువకుండా నిరంతరం పోరాడుతూ ఉండాలి ( విరామం లేకుండా స్వల్ప సమయంలోనే ఒక దాని వెన్నంటి మరో దాడికి ఉపక్రమించాలి) - మిలిటరీ చర్యల పది ముఖ్య నియమాలు- మావో - 1947

దక్షిణాసియాలో అమెరికా ప్రయోజనాలకు నక్సలిజం ఒక చాలెంజింగ్ సమస్య- యూఎస్ నావికాదళ అధికారి వ్యాఖ్య-2009

# అమెరికా ఎన్నికల్లో ఏ పార్టీ గెలిచినా
# ప్రపంచ ప్రజల నంబర్-1 శత్రువైన అమెరికా రాజకీయాలలో ఏ మార్పుండదు

అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచ ప్రజల నంబర్ వన్ శత్రువు. అది ప్రపంచాధిపత్యాన్ని నెరపుతున్న రాజ్యం. ఇప్పుడే కాదు, రెండవ ప్రపంచ యుద్ధం తర్వాతి నుండి దాని ఆర్థికాధిపత్యం, రాజకీయాధిపత్యం, సైనికాధిపత్యం ప్రపంచంపై కొనసాగుతున్నాయి. దాని చరిత్రలో ఇప్పటికి 45 సార్లు అధ్యక్షులు ఎన్నికయ్యారు. ప్రస్తుతం 46వ అధ్యక్షుడు ఎన్నికయ్యాడు. ఎన్నికలలో రిపబ్లికన్ అభ్యర్థి లేదా డెమాక్రటిక్ పార్టీ అభ్యర్థిలలో ఎవరు గెలిచినా అమెరికా ప్రపంచాధిపత్య విధానాలలో మార్పులేమి ఉండవు. వర్తమాన అధ్యక్షుడు జోబైడెన్ అదే మాట ఎన్నికల అనంతరం ఇపుడు మన మధ్య ఏ శతృత్వాలు లేవని చెప్పి స్పష్టం చేశాడు. డెమాక్రటిక్ పార్టీ వచ్చినా, రిపబ్లికన్ పార్టీ వచ్చినా అధికారంలో ఎవరు కూర్చున్నా ప్రజలకు జరిగింది ఒక్కటే. ప్రపంచ ప్రజల రక్తాన్ని పీల్చడం, ప్రపంచ వనరుల్ని కొల్లగొట్టడం, దురాక్రమణ దాడులు చేయడం, ప్రపంచమంతటా సైనిక స్థావరాలను విస్తరించడం, ఐఎమ్ఎఫ్, ప్రపంచ బ్యాంకు, డబ్ల్యుటిఒ లపై అదుపుతో ప్రపంచ దేశాలన్నింటి ఆర్థిక వ్యవస్థలను తమ చెప్పుచేతలలో పెట్టుకోవడమే వారు చేసేది. వారు తమ ప్రపంచ ఆధిపత్య వ్యూహానికి అనుగుణంగా పావులు కదుపుతూ నిరంతరం ప్రపంచ వ్యాపితంగా అల్లకల్లోల పరిస్థితులు నెలకొల్పడం లాంటి అమెరికా విధానాల్లో మౌలికంగా మార్పు వచ్చింది లేదు. గతంలో ఎంతో కొంత అర్థం కాకుండా నడిపించినవి ఇప్పుడు బహిరంగంగా చేస్తున్నారు. ఐసన్‌హోవర్, రీగన్, కెన్నడీ, నిక్సన్, ఒబామా, క్లింటన్, జార్జిబుష్ లు (సీనియర్, జూనియర్) వారి వారసులైన ట్రంపు, ఇప్పుడు జో బైడన్ అందరిదీ ఒకే వర్గం. ఒకే తత్వం. అదే దోపిడీ వర్గం, అదే దోపిడీ తత్వం. వారు అనుసరించే విధానం ఒక్కటే - అదే సామ్రాజ్యవాద దోపిడీ విధానం. అప్పుడు ఇప్పుడు కూడా అందరూ అక్కడి సైనిక పారిశ్రామిక కాంప్లెక్స్ ప్రయోజనాలను నెరవేర్చడం.

అమెరికా అనుసరించిన దోపిడీ యుద్ధ విధానాల ఫలితంగా ట్రంపు రక్షణ విధానాలను చేపట్టి అమెరికా ఫస్ట్ అని అనాల్సి వచ్చింది. గత విధానాలు గత దశాబ్దం చివరి నాటికి అవి వికటించాయి. అది దాని ఏకైక అగ్రరాజ్య హోదాను నిలబెట్టుకోలేకపోయింది. అమెరికా ప్రపంచంలో అతిపెద్ద ఋణగ్రహీతగా మారింది. 2008 మొదలైన అమెరికా గృహరుణ సంక్షోభం వేగంగా పెరిగి అమెరికా ఆర్థిక వ్యవస్థ 2020 చివరికి గొప్ప మాంద్యం స్థితిలోకి వెళ్ళిపోయింది. దానికి తోడైన నేటి కోవిడ్ మహమ్మారి సంక్షోభ స్థితిని 1930లనాటి గ్రేట్ డిప్రెషన్‌తో పోల్చుతున్నారు. నిరుద్యోగం 25 శాతానికి పెరిగిపోయింది. అమెరికా అసమానతలు గతంకన్నా తీవ్రంగా పెరిగాయి. అమెరికాలో సంపన్నుల, పేదల మధ్య అంతరం ఎన్నడూ లేనంతగా పెరిగింది. 2006-2018 మధ్య అమెరికా సంపద 14 ట్రిలియన్ డాలర్లు (75 ట్రి నుండి 89 ట్రి) పెరిగితే, అందులో 12 ట్రిలియన్ డాలర్లు 10 శాతం సంపన్నులకు చేరింది. అందులో కూడా 90శాతం ఒక శాతం బడా సంపన్నుల దగ్గరే పోగుపడింది. మిగిలిన 2 ట్రిలియన్ డాలర్లు మాత్రమే 90 శాతం ప్రజలకు చేరింది. ఇదీ అమెరికా ఆర్థిక వాస్తవిక దృశ్యం.

అమెరికాలోని శ్వేతేతర జాతులు ముఖ్యంగా ఆఫ్రికా నల్లజాతీయులు అనుభవిస్తున్న 'మైనారిటీల అభద్రతా భావం' ట్రంపు కాలంలో మున్నెన్నడూ లేనంతగా పెరిగిన మాట వాస్తవం. అమెరికాలో రెండవ శ్రేణి పౌరులుగా జీవిస్తున్న ఫ్లాయిడ్ లాంటి నల్లజాతి యువకులు ప్రతీ సంవత్సరం కనీసం వెయ్యి మంది వరకు శ్వేత జాత్యహంకార పోలీసుల చేతులలో మరణిస్తున్నారు. పర్యవసానంగా గతంలో ఎన్నడూ లేని విధంగా అమెరికాలో, యూరప్ అంతటా (బ్లాక్ లైవ్స్ మేటర్) ఉద్యమం ప్రభంజనంలా వెల్లువెత్తడం ట్రంప్ ఓటమికి దారి తీసిన ప్రముఖ కారణాలలో ఒకటి.

2016-2020 సంవత్సరాల మధ్య 4సంవత్సరాల కాలంలో ట్రంపు అనుసరించిన విధానాలు దేశ విదేశాలలోని ప్రజలలో తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్నాయి. తుదకు ఆయన ప్రభుత్వంలోని అనేక మంది ఉన్నతాధికారులు ఆయనను వదిలి వెళ్లారు. అమెరికా అతి సంపన్నులలో ఒకడైన ట్రంపు ఆలోచనలను, ఆయన ప్రవృత్తిని ఒక అరాచకుడిగా, మూర్ఖుడిగా, వ్యసనపరుడిగా, స్త్రీలోలుడిగా ఇంకా అనేక మాటలలో వివరించారు. అలాంటి మూర్ఖుడికి నిజమైన అమెరికావాసులు, అమెరికా గౌరవ ప్రతిష్టలను కోరుకునే వారెవరూ ఓటు వేయరనే విధంగా ప్రచారం చేశారు. అందుకే జోబైడెన్ అమెరికా చరిత్రలో గత అధ్యక్షులను మించిన మెజార్టీతో గెలిచాడు. ప్రపంచంలోని మితవాద శక్తులు, మోదీలాంటి రియాక్షనరీ శక్తులు ట్రంపును ఎంత కీర్తించినా ఓటర్లను మాత్రం ఆకర్షించలేకపోయారు.

ప్రపంచంలో కోవిడ్-19తో ప్రభావితమైన వారు అమెరికాలోనే అత్యధికం. ట్రంపు దాని పట్ల అత్యంత అశాస్త్రీయ భావాలతో ఉంటూ అతి నిర్లక్ష్యంతో వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో

చెలగాటమాడాడు. ఫలితంగా, ప్రపంచం మొత్తంలో కోవిడ్ వైరస్ సోకిన వారిలో, చనిపోయిన వారిలో నగం మంది ఒక్క అమెరికాలోనే వున్నారు. 1 కోటి మందికి పైగా అమెరికన్లు ముఖ్యంగా నల్లజాతి ప్రజలు కరోనా బారిన పడ్డారు. అందులో దాదాపు 3 లక్షల మందికిపైగా ఆ వ్యాధితో మరణించారు. అమెరికా ఎన్నికల ప్రచారంలో బైడెన్‌కు ఇది ఒక మంచి ఆయుధంగా సహజంగానే పనిచేసింది. ప్రజల్లో నెలకొన్న కొరోనా భయం, ట్రంపు అనుసరిస్తున్న విధానాలు ఆయనను ఓడించడంలో గొప్పగా పనిచేశాయనీ నిస్సందేహంగా చెప్పవచ్చు.

2015లో పారిస్‌లో అనేక దేశాల మధ్య పర్యావరణ పరిరక్షణ ఒప్పందం జరిగింది. దానిలో అమెరికా సహా 200 దేశాల భాగస్వామ్యం వుంది. అయినప్పటికీ, ట్రంప్ ఆ ఒప్పందం నుండి ఏకపక్షంగా 2019 నవంబర్ 4న వైదొలగడం ప్రపంచ ప్రజల కన్నెరకు లోను చేసింది. ఆ దేశంలోని పర్యావరణానికి సంబంధించి 125 నిబంధనలను రద్దు చేశాడు. వాస్తవానికి కార్బన్ ఉద్గారాలలో సామ్రాజ్యవాదులే అగ్రస్థానంలో ఉన్నారు. వారే మిగితా ప్రపంచాన్ని అన్ని రకాల కాలుష్యాలకు గురి చేస్తున్నారు. ప్రపంచాన్ని మహా విపత్తులకు లోను చేస్తున్నారు. వాటిలో వర్తమాన కొరోనా ఒకటి. పారిస్ జలవాయు కాలుష్య ఒప్పందం నుండి వైదొలగిన అమెరికా మరోవైపు ఇరాన్‌తో కుదుర్చుకున్న అణు ఒప్పందం నుండి కూడ దాదాగిరితో ఏకపక్షంగా వైదొలగింది. పాలస్తీనా విషయంలో ప్రపంచ దేశాల నిర్ణయానికి భిన్నంగా జెరూసలెంను రాజధానిగా ప్రకటించాడు. ఉత్తర కొరియాను రాకెట్‌మ్యాన్ అంటూ అమితంగా తులనాడుతూ వచ్చిన ట్రంపు ఆయనతో చర్చలకు వెళ్లడం, వాటికి కుంటిసాకులతో అర్ధాంతరంగా నిలిపివేయడం ప్రపంచం ముందు ట్రంప్ నిలకడలేని విధానాలను వెల్లడి చేసింది. ఇవన్నీ అమెరికా ప్రపంచ ఆధిపత్యా విధానాల వ్యక్తీకరణ. వీటిని అమెరికా ఓటర్లే జీర్ణం చేసుకోలేక పోయారనీ అక్కడి అధ్యక్ష ఎన్నికల ఫలితాలు వెల్లడించాయి.

అమెరికా ఫస్టు విధానంలో భాగంగా ప్రపంచీకరణ విధానాలను కాదంటూ వాణిజ్య రంగంలో రక్షణ విధానం పేరుతో దిగుమతి సుంకాలు పెంచి, అనేక దిగుమతులపై ఆంక్షలు విధించి ప్రపంచ దేశాల వాణిజ్య యుద్ధానికి తెరలేపాడు. చైనాతో సరుకుల ఉత్పత్తిలో పోటీపడలేక, ఆర్థిక, వాణిజ్య రంగాలలో చైనాను అదుపు చేయడంలో భాగంగా తీసుకున్న చర్యలు ప్రపంచ మార్కెట్‌ను ప్రభావితం చేశాయి. అమెరికా ప్రజల ఆరోగ్య విషయాలలో ఒబామా కాలంలో ఉనికిలోకి వచ్చిన విధానాలను కాలదన్ని వారిపై పన్నుల భారాన్ని పెంచాడు. ఇవన్నీ అమెరికా ఓటర్లను ట్రంప్ విధానాలకు ప్రతికూలంగా ఓటు వేసేలా చేశాయి.

77 ఏళ్ళ జో బైడెన్ అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికైన అతి వృద్ధుడు. గతంలో అధ్యక్ష అభ్యర్థిత్వానికి రెండుసార్లు బరిలోకి దిగి మధ్యంతరంగానే తప్పుకోక తప్పలేదు. ఆయనతో పాటుగా అమెరికా ఉపాధ్యక్ష పదవికి కమలా హారిష్ ఎన్నిక కావడాన్ని మహిళా లోకం విజయంగానే ప్రచారం చేస్తున్నారు. కానీ, ఆఫ్రికా సంతతికి చెందిన ఒబామా అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికై ఆ ప్రజలకు ఎంత మేలు చేసిండో, ప్రస్తుతం అమెరికా ఉపాధ్యక్షురాలుగా ఎన్నికైన భారతీయ సంతతికి చెందిన కమలా హారిష్ మహిళలకు, భారత దేశానికి అంతే మేలు చేస్తుంది. అధికారంలో ఏ రంగువారున్నారు, మహిళా పురుషులలో ఎవరున్నారనేదానికి ఏమాత్రం విలువ ఉండదు. అధికారంలో ఉన్నవారెవరైనా సామ్రాజ్యవాద విధానాలకు సేవ చేయాల్సిందే! ఆయా సాంఘీక సమూహాలకు చెందినవారిని కొద్దికాలం మోసపుచ్చడానికి ఇలాంటి విషయాలను పాలకవర్గాలు చాలా తెలివిగా ముందుకు తెచ్చి వినియోగించుకుంటాయనేది గుర్తించాలి.

అయితే అమెరికా అధ్యక్షుడిగా ఏ పార్టీ అభ్యర్థి ఎన్నికయినా దాని ఆర్థిక, రాజకీయ, దేశ-విదేశాంగ, దౌత్య విధానాలు మారవు. రెండవ ప్రపంచ యుద్ధానంతరం నుండి గడిచిన 75 ఏళ్ల కాలంలో అమెరికాలో ఏ పార్టీకి చెందిన వాళ్లు అధికారంలో వున్నా ప్రపంచవ్యాప్తంగా ప్రాకృతిక వనరులను, చౌక శ్రమశక్తిని, మార్కెట్లను కొల్లగొట్టడం, దాని ఆదేశాలకు లొంగని దేశాలపై దురాక్రమణ యుద్ధాలను చేయడమే దాని మౌలిక రాజకీయ విధానం. ఇపుడు నూతన అధ్యక్షుడు జో బైడెన్ మునుపటి అధ్యక్షుడు ట్రంప్‌కు భిన్నంగా మాటలలో ఏమి చెబుతున్నప్పటికీ, మౌలికంగా అదే విధానాన్ని అనుసరిస్తాడు. ఆయన అణుయుద్ధ నివారణ, ఇరాన్‌తో అణు ఒప్పందం పునరుద్ధరణ, పర్యావరణంపై పారిస్ ఒప్పందంలో తిరిగి చేరిక, పశ్చిమాసియా (గల్ఫ్) ప్రాంతంలో శాంతి పునరుద్ధరణ, అఫ్ఘానిస్తాన్ వంటి దేశాల నుండి అమెరికా సేనల పూర్తి ఉపసంహరణ, హెచ్1బి1 వీసాల పునరుద్ధరణ వంటి కొన్ని ట్రంప్‌కు భిన్నమైన వైఖరులను ప్రకటించినప్పటికీ ఆచరణలో అవి ప్రజలను మభ్యపెట్టేవే తప్ప మరొకటి కాదు. చైనా పట్ల బైడెన్ విధానాలలో మార్పుకు సూచనలేమీ కనపడడం లేదు.

అమెరికా తన స్థితిని సంఘటితం చేసుకోవడానికి చైనాతో పోటీని తీవ్రతరం చేయడంతో పాటు ఆర్థిక, రాజకీయ రంగాల్లో సామ్రాజ్యవాద దేశాలతో, ప్రత్యేకంగా తన ప్రత్యర్థి సామ్రాజ్యవాద దేశాలతో పోటీ, కుమ్మక్కులను కొనసాగిస్తుంది. డెమాక్రటిక్ పార్టీకి చెందిన బరాక్ ఒబామా అధ్యక్షుడుగా వున్న 2011లోనే తనకు ప్రత్యర్థి దేశంగా ఎదుగుతున్న చైనాను దెబ్బతీసేందుకు ఆసియా కేంద్రిత విధానాన్ని (ఆసియా-పీవోట్ పాలసీ) అమెరికా రూపొందించుకుంది. అదే విధానాన్ని ట్రంప్ కొనసాగించాడు. అదే విధానాన్ని బైడెన్ కూడా కొనసాగిస్తాడు.

ట్రంప్ మాదిరిగానే బైడెన్ ప్రభుత్వం కూడా ఆసియా-పసిఫిక్

ప్రాంతంపై కేంద్రీకరిస్తూ, చైనాను తన ప్రధాన వ్యూహాత్మక ప్రత్యర్థిగా ఎంచుతూ దానిని నియంత్రించే వైఖరినే కలిగి ఉంది. **ఆర్థికంగా,** ఆ ప్రాంతంలో తన మిత్రదేశాలతోనూ, వాటి మధ్యనూ సంబంధాలు బలోపేతం చేసుకోవాలని, వాటితో వాణిజ్య ఒప్పందాలను పునరుద్ధరించుకోవాలని భావిస్తుంది. అమెరికాకు దీటుగా చైనా ఆ ప్రాంతంలో 'ప్రపంచీకరణ', 'స్వేచ్ఛా వాణిజ్యం' పేరుతో అమెరికా మిత్రదేశాలతో, భాగస్వామ్య దేశాలతో పాటు వివిధ దేశాలతో ఒప్పందాలు చేసుకునేందుకు కృషి చేయాలని భావిస్తోంది. అది 'ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం' (ఆర్‌సీఈపీ) వంటి ప్రాంతీయ ఒప్పందాలను కూడా ముందుకు తేవాలని చూస్తోంది. ఇటువంటివన్నీ వివిధ దేశాల గ్రూపులతో కలిసి చైనా, అమెరికాలు కీలకమైన భూమికలు పోషించే పలు సన్నిహిత బహుపక్షీయ ఒప్పందాలకే దారితీస్తాయి. ఫలితంగా **రాజకీయంగా,** చైనాతో తలపడేందుకు బైడెన్ ప్రభుత్వం తన మిత్రపక్షాలతో కూడిన వ్యవస్థపై ఆధారపడక తప్పని స్థితి కొనసాగుతుంది. ఎందుకంటే ఆ ప్రాంతంలోని దేశాలు అమెరికాను కాదనలేక కొన్ని చర్యలు చేపట్టినప్పటికీ, చైనాను కాదని అవి పూర్తిగా అమెరికా పక్షం వహించే స్థితి లేదు, చైనాతో **సైనికంగా** ఘర్షణకు దిగే స్థితి లేదు. అయితే చైనా తన బెల్ట్ అండ్ రోడ్ పథకంలో భాగస్వామ్య దేశాలతో సంబంధాలను బలోపేతం చేసుకుంటూ అమెరికా వ్యూహం నుంచి వాటిని బయటకు తీసుకొచ్చి తన మిత్రపక్షాన్ని విస్తరించుకునేందుకు ప్రయత్నాలు చేస్తుంది.

ఏదిఏమైనా రానున్న రోజుల్లో ఇండో–పసిఫిక్ రీజియన్‌లో అమెరికా, చైనాల మధ్య పోటీ, ఘర్షణలు తీవ్రతరమవుతాయి. ఈ ప్రాంతంలో చైనా ప్రభావాన్ని ఎదుర్కోవడానికి అమెరికా ఇప్పటికే భారతదేశం, జపాన్, ఆస్ట్రేలియాలను కలుపుకుని 'క్వాడ్' (క్యాయూఏడీ–క్వాడ్రి లేటరల్ సెక్యూరిటీ డైలాగ్: చతుర్ముఖ రక్షణ ఒప్పందం) పేరుతో ఒక సైనిక కూటమిని ఏర్పర్చింది. 2020 మే, అక్టోబర్ నెలల్లో అది బంగాళాఖాతం, అరేబియా సముద్రాల్లో మలబార్ ఎక్సర్‌సైజెస్ పేరుతో సైనిక విన్యాసాల్ని నిర్వహించింది. ఈ సైనిక విన్యాసాలు చైనాను ఎదుర్కోవడానికి ఉద్దేశించినవే.

కామ్రేడ్ లెనిన్ స్పష్టం చేసినట్టు సామ్రాజ్యవాదం అంటేనే యుద్ధం. ప్రపంచమార్కెట్‌పై ఆధిపత్యం కోసం వారి మధ్య ఏ దేశంలో ఎవరు అధికారంలో వున్నా యుద్ధాలు, దురాక్రమణ యుద్ధాలు తప్పవు. అమెరికా ఆయుధ పరిశ్రమ నడవడానికి ఆయుధాల వ్యాపారం కొనసాగి తీరాలి. ఇప్పటికే ప్రపంచంలో 150 దేశాలలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలను అది నిలబెట్టుకతీరాలి. అమెరికా యుద్ధ వ్యూహాలన్నీ పెంటగాన్ కనుసన్నలలో నడవాల్సిందే.

2021 జనవరి 20న కొత్త అధ్యక్షుడు శ్వేతసౌధంలో అడుగుపెట్టి పరిపాలన కొనసాగిస్తాడు. కానీ, ప్రపంచంలోనే అత్యంత ప్రజాస్వామిక దేశంలో తన ఓటమిని అంగీకరించడానికి ట్రంప్ మొండికేస్తూ ఎన్నికల ప్రక్రియనే విమర్శిస్తున్నాడు. శ్వేతసౌధం వదలడానికే అతగాడు సిద్ధపడడంలేదు. ప్రపంచ సంక్షోభం తీవ్రతరం అవుతున్నా కొద్దీ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ముసుగు చిరిగిపోతుంది. ఫాసిస్టు విధానాలు బహిరంగంగా ముందుకువస్తున్నాయి. ఇలాంటి అనేక పరిణామాలు అక్కడ పెంపొందుతున్న విప్లవ పరిస్థితుల సానుకూలతను తెలియజేస్తున్నవి. అమెరికాలో ఇటీవలే నూతనంగా ఒక మావోయిస్టు కమ్యూనిస్టు ఏర్పడింది. అక్కడి కార్మిక వర్గాన్ని సామ్రాజ్యవాద అమెరికా విధానాలకు వ్యతిరేకంగా సంఘటితం చేయడం అక్కడి మావోయిస్టు పార్టీల ముందున్న ప్రధాన కర్తవ్యం. వర్తమాన పరిస్థితులు అందుకు ఎంతో అనుకూలంగా ఉన్నాయి. ✶

---

*(17వ పేజీ తరువాయి....)*

రెండూ ఎన్‌డిఎ వైపునే హిందుత్వను బలపరిచాయి. ఎల్‌జెపి నాయకుడు, మాజీ కేంద్రమంత్రి దివంగత రాం విలాస్ పాశ్వాన్ కుమారుడు చిరాగ్ పాశ్వాన్ పదవీ వ్యామోహంతో తాజాగా ఎన్‌డియే కూటమి నుండి పాక్షికంగా మాత్రమే తప్పుకుని ఈ ఎన్నికల్లో 40 స్థానాలకు పోటీ చేశాడు. జేడీ(యూ)తో ఉన్న విభేదం ఒక కారణమైతే, అవకాశం వస్తే ఎవరితో నైనా చేరిపోయి ముఖ్యమంత్రి లేదా కనీసంగా ఉపముఖ్యమంత్రి కావాలన్న ఆశా మరో బలమైన కారణం. చిరాగ్ పాశ్వాన్ ఆశించిన సీట్లలో ససాధించినవి అత్యల్పం. ఒకే ఒక్క సీటు రావడంతో చిరాగ్ వ్యూహం ఫలించలేదు. కానీ, జెడీయూ గెలిచే స్థానాలు తగ్గించడంలోను, ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చడంలోను, హిందుత్వకు పట్టం కట్టడంలోనూ చిరాగ్ రచించిన వ్యూహం ఫలించింది. బాబా సాహెబ్ అంబేద్కర్ త్యాగాలతో ఇలాంటి దళిత కార్డు హోల్డర్లు హిందుత్వ శక్తులకు దాసోహమవుతున్నాయి.

బిహార్ ఎన్నికల ప్రహసనం ముగిసింది. బిజేపి బలపడి నిశీత్‌కుమార్‌ను గుప్పిట పట్టి ఆడించగల పట్టు సంపాదించింది. బీహార్ ఎన్నికలు ప్రజలకు మరిన్ని కష్టాలు తెచ్చాయి. ఎన్నికల ద్వారా ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం కావు. ప్రజల మౌలిక సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గం. నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారానే ప్రజలకు విముక్తి లభిస్తుంది.

( ఇదే సమయంలో 11 రాష్ట్రాలలో జరిగిన 59 స్థానాల ఉప ఎన్నికలలో బిజెపీ 40 స్థానాలను గెలుచుకుంది.)

✶

# అత్యంత నాటకీయంగా సాగిన అమెరికా ఎన్నికలు

ఈసారి అమెరికా రాష్ట్రపతి ఎన్నికలలో ప్రపంచం గతంలో ఎన్నడూ చూడని అత్యంత ఉత్కంఠభరిత టీవీ రియాలిటీ కార్యక్రమాన్ని వీక్షించింది. ఎన్నికలలో ఓడిపోతే విచారణ ఎదుర్కోవాలి, అవమానాల పాలు కావాలి, సర్వం కోల్పోవాలన్న నిస్పృహతో అమెరికా రాష్ట్రపతి అదుపు, అర్థం లేని ప్రేలాపనలు చేశాడు. ఊహాగానాలు, పెద్ద పెద్ద అబద్ధాలు ఓటర్లను గందరగోళపరిచాయి. రక్తపాతాన్ని సూచించాయి. 'వామపక్షం తిరుగుబాటుకు పథకం పన్నుతున్నది', 'అంతర్యుద్ధం రావచ్చు' అని విస్తృత ప్రచారం జరిగింది. ట్రంప్ తనకు తానే గెలిచినట్టుగా ప్రకటించుకున్నాడు. ట్రంప్ శ్వేతసౌధాన్ని ఖాళీ చేయకపోవడం మరింత ఉత్కంఠ కలిగించింది. ఈ వ్యాసం పూర్తి అయ్యే నాటికి ఉన్న పరిస్థితి ఇది. ఆ తరువాత ఇంకా చాలా జరుగుతుండవచ్చు.

ఇంతకాలం మన దేశంలో 0.1 శాతం అక్షరాస్యులలో అతి కొద్ది మందికి కూడా అమెరికా ఎన్నికల ప్రక్రియ గురించి తెలియదు. అయితే ఈసారి మన ప్రాంతీయ భాషా ప్రసార సాధనాలు కూడా ఈ విషయాన్ని విరివిగా ప్రసారం చేశాయి. ప్రజాస్వామిక విలువలను వల్లిస్తున్న దేశంలోనే, రాష్ట్రపతి ఎన్నికకు పోటీలో పాలక వర్గం ధనిక వర్గంపై విశ్వాసం ఉంచడం, ప్రజా అభిప్రాయాన్ని పక్కన పెట్టడం నగ్నంగా వెల్లడయింది. తమ ఇష్టాయిష్టాల ప్రకారం ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడానికి రాజకీయ వర్గాలు అవలంబించే మోసపు మార్గాలను ఆ జాతి వ్యవస్థాపకులు రాజ్యాంగంలోనే పొందుపరిచారు. ఇది కార్పొరేట్ ప్రయోజనాన్ని మాత్రమే కాపాడే పుచ్చిపోయిన రాజ్యాంగం. సంబంధిత మంత్రిత్వ శాఖతో కూడా చర్చించకుండా తన విధానాలను ప్రజలకు ప్రకటించే ట్రంప్ 'ట్వీట్ విభాగం'గా మారిపోయింది అమెరికా ప్రభుత్వం. ఎన్నికల కాలంలో ఈ కళ మరింత నైపుణ్యం సాధించింది. అభిప్రాయాలను మలచగలిగే సోషల్ మీడియా వినాశకర శక్తి పౌరులలో అవిశ్వాసాన్ని, అసూయా ద్వేషాలనూ కలిగించి విభజనకు దారి తీసింది. మితవాద చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దారి తీసిన రాజకీయ ఊహాగానాల క్రీడ నిజానికి ట్రంప్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ఆరంభమయింది. 'బూటకపు అమెరికా ప్రజాస్వామ్యం' ఇంకా ఏమన్నా మిగిలి ఉన్నదా?

ప్రారంభంలో సజావుగా కనిపించిన వాతావరణం తరువాత గట్టి సమరంగా, సన్నిహిత తేడాతో ముగిసింది. జాతిద్వేషం, సంకుచిత భావజాలం కలిగి ఉన్నవాడుగా పేరు పొందిన ట్రంప్ దాదాపు గెలుపు దగ్గరకు చేరుకోవడం చూసి, అమెరికా గురించి గొప్పగా ఆలోచించే అమాయక పట్టణవాసులు ఆశ్చర్యచకితులయ్యారు. వికలాంగులను, శక్తిహీనులను, వెనుకబడిన వారినీ ట్రంప్ బహిరంగంగా ఎగతాళి చేశాడు. మహిళలపై ఘోరమైన వ్యాఖ్యలు చేసిన మహిళా ద్వేషి అతను. రెండు కోట్ల మంది పేద ప్రజల ఆరోగ్య సంరక్షణను రద్దు చేయాలనుకున్నాడు. దక్షిణాది సరిహద్దులో బంధించి తిరిగి కలుసుకోలేని విధంగా మధ్య అమెరికా ప్రాంత కుటుంబాలను విడదీసి భవిష్యత్తు శరణార్థ బాలలను సృష్టించాడు. ట్రంప్ సర్కస్‌లో ఉన్న మూడు వలయాలు – శ్వేతసౌధం, ఎందుకూ కొరగాని సెనేట్, రాజకీయమయమైన న్యాయవ్యవస్థా పాలనను కలుషితం చేశాయి. ట్రంప్ ప్రజాస్వామిక నియమాలను ఉల్లంఘించాడు. వృత్తిపర ప్రభుత్వ ఉద్యోగులను, విధాన నిపుణులనూ బయటకు నెట్టివేశాడు. పర్యావరణ పరిరక్షణ ఏజెన్సీ, అంతర్గత వ్యవహారాల శాఖ వంటి కీలక విభాగాలకు కార్పొరేట్ లాబీయిస్టులను అధిపతులను చేశాడు. వేలాది మంది ప్రభుత్వోద్యోగులకు ఉద్యోగ భద్రత లేకుండా చేశాడు. దీని ఫలితంగా చరిత్రలో మొట్టమొదటిసారిగా ప్రతి సహాయక కార్యదర్శి పదవిలో తాత్కాలిక చీఫ్ లేదా రాజకీయ నియమిత వ్యక్తి బాధ్యతలు చేపట్టారు. పాలనా వ్యవస్థను తిరిగి సరైన పద్ధతిలోకి తీసుకురావడానికి దశాబ్దం పాటు పట్టే స్థాయిలో పాలనా వ్యవస్థను నాశనం చేశాడు. ముఖ్యంగా న్యాయ వ్యవస్థను పై నుంచి కింది వరకు మితవాద ప్రతీఘాతకులతో నింపివేశాడు.

ట్రంప్ పాలనా కాలమంతటా మెయిన్ స్ట్రీమ్ మీడియా అతని మీద కత్తులు ఝళిపిస్తూ వచ్చింది. అతన్ని, అతను చేసిన పన్నుల కుంభకోణాలను, అధికార మద్దతుతో అతని కుటుంబం చేసిన ద్రవ్య దోపిడీని, రష్యా, చైనాలతో వారి సంబంధాన్నీ తీవ్రంగా ఎండగట్టింది. ట్రంప్ లంచగొండితనాన్ని వరదలా సృష్టించాడు, అసమర్థంగా వ్యవహరించాడు, చట్టాన్ని ఘోరంగా ఉల్లంఘించాడు.

అన్నింటికీ మించినది కోవిడ్-19 మహమ్మారి విషయంలో అతని వైఖరి. నాగరికత ఎదుర్కొన్న అత్యంత ఘోరమైన ఈ మానవ సంక్షోభంలో మూడు లక్షల మంది మరణాలకే కాకుండా ఇష్టారాజ్యంగా లాభాలు ఆర్జించేందుకు పెట్టుబడిదారులకు అవకాశం ఇచ్చినందుకు ట్రంప్ ఒక్కడే కారణం. లాభాల కోసమే హేతువును, విజ్ఞానాన్ని విడిచిపెట్టాడు. ఆర్థిక వ్యవస్థను చలనంలో ఉంచే ఉద్దేశంతో అతను సృష్టించిన ఉన్మాదం, 'జీసస్ నా వాక్సిన్', 'మాస్క్ వేసుకోకపోవడం పురుష లక్షణం' వంటి సంప్రదాయాలు చొచ్చుకుపోవడానికి దారి తీసింది. తన తప్పుడు వ్యవహారాన్ని కప్పి పుచ్చుకోవడానికి చైనా వ్యతిరేక భావనలను ముందుకు తీసుకువచ్చాడు. చైనాతో కలిసి కుట్ర పన్నిందంటూ, సమాచారాన్ని

తెలియపరచకుండా అడ్డుకున్నదంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థపై ఆరోపణలు చేసి దానితో అర్థాంతరంగా సంబంధాలు తెంచుకున్నాడు.

ఊహించిన దానికి విరుద్ధంగా, నూతన యుద్ధమంటూ ప్రారంభించనప్పటికీ యుద్ధ ఆర్థిక వ్యవస్థలో మందగింపును అధిగమించడం కోసము, పెరుగుతున్న అంతర్ సామ్రాజ్యవాద వైరుధ్య అవసరాలకు సన్నాహకంగానూ ట్రంప్ మరోసారి ఆయుధ పోటీ ప్రారంభించాడు. స్పేస్‌లో సైనికీకరణను తొలగించడానికి బదులు, ట్రంప్ పెంటగాన్ రక్షణ కోసం స్పేస్ ఫోర్స్‌ను సృష్టించాడు. ఐరోపా రక్షణ కోసం ఏర్పడిన ఓపెన్ స్కైస్ ట్రీటీ నుంచి ఉపసంహరించుకున్నాడు. రీగన్ ప్రభుత్వం ఏర్పరచుకున్న ఇంటర్మీడియట్ రేంజ్ న్యూక్లియర్ ఫోర్సెస్ ట్రీటీని రద్దు చేశాడు. ఇది ఐరోపా, ఆసియాలలో మరోసారి ఆయుధ పోటీకి దారి తీస్తుంది. డిఫెన్స్ బడ్జెట్ వార్షికంగా ఒక ట్రిలియన్ డాలర్లకు మించిపోతుంది. తక్కిన ప్రపంచమంతా కలిపి రక్షణపై పెట్టే ఖర్చు కంటే ఇది అధికం. అణ్వాయుధాల కోసం 44.5 బిలియన్ డాలర్లు, గత సంవత్సర కేటాయింపులో 20 శాతం పెంపుదలా కలిపి చైనా (10.4 బిలియన్ డాలర్ల) కంటే నాలుగు రెట్లు, రష్యా (8.5 బిలియన్ డాలర్ల) కంటే ఐదు రెట్లు మించిపోయింది. కాలం చెల్లిపోయిన ఐసీబీఎంలను తిరిగి ఉపయోగిస్తున్నారు. సబ్‌మెరైన్‌ల నుంచి విడిచిపెట్టే బాలిస్టిక్ మిసైళ్లు మరింత కచ్చితంగా పని చేస్తూ, శక్తివంతమైనవి అయినప్పటికీ ఐసీబీఎంలను ఆధునీకరించడానికి 100 బిలియన్ డాలర్లు కేటాయించారు. ఇప్పుడు వీటి కోసం ఆయుధాగారాలను పెంచాలి. ఒక్కొక్క దానికీ 24కు మించిన ఎస్ఎల్‌బీఎంలతో అమెరికా వద్ద 12 సబ్‌మెరైన్‌లు ఉన్నాయి. వీటితో వందలాది మెట్రోపాలిటన్ నగరాలను ధ్వంసం చేయవచ్చు.

చమురు తదితర హైడ్రోకార్బన్ కార్పొరేట్‌లకు ట్రంప్ ప్రతినిధి. పర్యావరణ పరిరక్షణ కోసం అన్ని రకాల నియంత్రణలనూ వ్యతిరేకించాడు. అందువల్లనే పారిస్ ప్రోటోకోల్ నుంచి బయటకు వచ్చాడు. నిజానికి 2008 నాటి నుంచి పెరుగుతున్న సంక్షోభం మరింతగా పెరుగుతూ దానిని అధిగమించడానికి చేసే సమస్త ప్రయత్నాలూ కనీస మాత్రపు ప్రభావాన్నే కలిగిస్తున్నాయి, మరింత తీవ్రతకే దారి తీస్తున్నాయి. ఈ రకంగా అమెరికా పాలక వర్గంలో ఒక సెక్షన్ ప్రపంచ వాణిజ్య సంస్థ, ప్రపంచీకరణలను విడిచిపెట్టి మొత్తంగా రక్షిత విధానాలను చేపట్టాలని బలంగా భావిస్తున్నది. చైనా, రష్యా కుమ్మక్కు వల్ల ప్రపంచంలో తన అగ్ర స్థానాన్ని నిలబెట్టుకోవడం అమెరికాకు కష్టతరమవుతున్నది. ఐరోపా యూనియన్, లేదా టర్కీల నుంచి ఎదురవుతున్న ప్రతిఘటన అమెరికా ప్రపంచాధిపత్యాన్ని బలహీనపరుస్తూ క్షీణింపజేస్తుండడంతో ఇప్పటికే అది రాజకీయ రంగంలో విఫలమవుతున్నది. ట్రంప్ పాలనలో అమెరికా విదేశీ విధానం యుద్ధపూరితంగా ఉండి, ఘర్షిస్తున్న సమూహాలను మరింతగా సంఘటితం చేసింది. ఈ విధంగా ప్రస్తుత బహు ధృవ ప్రపంచంలో ప్రముఖ వైరుధ్యం తీవ్రతరం కావడం చూస్తున్నాం.

నిజానికి ప్రస్తుత సంక్షోభ కాలంలో ట్రంప్ యుగం పాలక వర్గాలకు చాలా అవసరం అయింది. రాష్ట్రపతిగా ఎన్నడూ నయా నాజీలను ఖండించలేదు, 2020 మార్చ్‌లో వచ్చిన మహమ్మారి సమయంలో ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించాలని డిమాండ్ చేసిన సాయుధ ప్రదర్శకులను కొనియాడాడు, 2020 ఆగస్టులో విస్కాన్సిన్‌లో కెనోషా వద్ద ఇద్దరు బ్లాక్ లైవ్స్ మేటర్ నిరసనకారులను హత్య చేసిన 17 సంవత్సరాల కైల్ రిట్టెన్‌హౌస్‌ను సమర్థించాడు. 2017లో 100 మందిగా ఉన్న శ్వేత జాతీయవాద గ్రూపులు 2020 నాటికి పదిహేను వేల నుంచి ఇరవై వేల మంది వరకు ఉన్న సాయుధ మిలీషియా గ్రూపులతోను, అనేక మంది యుద్ధ అనుభవజ్ఞులతోనూ కూడుకుని ఉన్న 200 గ్రూపులకు పైగా పెరిగాయి. శ్వేత జాతి ఆధిపత్యవాద అటోమ్‌వేన్ డివిజన్ ఐదుగురిని చంపగా, మితవాద బూగాలూ బోయిస్ పోలీసు అధికారులపై ఆంబుష్ చేసి ఇద్దరిని మట్టి గరిపించి, ముగ్గురిని గాయపరచింది. పదుల సంఖ్యలో మితవాదులు వాహనాలపై నేరుగా బ్లాక్ లైవ్స్ మేటర్ నిరసనకారులలోకి చొచ్చుకుపోయారు. తీవ్ర జాతీయవాదం, శరణార్థులను, విదేశీయులనూ బలి పశువులను చేయడం, శ్వేత జాతి ద్వేషం, 'బలమైన (ఆడంబరమైన) వ్యక్తి' ప్రభుత్వం, దురాక్రమక విదేశీ విధానాలు, మతి లేని ఎరలు వేయడం, అమెరికాలోనే కాకుండా నేడు ప్రపంచవ్యాప్తంగా సంక్షోభగ్రస్త ద్రవ్య పెట్టుబడిదారీ విధానానికి తయారుగా ఉన్న నమూనాలు. కుట్రపూరిత అవిధేయత పేరుతో పెట్టుబడిదారీ విధాన ప్రత్యర్థులను, నిరసననూ అణచివేయడం మినహా ఫాసిస్టు ప్రభుత్వాలకు మరో మార్గం లేదు.

2016లో ట్రంప్‌కు వోట్లు వేసిన వాళ్లు తగ్గకపోగా పెరిగారని అనేక సర్వేలు వెల్లడి చేశాయి. అమెరికా వ్యవస్థ నాలుగేళ్లకు ఒకసారి అటువంటి విపరీతాలను ముందుకు తెస్తుంది. తక్కువ చెడ్డవాడైన బైడెన్ చెడ్డవాడే, ముఖ్యంగా గతంలో ఉప రాష్ట్రపతిగా ఉన్నప్పుడు యుద్ధోన్మాదాన్ని పోషించిన, బడా బ్యాంకులకు ఉపయోగపడ్డ, ఖైదు-పారిశ్రామిక సముదాయాన్ని మరింత శక్తిమంతం చేసిన వాడిగా పేరు పొందినవాడు. దేశభక్త చట్టం ద్వారా కచ్చితమైన ప్రభుత్వ సర్వే వ్యవస్థపై పట్టు సాధించినవాడు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పేద ప్రజలను, ముఖ్యంగా నల్లజాతి ప్రజలను ప్రైవేటు ఖైదు పారిశ్రామిక సముదాయానికి పంపడంలో అంతే

స్థాయి రికార్డ్ ఉన్న కమలా హారిస్‌ను అతను ఎన్నుకోవడంలో ఆశ్చర్యం లేదు. అతను వెనక్కి తగ్గి పారిస్ ప్రోటోకోల్‌లో, ఇరాన్ అణ్వాయుధ ఒప్పందంలో తిరిగి చేరవచ్చు, లేదా తనకున్న ప్రతిష్ఠను తక్కువ చేసినందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థతో లెక్కలు తేల్చుకోవచ్చు, తద్వారా అంతర్జాతీయంగా క్షీణిస్తున్న అమెరికా ప్రతిష్ఠను నిలబెట్టవచ్చు. అయితే చరిత్రలో చూసిన దానిని బట్టి, మరింత చెడ్డదే అయినా ఏ రకమైన నూతనమైనదాన్నీ అతను అందించడు. బుష్ రికార్డ్‌ల కంటే ఒబామా యుద్ధ రికార్డ్‌లు మరింత ఘోరమైనవి. ఒబామా హయాంలో ఉన్న టీపీపీలో అతని భాగస్వామ్యంలో, చైనా పట్ల విధానంలో మార్పు ఉండదు. అయితే అంత దురాక్రమణపూరితంగా ఉండదు. అమెరికా, చైనా సామ్రాజ్యవాదాల మధ్య దక్షిణ పసిఫిక్ ప్రాంతం పోటీ కేంద్రంగా కొనసాగుతుంది.

బహుశా ఇటీవలి కాలంలో జరిగిన దానిని బట్టి అర్థమయ్యే అత్యంత తీవ్రమైన విషయం ఏమంటే, దేశంలో ఒక పెద్ద సెక్షన్ బూటకపు ప్రజాస్వామ్య అసలు యంత్రాంగం పట్ల నిరాసక్తంగా ఉన్నది. రిపబ్లికన్, డెమోక్రాట్ అభ్యర్థుల మధ్య తేడా చూడడం లేదు. వారిని సైనిక పారిశ్రామిక సముదాయపు, లేదా వాల్ స్ట్రీట్ ప్రతినిధులుగా చూస్తున్నారు. పాలక వర్గం ఐక్యంగా బ్యాంకర్లతో కలిసి చివరకు నీరు కారిపోయిన సోషల్ డెమోక్రాట్ బెర్నీ సాండర్స్‌కు వ్యతిరేకంగా కూడా కుట్ర చేయడం గమనిస్తున్నారు. వ్యవస్థీకృత జాతి ద్వేషం మితవాద ధోరణి (మోబ్ లించింగ్)ని బలోపేతం చేయడం చూస్తున్నారు. ప్రజా వ్యతిరేక దోపిడీలకు శృతి మించిన బహుమతులుగా సైనిక శ్రేణి ఆయుధాలతో సాయుధమైన పోలీసు రాజ్య పెరుగుతున్న అధికారాన్ని చూస్తున్నారు. ఒకే దెబ్బతో సమస్తాన్నీ ధ్వంసం చేస్తున్న వాతావరణ మార్పు వల్ల నష్టాన్ని గమనిస్తున్నారు. అత్యంత పేదవారైన నల్ల జాతీయులను, లాటినోలనూ కోవిడ్ మహమ్మారితో సహా అన్ని రకాల సామాజిక దురాచారాలూ అధికంగా ప్రభావితం చేయడం చూస్తున్నారు. దురాక్రమణ, జాతీయ ప్రయోజనం (ఇది పాలకవర్గ ప్రయోజనం అనడం సమంజసం) పేరుతో కనీసపు ప్రజాస్వామిక దృష్టిని కూడా లేకుండా చేయడం చూస్తున్నారు. బూటకపు ప్రజాస్వామ్య స్తంభాలు ప్రాచీన కట్టడాల మాదిరిగా కూలిపోవడం చూస్తున్నారు. తమ జీవితాలలోనే కాకుండా, ప్రపంచంలో పేద, పీడిత ప్రజల జీవితాలలో కూడా ప్రపంచీకరణ విధానాలు సృష్టించిన వినాశనాలను చూస్తున్నారు. తమకు వ్యతిరేకంగా మీడియా, న్యాయవ్యవస్థ సమీకృతం కావడం, కుట్ర చేయడం గమనిస్తున్నారు. వివిధ రంగుల అవాకియనిజం (న్యూ సింథసిస్) ముసుగులో బూటకపు విప్లవకారులు పైకెక్కి కూర్చుని, పోరాడుతున్న ప్రజలపై తమ జెండాలు ఊపడాన్ని చూస్తున్నారు.

వెల్లువ మనకు అనుకూలంగా మారుతున్నదని జార్జ్ ఫ్లాయిడ్ హత్యతో పెల్లుబుకుతున్న ఆగ్రహం, పోర్ట్‌లాండ్ మొదలయిన ప్రాంతాలలో నిరంతర పోరాటాలూ హామీనిస్తున్నాయి. దీంతో పశువులో నిజంగా అసహనం, భీతి కలుగుతున్నాయి. ✶



ప్రపంచ పోలీసు దౌర్జన్యాలు

మేము పోరాడుతాం....మేము గెలుస్తాం

# కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నిరంకుశ వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతు సంఘాల ఆందోళన-దేశ రాజధాని ఢిల్లీ ముట్టడి

## పంజాబ్, హర్యానాలతో పాటు ఉత్తరాదిని స్థంభింపజేసిన రైతుల ఆందోళనలు

కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా తెచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా వందలాది రైతు సంఘాలు పిలుపిచ్చిన దేశవ్యాపిత ఆందోళనకు, సెప్టెంబర్ 25న, నవంబర్ 26న, డిసెంబర్ 8న తలపెట్టిన భారత్ బంద్‌కు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) సహ దేశంలోని అనేక ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు నిచ్చాయి. దేశమంతా ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు జరుగుతుండగా, పంజాబ్ మొత్తం 3రోజుల పాటు(సెప్టెంబర్ 24 నుండి 26) స్థంభించిపోయింది. 2020 జూన్‌లో కేంద్రం ఆర్డినెన్స్‌లు జారీచేసినప్పటి నుండి పంజాబ్, హర్యానా రాష్ట్రాలలో రైతుల ఆందోళనలు మొదలయ్యాయి. ఒక పక్కన అనేక చోట్ల ఆందోళనలు జరుగుతుండగా మరోపక్కన అవి సెప్టెంబర్‌లోనే రాష్ట్రపతి సంతకంతో చట్టాలుగా రూపు దిద్దుకున్నాయి.

వ్యవసాయ మార్కెట్ చట్టం-2020లో (1) రైతుల ఉత్పత్తి-వ్యాపారం- వాణిజ్యం చట్టం-2020 ప్రకారం ఇప్పుడున్న మార్కెట్ కమిటీలు, యార్డ్‌లు దెబ్బతింటాయి. రైతాంగం పోరాడి సాధించుకున్న కనీస మద్దతు ధర, ఇతర సంరక్షణలు కోల్పోతారు. కార్పొరేట్ల గుత్త వ్యావారానికి రైతాంగం బలి అవుతుంది. (2) రైతుల ధరల భరోసా- వ్యవసాయ సేవల ఒప్పందం చట్టం-2020 ద్వారా వ్యవసాయంలో కాంట్రాక్టు పద్ధతి వచ్చి రైతులు స్వంత భూమిలోనే కూలీలుగా మారిపోతారు. కాంట్రాక్టర్లు రైతుకూలీలను మరింతగా దోపిడి చేస్తారు. భూసారాన్ని, ప్రకృతిని ధ్వంసం చేస్తారు. (3) నిత్యావసర సరుకుల (సవరణ) చట్టం-2020 నల్ల బజారు వ్యాపారులకు పండుగే. నిత్యావసర సరుకుల నిల్వలపై నియంత్రణ ఉండదు. దిగుమతులపై ఆంక్షలు ఉండవు. ప్రజా పంపిణీ వ్యవస్థ, భారత ఆహార సంస్థ వంటివి ఇక పనిచేయవు. ఆహార భద్రత లేకుండా పోతుంది. ఈ చట్టాన్ని కేవలం వ్యాపార, వాణిజ్య వర్గాల ప్రయోజనాల కోసం చేసారు.

### వ్యవసాయ బిల్లులపై ఆగ్రహించిన రైతాంగం

వివిధ రైతు సంఘాలతో ఏర్పడిన కిసాన్ సంఘర్ష్ సమితి వ్యవసాయ బిల్లులు చట్టరూపం ధరించిన వెంటనే సెప్టెంబర్ 25న భారత్ బంద్‌కు యిచ్చిన పిలుపుకు అపూర్వమైన స్పందన లభించింది. ఈ బంద్‌కు రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు సంపూర్ణ మద్దతునిచ్చాయి. దేశ వ్యాపితంగా రైతులు రోడ్ల మీదకు వచ్చి వ్యవసాయబిల్లు ప్రతులను తగలబెట్టి, మోదీ ప్రభుత్వ విధానాలను నిరసించారు. కొన్ని చోట్ల వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఆలిండియా కిసాన్ సంఘర్ష్ కో ఆర్డినేషన్ కమిటీ (ఏఐకెఎస్‌సిసి) నేతృత్వంలో సుమారు 250 సంఘాలు బంద్‌లో భాగంగా ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర సెప్టెంబరు 25న ధర్నా చేపట్టాయి. అలాగే రాష్ట్రాలలో జరిగిన కార్యక్రమాలలో కార్మికులు, విద్యార్థులు, యువకులు, వ్యవసాయ కార్మికులు, రైతులు, మహిళలు, దళితులు, ఆదివాసులు పాల్గొన్నారు. పంజాబ్, హర్యానా, రాజస్థాన్, కర్ణాటక, కేరళ, పశ్చిమబెంగాల్, ఒడిశా, అసోం, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, జమ్మూ కశ్మీర్, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తమిళనాడు లలో ప్రజలు బంద్ పాటించారు. మోదీ దిష్టి బొమ్మలను తగలబెట్టారు. ముంబాయి- ఢిల్లీ రహదారిని దిగ్బంధించారు.

పంజాబ్ రైతుల సమరశీల పోరాటంలో ఆ రాష్ట్ర ప్రజానీకం మొత్తం భాగమయ్యింది. పెద్ద సంఖ్యలో మహిళా రైతులు ముందుకొచ్చారు. 31 రైతు సంఘాలు ఐక్యంగా ఇచ్చిన పిలుపుకు కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, వ్యాపార సంఘాలతో పాటు మార్కెట్ (మండి) కమీషన్ ఏజంట్లు, విద్యార్థులు, యువకులు, న్యాయవాదులు ఇలా 100కు పైగా సంఘాలు రైతులకు మద్దతుగా ఆందోళనల్లో భాగమయ్యాయి. రచయితలు, కళాకారులు, మేధావులతో పాటు అన్ని సెక్షన్ల ప్రజలు రోడ్ల మీదకు వచ్చారు. వీధి నాటక బృందాలు గ్రామాలు తిరిగి ప్రచారం చేశాయి. రోజుల తరబడి రైళ్ళు బందయ్యాయి. రైల్వే లైనులు, రహదారులు ధర్నా శిబిరాలయ్యాయి. బీజేపీ రాజకీయ నాయకుల సభల దగ్గర నిరసన, ఘెరావ్‌లతో పాటు వారి ఇళ్ళ దగ్గర ధర్నా చేసి తమ పదవులకు రాజీనామా చేయాలని ప్రజలు డిమాండ్ చేసారు. వారిని గ్రామాల్లోకి రావద్దని బోర్డులు పెట్టారు. రైతుల ఆగ్రహానికి భయపడి పంజాబ్ బీజేపీ కార్యదర్శి రాజీనామా చేశాడు. చిరకాల మిత్రపక్షం అకాలీదళ్ ఎన్‌డిఏ నుండి వైదొలిగింది.

వ్యవసాయ చట్టాలు కార్పొరేట్ వర్గాల ప్రయోజనాల కోసం చేశారు కనుక ఆ కార్పొరేట్ దిగ్గజాలైన అంబానీ, అదానీల పారిశ్రామిక ఉత్పత్తులను బహిష్కరించాలని అక్టోబర్ 1న రైతు సంఘాలు పిలుపునివ్వడంతో, ప్రభుత్వాన్ని నడుపుతున్న ఈ తెరవెనుక శక్తులకు వ్యతిరేకంగా వినూత్నరూపంలో ప్రజా పోరాటం ముందుకొచ్చింది. జియో టవర్లను ధ్వంసం చేస్తూ మొబైల్ నంబర్లను ఇతర కంపెనీల పోర్టబులిటీలోకి మార్చుకుంటున్నారు. రిలయెన్స్ పెట్రోల్ పంపుల దగ్గర ధర్నాలు సాధారణమయ్యాయి. దానితో రిలయన్స్ పెట్రోల్ అమ్మకాలు ఒక వారం రోజులకే 50 శాతం పడి పోయాయి. రిలయన్స్ షాపింగ్‌మాల్స్, పెట్రోల్ పంపుల వద్ద జరుగుతున్న నిరసన కార్యక్రమాలలో అక్కడి రైతు బిడ్డలైన ఉద్యోగులు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. ఎస్సార్ పెట్రోల్‌కు కూడా ఈ సెగ తగులుతోంది.

వాల్‌మార్ట్, టోల్‌ప్లాజాలు వంటి బడా కంపెనీలకు చెందినవన్నీ రైతుల నిరసన చవి చూస్తున్నాయి. 17 టోల్‌ప్లాజాలలో వారం రోజులకే కోట్లాది రూపాయిల రాబడి తగ్గిందనీ ఆ కంపెనీలు గగ్గోలు పెడుతున్నాయి. ప్రజా నిరసనల్లో భాగంగానే 7గురు మరణించారు. హర్యానాలో నిరసన తెలుపుతున్న రైతుల మీద అధికార బీజేపీ ప్రభుత్వం హింసను ప్రయోగిస్తున్నది. దీని వలన అది మరింత ప్రజాగ్రహానికి గురవుతున్నది. పంజాబు, హర్యానాలలో ఫాసిస్టు పాలకులపై పోరాటానికి రైతు ఉద్యమం కొత్త సమీకరణకు దారి తీసింది. బీజేపీ, కాంగ్రెసేతర పక్షాలు, ఎమ్ ఎల్ శ్రేణులు, వివిధ సంఘాలను ఏకత్రాటి మీదకు తెచ్చారు. హత్రాస్ అత్యాచార ఘటనపై దళిత సంఘాలు, రైతు సంఘాలు కలిసి ఆందోళనలు చేసారు. ఈ కదలిక నూతన సమీకరణలకు ప్రాతిపదికగా ఉంటాయి.

పంజాబ్ రాష్ట్ర అసెంబ్లీ సమావేశమై కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా తీర్మానించాలని పంజాబ్ లోని అన్ని పక్షాలు మూకుమ్మడిగా డిమాండ్ చేశాయి. ఫలితంగా పంజాబ్ అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమై అక్టోబర్ 20న మూడు వ్యవసాయ బిల్లులకు వ్యతిరేకంగా తీర్మానం చేసింది. అలాగే విద్యుత్ చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఒక తీర్మానం చేసింది. కేంద్ర వ్యవసాయ చట్టాల స్థానంలో పంజాబ్ విధానసభలో మూడు వ్యవసాయ బిల్లులు ఆమోదం పొందాయి. వ్యవసాయ ఉత్పత్తులను ఎవరైనా నిర్ణీత మద్దతు ధర కన్నా తక్కువకు కొన్నా, ఆహార ధాన్యాలను దాచినా, బ్లాక్ మార్కెటింగ్ చేసినా శిక్షలు, జరిమానాలు విధించేలా వాటిలో నిబంధనలు పొందుపరిచారు.

మన దేశ జనాభా 135 కోట్లకు పెరిగిన నేపథ్యంలో 60 శాతం మందికి అంటే 83 కోట్ల మందికి వ్యవసాయమే జీవనాధారం. గ్రామీణ జనాభాలో 85 శాతంగా చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు ఉన్నారు. వ్యవసాయ కుటుంబాలలో 86 శాతం చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. వీరి వద్ద కేవలం 43.6 శాతం మాత్రమే సాగుభూమి ఉంది. 20 కోట్ల మంది భూమి లేని వ్యవసాయ కూలీలు ఉన్నారు. (హిందు బిజినెస్ లైన్ నివేదిక ఆధారంగా)

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి అత్యంత దూకుడుగా కార్పొరేట్ శక్తులకు మన దేశ సంపదను దోచిపెడుతోంది. లక్షల కోట్ల సంపదలతో తులతూగుతున్న కార్పొరేట్ శక్తులకు, అప్పుల భారంతో కుంగిపోతున్న రైతులకు మధ్యన పోటీ పెట్టి దానిని స్వేచ్ఛాపోటీ అని పాలకులు అంటున్నారు. 'ఒకే దేశం ఒకే పన్ను విధానం', 'ఒకే దేశం ఒకే విద్యావిధానం', విద్యుత్ సంస్కరణలు తెచ్చారు. ఇప్పుడు 'ఒకే దేశం ఒకే మార్కెట్' అంటున్నారు. వాటి దుష్ఫలితాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించకుండా ఉండడానికి హిందుత్వ మత విద్వేష భావజాల మత్తును ప్రజలలో వ్యాప్తి చేస్తున్నారు.

రైతు సంఘాలతో కేంద్ర ప్రభుత్వం జరుపుతున్న చర్చలు డిసెంబర్ చివరినాటికి 7వ దఫా కూడ విఫలమయ్యాయి. మోదీ మంత్రుల చిట్కాలు పారడం లేదు. రైతుల వ్యవసాయాన్ని నట్టేట ముంచే సాగు చట్టాల రద్దు వరకు దిల్లీ వదిలేది లేదనీ, కనీస మద్దతు ధర లభించేలా చట్టం చేయాలనీ 26 నవంబర్ నుండి ధర్నా కొనసాగిస్తున్నారు. రాజధానికి వేరు వేరు మార్గాల నుండి జరుగుతున్న రైతాంగ ముట్టడి క్రియశీలంగా, వీరోచితంగా జరుగుతున్నది. దిల్లీకి వచ్చే వివిధ జాతీయ రహదారులను సింఘూ బార్డర్, ఘాజియాబాదు సహ అన్ని మార్గాలూ ముట్టడించారు. ప్రజలు పోరాటాన్ని పట్టుదలగా కొనసాగిస్తున్నారు. 250 రైతు సంఘాలతో అఖిల భారత కిసాన్ సంఘర్ష్ సమితి, కిసాన్ మోర్చాల నాయకత్వంలో ప్రారంభమైన ఈ ముట్టడిలో క్రమంగా ఉపాధ్యాయులు, రవాణా కార్మికులు, నిర్మాణ కూలీలు వంటి ఎన్నో జీవనరంగాలకు చెందిన శ్రామిక సంఘాలు కూడా చేరాయి. ప్రస్తుతం 500 సంఘాల ఐక్యతతో సాగుతున్న ఈ ఉద్యమం ప్రధానంగా 10 డిమాండ్లతో నడుస్తున్నది. అన్ని రాజకీయ పార్టీలు (బీజేపీ మినహా) రైతాంగం చేపట్టిన ఉద్యమానికి మద్దతును ఇచ్చాయి. అందరూ బంద్‌లో నిరసనల్లో పాల్గొంటున్నారు. సెప్టెంబర్ 25న జరిగిన దానికన్నా నవంబర్ 8న జరిగిన అఖిల భారత్ బంద్ ఇంకా గొప్పగా విజయవంతం అయ్యింది. ఆ తదుపరి 26 నవంబర్ బంద్, ఆ పిదప 8 డిసెంబర్ భారత్ బంద్‌లు కూడ జయప్రదమయ్యాయి. అంతేకాదు, తడవ తడవకు భారత్ బంద్ మరింత సమరశీలంగా, విస్తృత స్థాయిలో జరిగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు దండకారణ్యంలోని జిల్లా

ముఖ్యాలయాలతో పాటు అడవి పల్లెల్లో కూడ ఢిల్లీ రైతు ఆందోళనకు మద్దతుగా ఆదివాసీ రైతులు ప్రదర్శనలు చేశారు.

మొదట రైతుల డిమాండ్‌లను బలపరిచి పోరాటంలో పాలు పంచుకున్న భారతీయ జనతా పార్టీ అనుబంధ రైతు సంఘాలు మధ్యలోనే పోరాటాన్ని విరమించి రైతు ద్రోహానికి, దేశ ద్రోహానికీ తలపడ్డాయి. అయినప్పటికీ రైతులు రాజధాని ముట్టడిని విరమించుకోలేదు. రైతులను రాజధాని నుండి వెనక్కి పంపించడానికి భద్రతా బలగాలు అరెస్టులు, లాఠీ చార్జీలకు పలుమార్లు పాల్పడ్డాయి. కానీ, రైతులు సంఘటితంగానే నిలిచి వాటిని ఎదుర్కొన్నారు. భారత సైన్యంలోని రైతు బిడ్డలు దేశ రైతాంగ సమస్యల పట్ల ప్రభుత్వ వైఖరికి నిరసనగా తమ శౌర్యపతకాలను ప్రభుత్వ ముఖాన తిప్పి కొట్టారు. శరీరం గడ్డ కట్టుకపోయే ఉత్తర భారత చలి గాలులను తట్టుకోలేక దాదాపు 40 మందికి పైగా రైతులు ప్రాణాలు కోల్పోయారు. అయినప్పటికీ వారు చలించలేదు. వారి న్యాయమైన డిమాండ్లను సమర్థిస్తూ దేశ, విదేశాల నుండి అపారమైన మద్దతు లభించింది. మోదీ ప్రభుత్వ యంత్రాంగమంతా, మంత్రివర్యులందరూ కట్ట కట్టుకొని ఎన్ని కట్టుకతలల్లుతూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చినా రైతుల ఆగ్రహాన్ని చల్లార్చలేక పోయారు. రైతుల పక్షాన దేశం మొత్తం నిలిచింది. వారి డిమాండ్లకు ప్రపంచ నలుమూలల నుండి మద్దతు అందుతున్నది.

ప్రపంచ వాణిజ్య సంస్థ ఆదేశాల మేరకు రూపొందిన ఈ చట్టాలు ప్రజా వ్యతిరేకం. రైతు వ్యతిరేక, దేశ వ్యతిరేక కార్పొరేటు అనుకూల చట్టాలను మొత్తంగానే రద్దు చేయాలన్నది రైతు ఉద్యమం ప్రధాన డిమాండ్.

బిల్లును పునరాలోచించమనీ, సెలక్టు కమిటీకి పంపమనీ, సవరణలు చేయమనీ, ఓటింగ్ జరపమనీ ప్రతిపక్షాలు గట్టిగానే పట్టుపట్టాయి. కానీ అధికార పక్షం ఆ సూచనలను ఖాతరు చేయకుండా మూజువాణి ఓటుతో ఆమోదింపజేసింది. చట్టాలను ప్రవేశపెట్టిన, ఆమోదింపజేసిన పద్ధతి అప్రజాస్వామికం, నిరంకుశం, రాజ్యాంగ వ్యతిరేకం. పార్లమెంటు ప్రజాస్వామ్యం ఎంత బూటకమో తామే బయటపెట్టుకుంటున్నారు.

భారత పాలకవర్గాలు పైకి ఫెడరల్ విధానాల గురించి గంభీరంగా గొంతు చించుకుంటారు కానీ వారు తొలి నుండి బలమైన కేంద్రం వకాల్తాదారులే! కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ అన్ని పార్టీలూ బలమైన కేంద్రం తీర్థం పుచ్చుకున్నవే! అందులో భాగమే మోదీ మంత్రం 'ఆల్ ఇన్ వన్ నేషన్'! అదే సంఘ్ పరివార్ చిరకాల వాంఛ 'నయా భారత్'! భారత రాజ్యాంగానికి ఉన్న సోకాల్డ్ ఫెడరల్ స్వభావాన్ని సైతం హిందుత్వ శక్తులు మిగల్చడం లేదు. మోదీ ప్రభుత్వం ఇప్పుడు రూపొందించిన వ్యవసాయ చట్టాలు వ్యవసాయాన్ని రాష్ట్రాల జాబితానుండి కేంద్ర జాబితాలో లోపాయికారిగా మార్చుకోవడమే అవుతుంది! భారత రాజ్యాంగం వ్యవసాయ రంగాన్ని రాష్ట్ర జాబితాలో చేర్చింది. కాబట్టి ఈ రంగంలో మార్పులు రాష్ట్రాలకు సంబంధం లేకుండా కేంద్రం చేయకూడదు. ఉమ్మడి జాబితాలోని అంశాలు కూడా రాష్ట్రాలకు సమాచారం ఇవ్వకుండా, చర్చించకుండా, అనుమతి తీసుకోకుండా, ఏకపక్షంగా కేంద్రం జోక్యందారీ విధానంతో చేసి ఈ చట్టాలను రుద్దుతున్నది. బహుళజాతి సంస్థలైన కార్పొరేటు శక్తులకు విశాల భూక్షేత్రాలను అప్పజెప్పడం, కార్పొరేట్ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించడం, వారికనుగుణమైన మార్కెట్ వ్యవస్థను రూపొందించడం మన దేశ దళారీ పాలకుల కర్తవ్యం. ముఖ్యంగా ఇందులో సామ్రాజ్యవాదుల, దేశంలోని ప్రముఖ దళారీ నిరంకుశ బూర్జువాలైన అంబానీ, అదానీల ప్రయోజనాలున్నాయి.

ప్రస్తుత రైతు ఉద్యమం గత మూడు దశాబ్దాలకు పైగా ఆత్మహత్యలకు నెట్టబడుతున్న రైతులలో కొత్త ఆశలు రేకెత్తించింది. అన్నదాతలకు ఆత్మహత్యలు కాదు, ఉద్యమాలే మార్గాలనే సందేశాన్ని ప్రజా ఉద్యమ రూపం సంతరించుకున్న వర్తమాన ఢిల్లీ ముట్టడి అందిస్తున్నది. ఉదాహరణకు పంజాబ్‌ను చూస్తే పంజాబ్‌లోని 13వేల గ్రామాల నుండి ప్రతీ గ్రామానికి 50 నుండి 100 మంది చొప్పున అన్ని కులాల, వివిధ వర్గాల రైతులు ఢిల్లీ ముట్టడిలో పాల్గొన్నారు. పంజాబ్, హర్యానా, ఉత్తరాంచల్, ఉత్తరప్రదేశ్‌లు ఢిల్లీ ముట్టడిలో ప్రథమ స్థానంలో ఉన్నప్పటికి రాజస్థాన్, మహరాష్ట్ర, తమిళనాడు బెంగాల్ వంటి సుదూర ప్రాంతాల రైతాంగం ఢిల్లీ చేరి ముట్టడిలో పాల్గొన్నారు. భవిష్యత్ ప్రజా ఉద్యమాలకు నేటి రైతాంగ ఉద్యమం, ఢిల్లీ ముట్టడి ఒక సమరశీల నమూనాగా నిలుస్తున్నది.


## రైతు ఉద్యమ న్యాయమైన డిమాండ్లు

1. మూడు వ్యవసాయ చట్టాలపై చర్చకు ప్రత్యేక పార్లమెంట్ సమావేశం జరపాలి.
2. కనీస మద్దతు ధర, ప్రభుత్వ ధాన్య సేకరణలపై చట్టాలు రూపొందించాలి.
3. ప్రస్తుతం ప్రస్తుత ధాన్య సేకరణ వ్యవస్థ కొనసాగుతుందని హామీ ఇవ్వాలి.
4. స్వామినాథన్ కమీషన్ సిఫార్స్ చేసిన విధంగా ఉత్పత్తి వ్యయంకన్నా 50శాతం అదనంగా కనీస మద్దతు ధరను నిర్ణయించాలి.
5. వ్యవసాయానికి వినియోగించే డీసిల్ ధరను సగానికి తగ్గించాలి.
6. వరి, గోధుమ, గడ్డి తగలబెట్టడంపై విధించిన ఆంక్షలను తొలగించాలి. శిక్షలను రద్దు చేయాలి.
7. అరెస్టు చేసిన రైతులను బేషరతుగా విడుదల చేయాలి.
8. విద్యుత్ ఆర్డినెన్స్ 2020ను ఉపసంహరించుకోవాలి.
9. రాష్ట్రాల జాబితాలో ఉన్న అంశాలలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోకూడదు. ఫెడరల్ విధానాలను అమలు చేయాలి.
10. రైతు నాయకుల మీద పెట్టిన కేసులను తక్షణం ఉ

పసంహరించుకుని, వారందరినీ విడుదల చేయాలి. దోపిడీ ఆర్థిక వ్యవస్థలో, పాలనా వ్యవస్థలో వ్యవసాయ రంగాన్ని దిగతుడుపు చేస్తున్న పాలకవర్గాలపై రైతు పోరాట బావుటానెత్తడం వ్యవసాయ ప్రధాన ఆర్థిక వ్యవస్థ ఆవశ్యకతలను చాటుతున్నది. రైతు దేశంలో రైతు సమస్యలను దోపిడీ పాలకులు నిర్లక్ష్యం చేయడం, వ్యవసాయాన్ని అధోగతి పాలు చేయడం ఎల్లకాలం సాగదనీ వర్తమాన రైతు ఉద్యమం హెచ్చరిస్తున్నది. 'జై జవాన్ జై కిసాన్' నినాదంతో రైతాంగాన్ని మోసపుచ్చలేరనే సందేశాన్ని ఉద్యమం విన్పిస్తోంది. 2022నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని అలుపూ సొలుపూ లేకుండా వాగ్దానం చేసే మోదీ 2022నాటికి దేశ వ్యవసాయాన్ని పూర్తిగా కార్పొరేట్ల పరం చేసి వారి ఆదాయాలను రెట్టింపు చేయపూనుకున్నాడనేది ఈ చట్టాల ద్వార తేటతెల్లమవుతోంది. అందుకే ఈ రోజు భారత రైతు 'కార్పొరేట్లను తన్ని తరుముదాం, వ్యవసాయాన్ని కాపాడుకుందాం' అనే రణనినాదాన్నివ్వడం వ్యవసాయ విప్లవ ఆవశ్యకతను బలంగా చాటుతున్నది. సంఘటితంగా పోరాడుతున్న సమస్త రైతాంగానికి విప్లవ జేజేలు పలుకుదాం. దిల్లీ ముట్టడి వార్తలను అందిస్తున్న పాత్రికేయుడు సందీప్ పునియా అరెస్టును ఖండిస్తున్నాం. వారిని వ్యవసాయ విప్లవ మార్గంలో సంఘటితం చేద్దాం. ✶








పాత్రికేయులు సందీప్ పునియా అరెస్టును ఖండిస్తూ ప్రదర్శన

# బిహార్ ఎన్నికలలో హిందుత్వ శక్తులను గెలిపించిన ప్రతిపక్షాలు

కరోనా మహమ్మారీ విజృంభణను లక్ష్యపెట్టకుండా అధికార దాహంతో మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చిన మోదీ అండ్ కంపెనీ దేశంలోని బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిపించింది. 2020 అక్టోబరు 28 నుండి నాలుగు విడతలుగా బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అధికారంలో ఉన్న ఎన్‌డిఏ కూటమి మరోసారి గెలిచి మూడవసారి అతి తక్కువ మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అధికారం కోసం నానాగడ్డి కరిచే నితీష్‌కుమార్ మోదీ, అమిత్‌షా, భాగవత్‌ల దీవెనలతో వరుసగా నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యాడు.

దేశంలోని మిగితా అనేక రాష్ట్రాలలాగే బిహార్ అనేక సమస్యలతో అతలాకుతలం అవుతోంది. నితీష్ అభివృద్ధి నీరుగారిపోయింది. కోవిడ్-19 సృష్టించిన సమస్యలు, నిరుద్యోగం, అనేకానేక అప్రజాస్వామిక చర్యలు, కార్మిక వ్యతిరేక, రైతాంగ వ్యతిరేక చట్టాలు, రామ మందిర నిర్మాణం, బాబ్రీమసీదు కూల్చివేత కేసు కొట్టివేత లాంటి ఎన్నో ముఖ్యమైన రాజకీయ విషయాల పట్ల ఈ ఎన్నికలలో అంతగా చర్చ జరగలేదు. అక్కడ అర్ధ శతాబ్దానికి పైగా సాయుధ వ్యవసాయక విప్లవం కొనసాగుతోంది. అది లేవనెత్తుతున్న ప్రజల మౌలిక సమస్యలపై అన్ని రాజకీయ పార్టీలు మౌనం దాల్చాయి. అక్కడ నిరుద్యోగం విలయతాండవం చేస్తోంది. కోటికి పైగా బిహారీలు వలస కూలీలుగా భారత దేశమంతా విస్తరించి ఉన్నారు. మొన్న కోవిడ్ లాక్‌డౌన్‌లో సుమారు 23 లక్షల మంది మాత్రమే స్వస్థలాలకు తిరిగి వచ్చారు. వందల, వేల కిలోమీటర్లు కనాకష్టంగా నడిచి వచ్చారు. నేడు వారి కుటుంబాలు ఉద్యోగాలు, ఉపాధి కోసం గాఢమైన కోరికతో ఉన్నారు. రివర్స్ మైగ్రేషన్ కారణంగా గ్రామీణ ప్రాంతాలు ఒత్తిడికి గురవుతున్నాయి. జీవించే హక్కు, ఆహార హక్కు, భద్రత హక్కులతో పాటు శ్రమను గౌరవించడం ప్రధాన సమస్యలయ్యాయి. తేజస్వీ యాదవ్ 10 లక్షల ఉద్యోగాలిస్తామని చేసిన ఎన్నికల హామీ యువత మీద బలంగా పనిచేయడంతో, ఎన్‌డిఏ ఏకంగా 19 లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పి ప్రచారం చేసుకుంది. ఉపాధి రహిత అభివృద్ధి విధానాల కాలంలో ఇవన్నీ ఎన్నికల హామీలన్నది జగమెరిగిన రహస్యం.

బిహార్ అసెంబ్లీలో 243 స్థానాలకు జరిగిన ఎన్నికల ఫలితాలు ఇలా ఉన్నాయి. ఎన్‌డియే కూటమికి 125(బిజెపికి 74+ జేడియు 43+ఇతరులు 8), మహాకూటమికి 110 (ఆర్‌జేడీ 75+ కాంగ్రెసు 19 + వామపక్షాలు 16), ఎమ్‌ఐఎమ్ కు 5, ఇంకా ఇతరులకు 3 స్థానాలు లభించాయి. ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకుంటూ పచ్చి అవకాశవాదంతో హిందుత్వతో కుమ్మక్కై అధికారంలో కొనసాగుతున్న పదవీ కాంక్షపరుడు నితీష్ పాలనను నిజంగానే పక్కకు పెట్టె పట్టుదలే ప్రతిపక్షాలకు ఉంటే హిందుత్వ శక్తులకు అన్ని ససీట్లు ఆ రాష్ట్రంలో దక్కేవే కావు.

2019 సార్వత్రిక ఎన్నికలలో ఎన్డీఎ బిహార్‌లో ఒకటి మినహా అన్ని (39) లోక్‌సభ స్థానాలను, 53 శాతం ఓట్లను గెలుచుకుంది. ఇపుడు అసెంబ్లీ ఎన్నికలలో విజయం సాధించినప్పటికి ఓట్ల శాతం 38 కి తగ్గింది. మహాకూటమి 1 శాతం ఓట్లు మాత్రమే అధికంగా పొందింది. విడివిడిగా పార్టీలకు వచ్చిన ఓట్లు చూస్తే ఆర్‌జెడికి 23 శాతం, బిజెపికి 19 శాతం మాత్రమే రాగా జెడియుకి 15 శాతం వచ్చాయి. రెండు పార్టీల బలాలు చూస్తే ఆర్‌జెడికి బిజెపి కన్నా ఒక సీటు ఎక్కువ. లోక్‌జనశక్తి కి ఒక సీటు మాత్రమే దక్కింది. 2015లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో పోల్చి చూస్తే బిజెపికి 21స్థానాలు (53 నుండి 74) పెరిగాయి. ఆర్జేడీ గతం కన్నా ఎక్కువ సీట్లు సంపాదించడమే కాకుండా చాలాస్థానాల్లో గట్టి పోటీ ఇచ్చింది. జెడియు బలం 74 నుండి 43కు తగ్గింది. కాంగ్రెసు బలం 27 నుండి 19 కి తగ్గింది. వామపక్షాలు ఈసారి బలపడి 16 (గతంలో 3) స్థానాలు సంపాదించుకున్నాయి. గతంకన్నా ఈసారి 'నోటా' కు అత్యధికంగా 1.7 శాతం (7లక్షలకు పైగా) ఓట్లు వేశారు. ఈ గణాంకాలను నిశితంగా పరిశీలిస్తే నితీష్ పతనానికి హిందుత్వ పటిష్టతకు కారణాలు సులువుగానే అర్ధమవుతాయి.

రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి)కు చెందిన తేజస్వీయాదవ్ నాయకత్వంలోని మహా కూటమి గట్టి పోటీ ఇవ్వగలిగినా అధికారంలోకి రాలేకపోయింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అది 23 శాతం ఓట్లు స్వంతం చేసుకుంది. ముస్లింలు, యాదవులు- ఈ రెండు ప్రజా సమూహాలు బిహార్‌లో ప్రధాన ఓటు బ్యాంకులు. ఇవి సాధారణంగా రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) వెనుకే ఉండేవి. ఇప్పుడు ఎమ్‌ఐఎమ్‌తో పొత్తు కుదరని ఫలితంగా అది విడిగా పోటీ చేయక తప్పని స్థితిలో హిందుత్వకు లాభం చేకూరింది. హిందుత్వ కౌటిల్యానికి సోకాల్డ్ లౌకికవాది నితీష్ బలి కావడం బిహార్ ఎన్నికలలో ఓటర్లకు ఆయన అవకాశవాదాన్ని నగ్న పరిచింది.

రాష్ట్ర జనాభాలో 17శాతం దళితులున్నారు. రెండు దళిత రాజకీయశక్తులు-లోక్ జనశక్తి పార్టీ (ఎల్‌జెపి), హెచ్.ఎ.ఎమ్(ఎస్)

(తరువాయి 21వ పేజీలో....)

# హాథ్రాస్‌లో హత్య
## అగ్రకుల దురహంకారానికి, మనువాద ఫాసిజంకు బలైన జీవితం

పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లోని హాథ్రాస్ జిల్లా బూల్‌గరి గ్రామంలో దళిత (వాల్మీకి) కులానికి చెందిన 19 ఏళ్ళ మహిళను సామూహిక అత్యాచారంచేసి, నాలుక కోసి, మెడఎముకలు, వెన్నెముక విరగ్గొట్టిన సంఘటన ప్రజల దృష్టికి వచ్చి దేశవ్యాపితంగా తీవ్ర నిరసన వ్యక్తమయ్యింది. సెప్టెంబరు 14 న చెవిటి తల్లితో పాటు గడ్డి కోయడానికి వెళ్ళిన ఆమెను ఉదయం 9 గంటలకు సజ్జ చేన్లోకి లాక్కెళ్ళిన నలుగురు ఠాకూర్లు ఈ దుర్మార్గానికి పాల్పడ్డారు. తెగిన నాలుకతో, ఉబ్బిన కళ్ళతో, నులిమిన గొంతుతో, దేహమంతా రక్తపు మరకలతో, చెదిరిన బట్టలతో, రక్త స్రావంతో వణికిపోతున్న కూతురిని వెతికి కనుక్కున్న తల్లి, కొడుకు సహాయంతో దగ్గర లోని చాంద్‌పా పోలీసు స్టేషన్‌కు వెళ్ళి సహాయం అర్థిస్తే, అక్కడి నుండి పోలీసులు వెళ్ళగొట్టారు. ఆ తర్వాత చికిత్స కోసం హాథ్రాస్ లోని బల్గా ఆసుపత్రికి తీసుకువెళ్ళారు.

స్థానిక ఆస్పత్రిలో రెండు గంటల వరకు ఉంచి తరువాత జవహర్‌లాల్ నెహ్రూ మెడికల్ కాలేజీ హాస్పిటల్, అలీఘడ్‌కి తీసుకెళ్లారు. హాస్పిటల్‌కి వెళ్లే క్రమంల్లో ఆ తర్వాత స్ట్రెచర్ పైన ఉన్న బాధితురాలు తనపై బలాత్కారం చేసిన వారి వివరాలను చెబుతున్న వీడియోలు వెలుగులోకి వచ్చాయి. తనపై అత్యాచారానికి పాల్పడిన వారు తమ ఇంటికి ఆవలి రోడ్డులో ఉండే వాళ్లేనని గుర్తుపట్టింది. వారంతా ఆ గ్రామంలోని అగ్రవర్ణ ఠాకూర్ కులం వాళ్లు.

బుల్‌గఢీ గ్రామంలో 600కి పైగా కుటుంబాలు ఉంటాయి. ఎన్నో తరాలుగా 15 దళిత కుటుంబాలు అల్ప సంఖ్యాకులుగా అక్కడ నివసిస్తున్నాయి. బాధితురాలి కుటుంబానికి 1990లలో మాయావతి ప్రభుత్వం 2 ఎకరాల భూమి ఇచ్చింది. అయితే, ఇప్పటి వరకు 1.4 ఎకరాలు మాత్రమే వాళ్ల స్వాధీనంలోకి వచ్చింది. మిగిలింది ఒక బ్రాహ్మణ కుటుంబం ఆక్రమణలో ఉందని అంటున్నారు. పాల అమ్మకం ద్వారా ఆ కుటుంబానికి కొంత ఆదాయం వస్తుంది.దశాబ్దాలుగా వాళ్లు అణచివేత వాతావరణంలో బతుకుతున్నారు, దౌర్జన్యాలను ఎదుర్కోంటూ ఉన్నారు. ఆధిపత్య కులమైన ఠాకూర్లు వాళ్లని వ్యవసాయ కూలీలుగా, ఇతర విధాలుగా ఉపయోగించు కుంటున్నారు.గత కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్న అణచివేతను ప్రతిఘటిస్తున్న క్రమంలో దళితులలో కొంత చైతన్యం చోటు చేసుకుంటోంది.

బాధితురాలి ఆరోగ్య పరిస్థితి సీరియస్‌గా ఉండి మెడికో లీగల్ కేసుగా గుర్తించబడినప్పుడు వెంటనే బాధితురాలి పైన జరిగిన అఘాయిత్యం ఆనవాళ్లను గుర్తించి, రికార్డు చేసి, భద్రపరచవలసిన బాధ్యత ఉంటుంది. కానీ వైద్య సిబ్బంది ఆ పని చేయలేదు. బాధితురాలి నుండి ఘటన జరిగిన ఎనిమిది రోజుల తర్వాత అంటే సెప్టెంబర్ 22న మెజిస్ట్రేట్ సమక్షంలో స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. అప్పుడు కూడా ఆమె స్పష్టంగా తనపై జరిగిన సామూహిక అత్యాచారానికి పాల్పడిన నలుగురి వివరాలను చెప్పింది. బాధితురాలు చనిపోవడానికి ముందు చివరగా మెజిస్ట్రేట్ ముందు ఇచ్చిన స్టేట్‌మెంట్ అనేది ఆమె ఇచ్చిన మరణవాంగ్మూలమే అవుతుంది, ఆ వాంగ్మూలంలో చాలా స్పష్టంగా ఎవరెవరు అఘాయిత్యానికి పాల్పడ్డారో ఆమె చెప్పింది.

దీనిని పట్టించుకోకుండా ఆమెకు వ్యతిరేకంగా సాక్ష్యాధారాలను మాయం చేసే పనిలో భాగంగానే చాలా ఆలస్యంగా ఫోరెన్సిక్ ల్యాబ్‌కు నమూనాలను పంపించడం జరిగింది. పోలీసులు గాని, జిల్లా మెజిస్ట్రేట్ గాని బాధితురాలికి సరైన, మెరుగైన చికిత్స కోసం మొదట్లోనే ఢిల్లీలోని ఎయిమ్స్‌కి సకాలంలో పంపించకుండా చివరి దశలో వెంటిలేటర్ పైనే ఢిల్లీలోని సఫ్దర్జంగ్ ఆస్పత్రికి సెప్టెంబర్ 28న తరలించారు. ఆ మరుసటి రోజే 29న ఆమె చనిపోయింది.

అధికారుల నిర్లక్ష్యం– ఈ సంఘటన తెలిసిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంలో, బాధితురాలికి సరైన వైద్యం కోసం మంచి ఆసుపత్రికి తీసుకు వెళ్లకపోవడంలో, వెంటనే వైద్యపరమైన రుజువులను సేకరించకపోవడంలో, సకాలంలో మెజిస్ట్రేట్ బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేయకపోవడంలో అధికారుల నిర్లక్ష్యం ఉంది.

ఇక్కడ చూపించని శ్రద్ధ, చొరవ భారీ పోలీసు బందోబస్తు మధ్య బాధితురాలి శవాన్ని ఢిల్లీలోని సఫ్దర్జంగ్ ఆస్పత్రి నుంచి రెండు వందల కిలోమీటర్ల దూరంలో వున్న ఆమె గ్రామానికి తెచ్చి, అర్ధరాత్రి రెండున్నర గంటల ప్రాంతంలో పెట్రోల్ పోసి తగల బెట్టడంలో చూపించారు. ఆ గ్రామంలోకి మరెవరినీ రానీయకుండా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయడంలో అతి చొరవను ప్రదర్శించారు.

కుటుంబానికి కనీసం చివరి సంస్కారమైన వారనుకున్న రీతిలో జరుపుకోనీయకుండా చేసి బాధితురాలిని మరోసారి హత్య చేసారు, మరోసారి కుటుంబాన్ని దగా చేశారు. ఇలా చేయమని ఆదేశాలు ఇచ్చిన జిల్లా మెజిస్ట్రేట్, ఆ పై రాష్ట్ర ప్రభుత్వాధినేత ఏ వర్గాలకు

కొమ్ము కాస్తున్నారో, ఏ ధర్మాన్ని నిలబెట్టాలనుకుంటున్నారో స్పష్టమే.

'మీడియా ఇప్పుడు ఉంటుంది, కొన్ని రోజులు అయితే వెళ్లిపోతుంది. ఉండేది మేమే, కాబట్టి మా మాట వినండి. మీ స్టేట్‌మెంట్‌ను మార్చుకోండి' అని హాథ్రాస్ జిల్లా మేజిస్ట్రేట్ బాధిత కుటుంబం పై ఒత్తిడి తెస్తున్న వీడియో వెలుగు చూసింది. ఆ వీడియోలో '25 లక్షల నష్టపరిహారం వచ్చిందని, కరోనాతో చనిపోతే ఏం చేసే వారు' అని బాధితులతో జిల్లా మెజిస్ట్రేట్ అన్న మాటలు దేన్ని ప్రతిబింబిస్తాయి? అత్యాచారం చేసి చంపేస్తే దాని ఖరీదు 25 లక్షలు అన్నమాట.



**హిందూ దురహంకారానికి బలైన హాథ్రాస్ యువతి**

బాధిత కుటుంబానికి సంఘీభావం తెలపడానికి వస్తున్న వారిని ఎవరినీ రానీయకుండా మొత్తం గ్రామాన్ని పోలీసులతో దిగ్బంధించేశారు. అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడడం, నిరసన తెలపడం అనేది కనీస ప్రజాస్వామిక హక్కు. దానిని అడ్డుకోవడం, అణిచివేయడం అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 19కి వ్యతిరేకమైనది. ప్రజాస్వామిక రాజ్యాంగబద్ధమైన ఈ హక్కును కూడా సహించలేని పాశవికత్వాన్ని ఈ ఘటన తెలుపుతున్నది.

దేశవ్యాప్తంగా వస్తున్న నిరసనల నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం శాంతి భద్రతల సమస్య అని, 'ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంను కూల్చేందుకు అంతర్జాతీయ కుట్ర జరిగింది' అనే సాకులతో అక్రమ అరెస్టులకు, జాతీయ భద్రతా చట్టం కింద అక్రమ కేసులకు పాల్పడుతున్నది.

పాలకుల, అధికారుల దుర్మార్గాలను ప్రశ్నిస్తే దేశద్రోహులు అవుతారా? భీమా కోరేగావ్ కేసులో కూడా ఇలాంటి కేసులే పెట్టారు. ఎంతో మంది మేధావులను జైల్లో నిర్బంధించారు.

మీడియాను, సామాజిక కార్యకర్తలను, ప్రజా సంఘాలను, రాజకీయ పార్టీలను ఎవరినీ ఉత్తరప్రదేశ్ లోని హాథ్రాస్ కు వెళ్లకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఇదంతా ఎవరిని రక్షించడానికి, ఏ భావజాలాన్ని, ఏ సామాజిక వ్యవస్థను బలోపేతం చేయడానికి?.

'హాథ్రాస్ సంఘటన జరిగి ఉండాల్సింది కాదు' అన్న ఐక్యరాజ్య సమితి స్పందనను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ 'ఈ వ్యాఖ్య అనవసరం, అవాంఛనీయం' అని తప్పు పట్టింది. యోగి కి వ్యతిరేకంగా కుల సమస్యను రెచ్చగొట్టడానికి జాతీయ, అంతర్జాతీయ కుట్ర జరుగుతున్నదని, ఇది దేశ భద్రతకు ముప్పు అని, దేశద్రోహమని, జరిగిన ఘోరాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు అంటూ " దొంగే దొంగ, దొంగ" అని అరచిన చందంగా పాలకులు కుట్ర పూరితంగా మరో దాడికి పూనుకున్నారు.


యోగి ఆదిత్యనాథ్ ఉత్తరప్రదేశ్‌లో అధికారం చేపట్టిన తర్వాత ఎన్నో ఎక్స్‌ట్రా జ్యుడిషియల్ హత్యలకు సంబంధించిన సంఘటనలు వెలుగు చూశాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) ప్రకారం దేశంలోనే ఉత్తరప్రదేశ్‌లో దళితుల పై నేరాలు అత్యధికంగా జరుగుతున్నాయి. అందులో ఇది ఒకటి మాత్రమే.

అగ్రకుల దురహంకారాన్ని, అమానవీయతను, మనువాద ఫాసిజంను చూడాలనుకునే వారికి హాథ్రాస్ ఘటన ఒక సజీవ సాక్ష్యం.

✶

**'హాథ్రాస్ సంఘటన జరిగి ఉండాల్సింది కాదు' అన్న ఐక్యరాజ్య సమితి స్పందనను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ 'ఈ వ్యాఖ్య అనవసరం, అవాంఛనీయం' అని తప్పు పట్టింది. యోగి కి వ్యతిరేకంగా కుల సమస్యను రెచ్చగొట్టడానికి జాతీయ, అంతర్జాతీయ కుట్ర జరుగుతున్నదని, ఇది దేశ భద్రతకు ముప్పు అని, దేశద్రోహమని, జరిగిన ఘోరాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు అంటూ " దొంగే దొంగ, దొంగ" అని అరచిన చందంగా పాలకులు కుట్ర పూరితంగా మరో దాడికి పూనుకున్నారు.**

# ప్రపంచ విప్లవ రచయిత మేధావి యాన్ మిర్డాల్‌కు లాల్ సలాం




ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.
మిర్డాల్ మేధావుల కుటుంబంలో జన్మించాడు. సమాజ విజ్ఞాన శాస్త్రజ్ఞుడు, ఆర్థికవేత్త అయిన ఆయన తండ్రి గున్నార్ మిర్డాల్, భారత దేశానికి స్వీడన్ దేశ రాయబారిగా పని చేసిన తల్లి అల్వా రీమర్ ఆర్థిక, నిరాయుధీకరణ రంగాలలో నోబెల్ బహుమతులు అందుకున్నారు.

ఐరోపా వలసవాద, సామ్రాజ్యవాద ప్రభావం పట్ల ధిక్కారాన్ని స్వీయచరిత్రాత్మక పుస్తకం 'కన్ఫెషన్స్ ఆఫ్ ఎ డిస్‌లాయల్ యూరోపియన్' (అవిధేయ యూరోపియన్ ఒప్పుకోలు) ద్వారా యాన్ మిర్డాల్ తెలియపరిచాడు. ప్రపంచంలో వివిధ ప్రాంతాలలో జరుగుతున్న కార్మికవర్గ పోరాటాలతో మమేకమయ్యాడు. వివిధ దేశాలకు వెళ్లి అక్కడి విప్లవకారులను కలిసాడు. ఆ ఉద్యమాల గురించి రాశాడు. ఐరోపాకు, మూడో ప్రపంచ దేశాలకూ మధ్య సంబంధాల గురించి 'లాయల్ ఇమేజెస్' (విధేయ చిత్రాలు) పేరుతో ఒక పెద్ద వ్యాసం రాశాడు. ఇది ఆయన చేసిన ఒక ప్రముఖ రచన. 'మంత్లీ రివ్యూ' వంటి పత్రికలలో ఆయన వ్యాసాలు ఆ విప్లవాల అనుభవాలనే కాకుండా యాన్ మిర్డాల్ కార్మికవర్గ స్ఫూర్తిని కూడా తెలియజేస్తాయి.

1950 సంవత్సరం నుండి ఆయనకు భారత దేశంతో అనుబంధం ఉంది. ఆయన జర్నలిస్టుగా పనిచేశారు. 30కి పైగా పుస్తకాలను రాసారు. 40 సంవత్సరాల క్రితం ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి ఇక్కడ కరీంనగర్, ఆదిలాబాద్ రైతాంగ పోరాటాలను చూసి ఉత్తేజితుడై వాటిని కీర్తిస్తూ 'ఇండియా వెయిట్స్' అనే పుస్తకాన్ని రాసాడు.

యాన్ మిర్డాల్ 84 సంవత్సరాల వయస్సులో 2010 సంవత్సరం ఫిబ్రవరిలో దండకారణ్యంలో రెండు వారాలు తిరిగి, అక్కడ బీజప్రాయంలో ప్రారంభమయిన జనతన రాజ్య నిర్మాణాలను చూసి ఉత్సాహపడ్డాడు.

సిపిఐ(మావోయిస్టు), ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గణపతి తో ఇంటర్వ్యూ తీసుకున్నాడు. విప్లవోద్యమం దేశమంతా విస్తరించడంతో పాటు, ప్రధాన విప్లవ స్రవంతులు ఐక్యం కావడాన్ని చూసిన ఉత్సాహంతో 'రెడ్ స్టార్ ఓవర్ ఇండియా' అనే పుస్తకాన్ని రాసాడు. ఈ పుస్తకం స్వీడిష్, హిందీ, ఇంగ్లీష్, తెలుగు భాషల్లో బాగా ప్రచారం పొందింది. 'భారతదేశం పై అరుణతార' పేరుతో తెలుగులో దొరుకుతుంది. ఆదివాసీ ప్రజలకు రాజ్యాధికార చైతన్యం అందిందని, అది విప్లవ విజయానికి గ్యారంటీ నిస్తుందన్న నమ్మికతోనే ఆ విషయాన్ని ప్రపంచమంతా ప్రచారం చేసాడు.

'ఒక రచయితగా ప్రజల న్యాయమైన పోరాటాలను వివరిస్తాను. భారతదేశంలోను, బయటా ఉన్న ప్రజలకు ఈ దేశంలో ప్రజలు ఎందుకు, ఏ రకంగా విప్లవం చేస్తున్నారో చెప్పడం నా ఉద్దేశ్యం' అన్నాడాయన. ఈ పుస్తక రచన గురించి ఇలా అన్నాడు. 'పాలకులకు, పీడితులకు మధ్య ఘర్షణ వచ్చినప్పుడు పీడితుల పక్షమే సరైనదనే మాట చరిత్ర పొడవునా ఎంత నిజమో, 2010లో భారత్‌లో కూడా అంతే నిజం...దిక్కు మొక్కు లేని జనం ఒక్కొక్కరు అగ్నికణంగా మారుతున్న వేళ భారత్ పై అరుణతార వెలుగుతోంది. ఆ వెలుగును చూసిన నా అనుభవాలు, ఆలోచనలు, ప్రాథమిక ప్రతిపాదనలు రాస్తున్నాను. అది నా విద్యుక్త ధర్మం.'

భారత విప్లవాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసేందుకు అపారమైన కృషి చేసిన కామ్రేడ్ హరిశర్మ(1934-2010)కు యాన్ ఈ పుస్తకాన్ని అంకితం ఇచ్చాడు. సమాజాన్ని మార్చాలనుకునే వారికి, ముఖ్యంగా ప్రజానుకూల మేధావులకు ఆయన ఆలోచనలు, ఆచరణా ఆదర్శవంతమైనవి. ఆయన స్మరణలో సమస్త రకాల వేతన బానిసత్వానికి, సామ్రాజ్యవాదానికీ వ్యతిరేకంగా, సోషలిజం-కమ్యూనిజం కోసం చివరి వరకు పోరాడతామని శపథం చేద్దాం.

✶

**గోరఖ్ పాండ్యే**

'చట్టం తన పని తను చేయడం', 'దేశ రక్షణ పేరుతో ప్రజలను ఖైదు చేయడం', 'ప్రజల పేరుతో జాతిని అమ్మడం', అలాగే 'సురక్ష పేరుతో అసురక్షితం చేయడం', (కవి)పాష్ మాటల్లో 'ఇదే దేశ రక్షణ అయితే, ఆ రక్షణ మాకెంతో ప్రమాదం'

## ప్రజల మనిషి, విప్లవ మేధావి
## నాలుగు దశాబ్దాల పౌరహక్కుల ఉద్యమనాయకుడు



# ప్రొఫెసర్ శేషయ్యకు జోహార్లు

విప్లవ మేధావి, ప్రజాస్వామికవాది, పౌరహక్కుల ఉద్యమనేత, ప్రజల శ్రేయోభిలాషి కామ్రేడ్ శేషయ్యసార్ మరణానికి మా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాం. ఆయనకు మా విప్లవ జోహార్లు.

కామ్రేడ్ శేషయ్యసార్ మరణంపట్ల ఆయన కుటుంబానికీ, మిత్రులకు మా పార్టీ మధ్య రీజినల్ బ్యూరో ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నది. ఆయన కొద్దిరోజులుగా అస్వస్థతతో ఉంటూ, 2020 అక్టోబర్ 10న, తన 64వ ఏట తుదిశ్వాస విడిచారు. ఆయన మరణం దేశంలో విప్లవ, ప్రజాస్వామిక, పౌరహక్కుల, ప్రగతిశీల, పీడిత జాతుల ఉద్యమాలకూ, ప్రజాహితం కోసం జరుగుతున్న ఉద్యమాలకు తీవ్రమైన నష్టం. ఈ నష్టం వెంటనే పూడ్చుకోలేనిది కూడ.

శేషయ్య విద్యార్థీ దశలోనే విప్లవ రాజకీయాలకు ఆకర్షితుడైనాడు. ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒక ప్రభంజనంలా ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న విప్లవకర విద్యార్థీ ఉద్యమానికి నేతృత్వం వహించిన రాడికల్ విద్యార్థీ సంఘంలో చేరి, అనతికాలంలోనే దాని తొలి ఉపాధ్యక్షుడయ్యాడు. 'ఆర్.ఎస్.యు'కు నేతృత్వబాధ్యత చేపట్టిన శేషయ్య, ఆనాటి విద్యార్థి ఉద్యమాన్ని కేవలం విద్యార్థి సమస్యలకే పరిమితం చేయకుండా, మొత్తం సమాజంలో మౌలిక మార్పుకోసం జరిగే ఉద్యమంగా మలచడంలో కూడా ముఖ్యమైన భూమికను పోషించాడు.

శేషయ్య తన చదువు పూర్తి అయిన తర్వాత, తన సొంత జిల్లా కర్నూల్‌ను వదిలి, అనంతపూర్‌లో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటిలో డీన్‌గా కొలువులో చేరాడు. ఆయన ఆచార్య (ప్రొఫెసర్) వృత్తిని చేపట్టిన తర్వాత కూడా తన సామాజిక బాధ్యతను ఒక్క క్షణం కూడా మరచిపోలేదు. ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక ఉద్యమంగా కొనసాగుతున్న పౌరహక్కుల ఉద్యమంలో చేరి, అందులో చురుకైన పాత్రను నిర్వహించాడు. క్రమంగా ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘానికి కార్యదర్శిగా, అధ్యక్షుడిగా కీలకమైన బాధ్యతలు చేపట్టాడు.

1990 దశకంలో రాష్ట్ర పౌరహక్కుల ఉద్యమంలో, ముఖ్యంగా హక్కుల దృక్పథంలో తలెత్తిన మితవాద వైఖరులను ఎదుర్కోవడంలో నాయకత్వ పాత్రను పోషించాడు. అంతేకాదు, హక్కుల దృక్పథాన్ని సమాజంలోని ఆధిపత్య వ్యవస్థలుగా ఉన్న భూస్వామ్యం, వక్రీకరించిన పెట్టుబడిదారీ విధానం, కుల వ్యవస్థ, పితృస్వామ్యం వంటి వాటితోపాటు, వీటికి సేవచేస్తూ, మద్దతుగా ఉన్న రాజ్యవ్యవస్థకు వ్యతిరేకంగా నిలబెట్టి అభివృద్ధి పరిచాడు. సమాజంలోని ఆధిపత్య వ్యవస్థలతోపాటు, రాజ్యవ్యవస్థకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజాస్వామిక, విప్లవ పోరాటాలకు మద్దతుగా, వాటితో విడదీయరాని ఉద్యమంగా పౌరహక్కుల ఉద్యమాన్ని మలిచాడు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కామ్రేడ్ శేషయ్య నేతృత్వంలో పౌరహక్కుల ఉద్యమం స్పృశించని సమస్య లేదంటే అశ్చర్యపడాల్సిన అవసరం లేదు. రాయలసీమ ప్యాక్షన్ సమస్య మొదలు, నీరు, దళిత, ఆదివాసీ, మైనార్టీ, మహిళా, రాజ్యహింసవరకు అనేక సమస్యలపై పౌరహక్కులసంఘం పీడిత ప్రజల పక్షాన దృఢంగా నిలిచింది. ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచింది. ప్రజా సమస్యలపై, రాజ్య నిర్బంధంపై ఏర్పడిన అనేక ఐక్యవేదికలకు పౌరహక్కుల సంఘం నేతృత్వం వహించింది. అంతేకాదు దేశ వ్యాపితంగా ఏర్పడిన హక్కుల సంఘాల ఐక్యవేదిక (సి.డి.ఆర్.ఒ)లో కీలకమైన పాత్ర పోషించింది. ప్రస్తుతం అదే భూమికను పోషిస్తున్నది. సంస్థ నిర్వహిస్తున్న ఈ మొత్తం ప్రగతిశీల, ప్రజాస్వామిక కార్యచరణలో సంస్థ నాయకుడుగా శేషయ్య నిర్వహించిన పాత్ర అత్యంత కీలకమైనది.

దేశంలో బ్రాహ్మణీయ హిందూ ఫాసిజం రోజు రోజుకు పెచ్చరిల్లుతూ, ప్రజల ప్రజాస్వామిక, పౌరహక్కులకు మరింతగా విఘాతం కలిగిస్తున్న పరిస్థితుల్లో కామ్రేడ్ శేషయ్య మరణం, దేశంలోని ప్రజాస్వామిక, పౌరహక్కుల ఉద్యమాలతోపాటు, అన్ని ప్రజా ఉద్యమాలకు తీవ్రమైన నష్టమే. ఇటువంటి పరిస్థితులలోనే కామ్రేడ్ శేషయ్య స్ఫూర్తితో నేడు దేశంలో తీవ్రతరమవుతున్న మోడి నేతృత్వంలోని బ్రాహ్మణవాద హిందూ ఫాసిజానికీ, అది సేవ చేస్తున్న సామ్రాజ్యవాద నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో భాగం కావాల్సిందిగా మా కేంద్ర రీజినల్ బ్యూరో ప్రజాస్వామిక వాదులకూ, ప్రగతిశీలకాముకులకూ, ప్రజల శ్రేయోభిలాషులకు విజ్ఞప్తి చేస్తున్నది. ✶

## ఎంగెల్స్ ద్విశతాబ్ది స్మృతిలో

# ప్రపంచ కార్మికవర్గ ఉపాధ్యాయుడు ఫ్రెడరిక్ ఎంగెల్స్



ఫెడరిక్ ఎంగెల్స్-1820 నవంబర్ 28న జర్మనీలోని బార్మెన్ నగరంలో జన్మించాడు. ఆనాడు ప్రపంచంలోనే బాగా అభివృద్ధి చెందిన పారిశ్రామిక పట్టణం ఇంగ్లాండులోని మాంచెస్టర్. అక్కడ చార్టిస్టు ఉద్యమం ఒక రాజకీయశక్తిగా, కార్మికుల విప్లవోద్యమంగా ప్రారంభమయ్యింది. 1942-43లో ఇక్కడ ఎంగెల్స్ 20నెలలు అర్థశాస్త్ర అధ్యయనానికి, ఆర్థిక విషయాల పరిశీలనకు వినియోగించాడు. కార్మికవర్గం అనుభవిస్తున్న దుర్భర దారిద్య పరిస్థితిని లోతుగా పరిశీలించిన ఎంగెల్స్ చలించిపోయాడు. వారిపట్ల పెరిగిన అభిమానంతో చార్టిస్టు ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. ఆనాటి నుండి పారిశ్రామిక విధానాన్ని విమర్శిస్తూ చార్టిస్టుల పత్రికలోను, ఊహాజనిత సోషలిస్టులు నడుపుతున్న పత్రికల్లోను వ్యాసాలు రాయడం ప్రారంభించాడు. ఎంగెల్స్ పరిశీలన, అవగాహన, చారిత్రక దృష్టిని లోతుగా, విస్తృతంగా పెంచిన గొప్ప రచన, "ఇంగ్లాండులో కార్మికవర్గ స్థితిగతులు" అనే తొలి గ్రంథం ఈ కాలంలో 1845లో రాసినదే. దాని వెనుక 20నెలల కృషి ఉంది. గ్రేట్ బ్రిటన్‌లో తమ పరిశ్రమను అభివృద్ధి చేయడానికి బదులుగా ఎంగెల్స్ అక్కడి కార్మికుల పరిస్థితులను, పెంపొందుతున్న ఉద్యమాలను వివరాలతో సహా సేకరించాడు. చిన్నవయస్సులోనే లోతైన విశ్లేషణతో "ధనికులపై బీదల యుద్ధం" ప్రత్యక్షమై సార్వత్రికంగా మారుతుందని నొక్కి చెప్పాడు.

1844లో ఎంగెల్స్ మాంచెస్టర్ వెడుతూ దారిలో కొలోన్‌లో ఆగి, మార్క్స్‌తో కలిసి మాట్లాడి పరిచయం చేసుకున్నాడు. ఆనాటి పరిచయం ఇరువురి స్నేహానికి, విశ్వకళ్యాణానికి తొలిమెట్టు. మాంచెస్టర్ నుండి ఎంగెల్స్ తిరిగి వెడుతూ పారిస్‌లో కొద్దిరోజులు ఆగి మార్క్స్‌తో కలిసి ఉన్నాడు. వారిమధ్య సుదీర్ఘ చర్చలు జరిగాయి. వారిద్దరి అభిప్రాయాల్లో సారూప్యత ఉండడం కారణంగా చాలా విషయాల్లో ఏకాభిప్రాయానికి రాగలిగారు. అప్పటినుండి వారిమధ్య గాఢమైన స్నేహం ఏర్పడింది. వీరి భావాల్లోని ఐక్యత అసాధారణ మైత్రీ బంధానికి తోడ్పడింది.

యువవామపక్ష హెగెలియన్లు కమ్యూనిజాన్ని, ప్రజాతంత్ర భావాలను వ్యతిరేకించడంతో వారినుండి విడిపోయి 1944లో మార్క్స్, ఎంగెల్స్‌లు 'పవిత్రకుటుంబం' అనే గ్రంథాన్ని రాసారు. "క్రిటిసిజమ్ ఆఫ్ క్రిటికల్ క్రిటిసిజం"అని దానికిపేరు. ఇందులో ప్రజలే చరిత్ర నిర్మాతలని, సమాజ పరిణామానికి నిర్ణయాత్మకశక్తి ఆర్థిక ఉత్పత్తి అని రాశారు. శాస్త్రీయసోషలిస్టు సిద్ధాంత రచనలో ఈ గ్రంథం తొలి అడుగుగా చెబుతారు. "సమాజానికి భౌతిక ఉత్పత్తి విధానమే పునాది"గా ఉంటుందని చెప్పింది ఇందులోనే.

ఫ్రాన్స్‌లో మొదలై పశ్చిమ యూరప్ దేశాలకు వ్యాపించిన 1848 విప్లవాలు మార్క్స్, ఎంగెల్స్‌ను స్వదేశానికి వెళ్ళేలా చేసాయి. రైన్ రాష్ట్రంలో ఇరువురు మిత్రులు పోరాటాలకు గుండెకాయగా పనిచేసారు. మార్క్స్ దేశ బహిష్కరణకు గురికావడంతో ఎంగెల్స్ ఒక్కడే ప్రజా తిరుగుబాటులో పాల్గొన్నాడు. మూడు యుద్ధాల్లోను పోరాడాడు. తిరుగుబాటు ఓడిపోయిన తర్వాత స్విట్జర్లాండుకు తప్పుకొని, అటునుండి లండన్‌కు చేరాడు.

మార్క్స్‌తో కలిసి రాసిన 'ది హెూలీ ఫామిలీ' (1844), 'ది జర్మన్ ఐడియాలజీ' (రచన 1846, మొదటి ముద్రణ 1932), 'ది మానిఫెస్టో ఆఫ్ ది కమ్యూనిస్ట్ పార్టీ' (1848), స్వతంత్రంగా రాసిన 'ది కండిషన్ ఆఫ్ వర్కింగా క్లాస్ ఇన్ ఇంగ్లండ్' (1845), 'ప్రిన్సిపుల్స్ ఆఫ్ కమ్యూనిజం' (1848), 'ది పిజంట్ వార్ ఇన్ జర్మనీ' (1850), 'ఆంటీ డూరింగ్' (1878), 'సోషలిజం-యుటోపియన్ అండ్ సైంటిఫిక్' (1880), 'డయలెక్టిక్స్ ఆఫ్ నేచర్' (1883), 'ఆరిజన్ ఆఫ్ ఫామిలీ, ప్రైవేట్ ప్రాపర్టీ అండ్ స్టేట్' (1884) ఎంగెల్స్ ఆలోచనాధారను చూపుతాయి.

చారిత్రాత్మకమైన 1525 నాటి జర్మన్ రైతాంగ తిరుగుబాటు గురించి ఏంగెల్స్ 'జర్మనీలో రైతు యుద్ధం' అనే గ్రంథాన్ని 1850లో రాశాడు. ఈ రచన ద్వారా రైతాంగం పాత్రను గుర్తించిన మార్క్స్, ఏంగెల్స్ జర్మన్ విప్లవం రైతాంగం మద్దతుపై ఆధారపడి విజయం

సాధిస్తుందని స్పష్టం చేశారు.

మొత్తం కాలంలో పూర్తిగా రాజకీయార్థ శాస్త్ర అంశాలపై కనీసం ఇరవై వ్యాసాలు, కాపిటల్ కు సంబంధించిన పది రచనలు, స్వతంత్రంగా రాసిన ఏడు పుస్తకాలలో ప్రస్తావించిన అంశాలు అన్నీ కలిపి మొత్తంగా ఎంగెల్స్ రాజకీయార్థశాస్త్ర రచనలు ఐదు వందల పేజీల పైనే ఉంటాయి.

1844లో ఎంగెల్స్ రాసిన 'ఔట్ లైన్ ఆఫ్ ఎ క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ' అనే వ్యాసం గురించి మార్క్స్ తన రచనలలో ఎన్నోసార్లు ప్రస్తావించాడు. "ఆర్థిక ప్రత్యయాల మీద విమర్శలో అద్భుతమైన వ్యాసం" అని 1859లో రాశాడు. కాపిటల్ మొదటి సంపుటంలో కనీసం ఐదు చోట్ల దాన్ని ఉటంకించాడు. మార్క్స్ రచనల మీద ఈ వ్యాసం ప్రభావం గురించి ఎందరో పరిశోధకులు విశ్లేషించారు. ఈ వ్యాసంలో ఎంగెల్స్ ప్రతిపాదించిన మూడు మౌలిక భావనలనే మార్క్స్ ఆ తర్వాతి కాలంలో అభివృద్ధి చేశాడని పరిశోధకులు సోదాహరణంగా చూపారు. ఆ మూడు భావనలు: 1. మతానికీ ఆర్థిక వ్యవస్థకూ మధ్య అవిభాజ్య సంబంధం ఉంది. 2. సరుకు ఉపయోగ విలువకూ మారకపు విలువకూ మధ్య, విలువకూ ధరకూ మధ్య వైరుధ్యం ఉంది. 3. శ్రమ, కౌలు అంశాల మీద మాల్తూస్ భావనలు అర్థరహితమైనవి.

ఇరవై రెండు సంవత్సరాల యువ ఎంగెల్స్ ఆనాడు ఆడమ్ స్మిత్, డేవిడ్ రికార్డోల అభిప్రాయాలను ఢీకొంటూ, పెట్టుబడిదారీ విధానాన్నీ, దాని సమర్థనగా వచ్చిన శాస్త్రాన్నీ నిశితమైన విమర్శకు గురిచేయడం అబ్బురంగా అనిపిస్తుంది. ఎంగెల్స్ 'ది పొజిషన్ ఆఫ్ ఇంగ్లండ్' అని మూడు వ్యాసాలు రాశాడు. ఆ మూడు వ్యాసాలు కూడ రాజకీయార్థిక శాస్త్ర రచనలే. ఎల్బర్ ఫెల్డ్ ఉపన్యాసాలుగా సుప్రసిద్ధమైన ఆ రచనలు కూడ రాజకీయార్థశాస్త్ర విశ్లేషణలే. ఎంగెల్స్ చదివిన పుస్తకాల జాబితా చూస్తే రాజకీయార్థ శాస్త్ర అధ్యయనంలో, విమర్శలో ఆయన సాగించిన కృషి అర్థమవుతుంది.

ఎంగెల్స్ రాసిన 'ఎ కన్వెషన్ ఆఫ్ ఫేత్' కూడ రాజకీయార్థశాస్త్ర అవగాహనను యిస్తుంది. ఆ సంవత్సరమే ఎంగెల్స్ రాసిన 'ప్రొటెక్షనిజం ఆర్ ఫ్రీ ట్రేడ్ సిస్టం' అనే రాజకీయార్థ శాస్త్ర వ్యాసం. కమ్యూనిస్టు ప్రణాళిక కు సన్నాహకంగా ఎంగెల్స్ ప్రశ్న- జవాబుల రూపంలో రాసిన ప్రిన్సిపుల్స్ ఆఫ్ కమ్యూనిజం లో కొన్ని ప్రశ్నలు నేరుగా రాజకీయార్థిక శాస్త్ర ప్రశ్న-జవాబులే. 1859లో మార్క్స్ రచన ఇంట్రడక్షన్ టుది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ వెలువడినప్పుడు ఎంగెల్స్ దాని సమీక్షగా రాసిన వ్యాసం రాజకీయార్థ శాస్త్ర చర్చలో కీలకమైనది. కాపిటల్ మొదటి సంపుటి వెలువడగానే ఎంగెల్స్ దాని మీద తొమ్మిది సమీక్షలు రాశాడు. అలాగే కాపిటల్ మొదటి సంపుటం సారాంశం రాశాడు.

మార్క్స్ మరణించిన తర్వాత కాపిటల్ మొదటి సంపుటం మూడో జర్మన్ కూర్పు(1883 నవంబరు), నాలుగో జర్మన్ కూర్పు (1890 జూన్), రెండో సంపుటం (1885 మే), మూడో సంపుటం (1894 అక్టోబర్) ముందుమాటలు, మూడో సంపుటంలో రెండు వివరణలు, ఒక చేర్పు కూడా రాసాడు.

ఇలా ఎంగెల్స్ రాజకీయ ఆర్థిక పరిశోధనా కృషి విస్తారంగా చేశాడు. ఎంగెల్స్ రాజకీయార్థిక శాస్త్రంలో మార్క్స్ కన్న ముందే ప్రవేశించి, దాని ప్రాధాన్యతను అర్థం చేసుకున్నాడు. మార్క్స్ ప్రతిభను గుర్తించి అటువైపు ప్రోత్సహించాడు. మార్క్స్‌తో సమానమైన కృషి చేసినప్పటికి, తనను సహాయక పాత్ర లోనే చూసుకున్న వినయశీలి ఎంగెల్స్.

1844-83ల మధ్య కాలంలో మార్క్స్, ఎంగెల్స్ మధ్య 1,386 ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. తర్వాత వాటిని నాలుగు సంపుటాలుగా ప్రచురించారు. ఆ లేఖల్లో విషయాలు వారిద్దరి మధ్య నున్న భావసమైక్యతను, ఆచరణశీలతను గొప్పగా కళ్ళకు కడతాయి. వాటిలో వున్న శాస్త్రీయత, రాజకీయ విజ్ఞానం ఎంతో గొప్పది. ప్రపంచ కార్మికోద్యమ చరిత్రలోని అతిముఖ్యమైన ఎత్తుగడలు, కర్తవ్యాలు, కార్యక్రమం రూపొందిన క్రమాన్ని అర్థం చేసుకోవడానికి ఎంతగానో సహాయపడతాయి. వారిమైత్రి అపూర్వమైనది. ఆ ఉత్తరాలు విజ్ఞాన దీపికలు.

1885లో "లుడ్విగ్ ఫ్యూయర్‌భా సాంప్రదాయ జర్మన్ తత్వశాస్త్రం ముగింపు"వెలువడింది. హెగెలియన్ భావవాదం నుండి భౌతికవాద గతితర్కం, యాంత్రిక భౌతికవాదం నుండి గతితార్కిక భౌతికవాదంల పరిణామాన్ని, పురోగతిని వివరిస్తుందిది.

1889 జూలై 14న పారిస్‌లో బాస్టిల్ పతనపు శతజయింతి మహాసభ జరిపిన సందర్భంగా రెండవ ఇంటర్నేషనల్‌ను ఏర్పరచి, దానికి నాయకత్వం వహించాడు. మార్క్సిజానికి వ్యతిరేకంగా వచ్చిన అన్యవర్గ సిద్ధాంతాలను, రివిజనిస్టు పోకడలను ఎదుర్కొన్నాడు. సైద్ధాంతిక, రాజకీయ రంగాలలో మార్క్స్, ఎంగెల్స్ జరిపిన పోరాటాల ఫలితంగా యూరప్‌లో వర్గపోరాటం నిశితమైంది.

1895 ఆగస్టు 5న ప్రపంచ కార్మికవర్గ మిత్రుడు ఫ్రెడరిక్ ఎంగెల్స్ తన 75వ యేట లండన్‌లో తుదిశ్వాస విడిచాడు. ✶

*'దోపిడీశక్తులను శిక్షించడంలో సోవియట్ విధానంలో మొట్టమొదటి అంశం వాళ్లను రాజకీయాధికారం నుంచి మినహాయించడం. భూస్వాములు బూర్జువావర్గం ఇతర విప్లవ ప్రతీఘాతుక శక్తులందరికి వోటు హక్కు పూర్తిగా లేకుండా చేశారు. ఎర్రసైన్యంలో,' స్థానిక సాయుధ బలగాలలోనూ పనిచేసే హక్కు లేదు.' - చైనా సోవియట్ల నుండి.*

చైనా అనుభవం

# విప్లవాన్ని అభివృద్ధి చేస్తూ శత్రు ఏజెంట్ల విధ్వంసాన్ని అరికట్టడం

**చెన్-యున్, 1 అక్టోబర్ 1936**

గత ఐదు సంవత్సరాలుగా జపాన్ సామ్రాజ్యవాదులు చైనాపై చేసిన దురాక్రమణ చైనా జాతి భవితను అటూ ఇటూ గాకుండా (In the Balance) వుంచింది; దేశవ్యాప్తంగా ప్రజలు దేశాన్ని కాపాడడానికి శక్తివంతంగా లేచారు. జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా మరియు జాతి విముక్తి కొరకు చైనా కమ్యూనిస్టు పార్టీ ఈ ఉద్యమానికి ముందుపీఠిన నిలిచింది. ఈ పార్టీ నాయకత్వం కిందనే చైనా కార్మిక రైతాంగ ఎర్రసైన్యం, కొమింగ్‌టాంగ్ అభివృద్ధి నిరోధకుల 'చుట్టిముట్టి అణచివేసే' క్యాంపెయిన్‌లనూ, వెన్నంటి వచ్చిన బలగాల దాడులనూ వమ్ము చేసి, జపాన్ దురాక్రమణను ప్రతిఘటించడం కోసం ఉత్తర దిశన పదివేల లీలు (5 వేల కిలోమీటర్లు) పయనించింది. మంచుచేత కప్పబడి వుండే ఈశాన్య చైనాలో జపాన్ దురాక్రమణ దారులపై ఈశాన్య వాలంటీర్లు దాడి చేసింది కూడా పార్టీ నాయకత్వం కిందే[1]. కొమింగ్‌టాంగ్ ప్రాంతాల్లో అన్ని రకాల అణచివేతను, ఇబ్బందులను ధిక్కరించి కమ్యూనిస్టులు జాతీయ విముక్తి ఉద్యమంలోనూ, జాతి విముక్తికీ ప్రజల విముక్తికీ జరిగిన అన్ని పోరాటాలలోనూ ధైర్యంగా లీడింగ్ పాత్రను నిర్వహించారు. గత సంవత్సరం 1 ఆగస్టున చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీ మరియు సోవియట్ రిపబ్లిక్ కేంద్ర ప్రభుత్వం జాతిని నాశనం కాకుండా కాపాడడం కోసం జపాన్ వ్యతిరేక ఐక్య సంఘటనను స్థాపించడానికి నిర్దిష్టమైన ప్రతిపాదనలను ముందుకు తెచ్చింది.[2] సంవత్సరాలుగా మనం చేసిన ప్రయత్నాలు పొందింది, కమ్యూనిస్టు పార్టీ ప్రతిష్టను బ్రహ్మాండంగా పెంచింది.

ఈ కారణంగానే జపాన్ సామ్రాజ్యవాదులు కమ్యూనిస్టు పార్టీని అణచివేయాలని గంగవెర్రు లెత్తుతున్నారు; ప్రజల జాతీయ విముక్తి ఉద్యమాన్ని ఇచ్ఛగించని కొంత మంది కొమింగ్‌టాంగ్ నాయకులు ఎడతెరపి లేకుండా కమ్యూనిస్టులపై, ఇతర విప్లవకారులపై దాడిచేస్తూ, వారి సంస్థలను నిర్వీర్యం చేయాలని ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో రాజకీయంగా చైతన్యవంతులైన అనేకమంది పార్టీలో చేరాలని ప్రయత్నిస్తున్నారు. అనేక ప్రజాసంస్థలు తమలో కమ్యూనిస్టులు చేరి తమకు మార్గదర్శకత్వం వహించాలని అనుకుంటున్నారు. అందుకే జాతీయ విముక్తి ఉద్యమాన్ని వ్యతిరేకించేవారు పార్టీని, ఇతర విప్లవ సంస్థలను నూతన పద్ధతుల్లో విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

కమ్యూనిస్టు పార్టీకి, ఇతర విప్లవ సంస్థలకు బయట వుండి విప్లవాన్ని వ్యతిరేకించడానికో మరియు విప్లవకారుల ఆచూకీ తెలుసుకోవడానికో 'బానకడుపు, నల్లగౌన్ల, జిగురుబూట్లను' నియమించడానికో మాత్రమే వారు పరిమితం కావడం లేదు. విప్లవానికి ద్రోహం చేయడానికి పార్టీ మరియు ఇతర సంస్థలలోకి రహస్య గూఢచారులను కూడా వారు జొప్పిస్తున్నారు. కొన్నిచోట్ల విప్లవకారుల ముసుగులో రహస్య గూఢచారులు తమ నిజ స్వరూపం దాచుకొని ప్రజలను మోసగించడానికి బూటకపు కమ్యూనిస్టు పార్టీలను (ట్రేడ్ యూనియన్‌లను, యువజన సంఘాలనూ) స్థాపిస్తున్నారు. పార్టీ విధానాలను నిర్వీర్యం చేసి, విప్లవకారులను వలపన్ని చంపడానికి వారు 'కమ్యూనిస్టు పార్టీ', 'విప్లవ సంస్థ' వంటి పేర్లను వాడుకుంటున్నారు.

షాంఘై దీనికొక ఉదాహరణ. చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీ ఈ పట్టణం నుండి వెళ్ళిపోయి, చాలా కాలం క్రితమే సోవియట్ ప్రాంతానికి చేరింది; 1934 శీతాకాలంలోనే షాంఘై 'సబ్-బ్యూరో' రద్దయింది. అప్పటి నుండి, ఈ పట్టణంలో కేంద్రకమిటీ యొక్క ఏ సంస్థగానీ, ప్రతినిధిగానీ లేరు. అయినా, 'కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీ సెంట్రల్ బ్యూరో, కేంద్రకమిటీ ప్రతినిధి, 'యువ కమ్యూనిస్టుల కేంద్ర బ్యూరో', 'ఫలానా-ఫలానా ట్రేడ్ యూనియన్' వంటి పేర్లతో షాంఘైలో అనేక సంస్థలు పుట్టుకొచ్చాయి. 'చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రొబేషనరీ సభ్యుల షాంఘై కమిటీ, అనేది కూడా పుట్టుకొచ్చింది. ఈ సంస్థలు వార్తా పత్రికలను కూడా తీసుకువచ్చి, మన పార్టీ నాయకులు స్వదేశంలోనూ, విదేశాలలోనూ ప్రచురించిన వ్యాసాలను కొన్నిసార్లు పునర్ ముద్రిస్తున్నారు. ఈ బూటకపు సంస్థలలో కొంతమంది నిజమైన విప్లవకారులూ, పార్టీ సభ్యులూ కూడా వున్నారు. ఇది ఆశ్చర్యపరిచేదేమీ కాదు. ఎందుకంటే శత్రు గూఢచారుల వల్ల తాము మోసపోయామని వారికి తెలియక, తాము నిజమైన విప్లవ సంస్థల్లో చేరినట్టుగానే నమ్ముతున్నారు. అంతేగాక ఇతర విప్లవకారులనూ మోసగించడానికి ఒక ముసుగుగా వాడుకోవడానికి కూడా తమకే తెలియకుండా మోసగించబడిన ఇలాంటి కమ్యూనిస్టులు- విప్లవకారులు శత్రు గూఢచారులకు అవసరం.

రహస్య గూఢచారులు బూటకపు విప్లవ సంస్థలను నెలకొల్పే ఈ నూతన వ్యూహానికి విప్లవ వ్యతిరేకులైన వారు ఎందుకు తలపడుతారు?

మొదటిది, 'కమ్యూనిసస్టు పార్టీ' డాక్యుమెంట్లను పెద్ద మోతాదులో ఫోర్జరీ (దొంగలించడం) చేయాలని వారి ఆశయం. చింత లేకుండా కూర్చుండి, దేశం నాశనమవుతుంటే చూడడానికి తీర్మానించుకున్న కొమింగ్‌టాంగ్ నాయకులు ఐక్య సంఘటనను తిరస్కరించడానికీ, పార్టీ మరియు ఇతర విప్లవసంస్థల ప్రతిష్టను దెబ్బతీయడానికీ ఈ డాక్యుమెంట్లను వినియోగించుకో గలుగుతారు.

రెండవది, జాతీయ విముక్తి ఉద్యమం విస్తరిస్తూ వుండడం వల్ల పెరిగిపోతున్న కమ్యూనిస్టు పార్టీ ప్రతిష్టను మరియు మరింత ఎక్కువమంది ప్రజలు పార్టీలో చేరాలనో లేదా దాని వెనుక నిలవాలనోనని కోరుకోవడం చూసి, ప్రజలను మోసగించి వలపన్ని

పట్టుకొని అరెస్టు చేసి చంపాలనే ప్రయత్నంలో భాగంగా వారు బూటకపు కమ్యూనిస్టు పార్టీలనూ–విప్లవ సంస్థలనూ నెలకొల్పాలనుకుంటారు.

మూడవది, షాంఘైని వదిలి కేంద్రకమిటీ వెళ్ళిపోయినా జాతీయ విముక్తి కొరకు కార్మికోద్యమంలో, విద్యార్థి వుద్యమంలో, ఇతర అన్ని ఉద్యమాలలో స్వతంత్రంగా వీరోచితమైన లొంగని పోరాటాలను కొనసాగిస్తూ అనేకమంది పార్టీ సభ్యులూ, సానుభూతిపరులూ ఇక్కడే వుండిపోయారని శత్రువుకు తెలుసు. ఇలాంటి వారిని అరెస్టు చేసి హత్య చేయాలనే లక్ష్యంతో విప్లవ వ్యతిరేకులు బూటకపు కమ్యూనిస్టు పార్టీలనూ– విప్లవ సంస్థలనూ నెలకొల్పారు. అజ్ఞాత వాసంలో వుంటూ కార్యకలాపాలు నిర్వహించే పరిస్థితుల్లో పార్టీ సభ్యులకూ, వారి వున్నత సంస్థలకూ మధ్య గల కమ్యూనికేషన్ ఇబ్బందులను ఆసరా చేసుకొని, శత్రు గూఢచారులు పార్టీ సభ్యులుగా చెలామణి అయిపోయి విప్లవకారులతో సంబంధాలు పెట్టుకోవడానికి ప్రయత్నించారు. శత్రు గూఢచారుల ఈ ఎత్తుగడల గురించి తెలియని చాలా మంది విప్లవకారులు అలాంటి సంబంధాలలోకి వెళ్ళి తమ ప్రాణాలు కోల్పోయారు.

విప్లవ సంస్థలను నాశనం చేయాలనే ప్రయత్నంలో శత్రు గూఢచారులు బూటకపు సంస్థలను నెలకొల్పడంలో మాత్రమే ఆగరనేది వాస్తవమే. మనమిప్పటికే కనుగొన్న విధంగా, శత్రువుకు మరింకా ఎన్నో దుష్టపన్నాగాలు వున్నాయి.

కమ్యూనిస్టు పార్టీ, ఇతర విప్లవ సంస్థలలోకి శత్రు గూఢచారులు ప్రవేశించిన వెంటనే వారు వాటిని నాశనం చేయాలనేమి లేదు; ఎందుకంటే, వారు కోరుకునేది మరింత ఎక్కువమందిని పట్టుకోవాలని, మరింత పెద్ద నష్టం కలిగించాలని. ఒక ముఖ్యమైన సంస్థను నాశనం చేసి, దాని నాయకులను అరెస్టు చేసే అవకాశం వున్నా, వారు అన్నిసార్లూ అలా చేయకపోవచ్చు. సంస్థ యొక్క నమ్మకాన్ని పొంది తమ స్థానాలను మరింత బలంగా తయారు చేసుకోవడానికి, 'లక్ష్యం కొరకు కృషిచేస్తున్న వారు'గా వుండి ఐక్య సంఘటన కొరకు కృషి చేస్తూ తలమునకలవుతున్నారని నటించవచ్చు; ఆ విధంగా మరింత ఎక్కువ సంఖ్యలో, మరింత ముఖ్యమైన సంస్థలను నాశనం చేయగలుగుతామని ఆశిస్తారు. కాబట్టి, కొంత మంది కమ్యూనిస్టులూ– ఇతర విప్లవకారులూ నమ్ముతున్నట్టుగా, విప్లవకారులను చూడగానే అరెస్టు చేసేవారు మాత్రమే శత్రు గూఢచారులని నమ్మడం తప్పు. ఒక అనుమానించ దగిన వ్యక్తి ఒకానొక పనిలో 'కష్టపడి' పని చేసినంత మాత్రాన, లేదా, అతనికి తెలిసినట్టి, ఒక ముఖ్యమైన పని సాఫీగా నిర్వహించబడినంత మాత్రాన అతనిపై నమ్మకాన్ని కలిగి వుండడమనేది ఘోరమైన పొరపాటు అవుతుంది. ఇలాంటి పొరపాట్లు చేసే వారినే శత్రు గూఢచారులు తమ కార్యకలాపాలకు ముసుగు కప్పడానికి వాడుకుంటారు. శత్రు గూఢచారులను అనుమానించని ఇలాంటి విప్లవకారులనే తరచుగా శత్రువు స్వేచ్ఛగా వదులుతాడు. ఎందుకంటే, వారి నమ్మకం నీడలోనే శత్రువు తలదాచుకుంటాడు.

ఉన్నత పార్టీ సంస్థలలోకి జొరబడడానికి శత్రు గూఢచారులు వినియోగించే మరొక పద్ధతి ఆ సంస్థను పైనుండిగానీ లేదా కింది నుండి గానీ విధ్వంసం చేయడం. అనేకమంది పార్టీ సభ్యులు, విప్లవ కేడర్ల హత్య గావించబడినప్పుడు, 'సంస్థను పునరుద్ధరించడానికి', 'సంబంధాలను తిరిగి నెలకొల్పడానికి' ముసుగులో వున్న శత్రు గూఢచారులు ముందుకు వస్తారు. ఆ విధంగా వున్నత సంస్థలోకి క్రమంగా ప్రవేశిస్తారు. ఒక పార్టీ సంస్థ నాశనం చేయబడిన ప్రతిసారీ, ఎవరో ఒకరు తగినంత జాగ్రత్తగా లేకపోవడం వల్ల డిటెక్టివ్‌లు వారి వెన్నంటి పట్టుకున్నారనో, అందుకే వినాశనం జరిగిందనీ అరిచి, ఆ వినాశనంలో తమ వంతు పాత్రపై విప్లవకారుల దృష్టి పడకుండా తప్పుదారి పట్టించడానికి శత్రు గూఢచారులు ప్రయత్నిస్తారు. ఇలాంటి యుక్తులు ఎందుకు పనిచేస్తాయంటే, చాలా మంది కమ్యూనిస్టులు కఠినమైన పరిస్థితుల్లో ఉండాల్సినంత జాగ్రత్తగా వుండరు. వీరు, ఒక పార్టీ సంస్థ నాశనం చేయబడినప్పుడు, సంబంధాలను తిరిగి నెలకొల్పడానికి తమ సాంప్రదాయ విప్లవ ఔత్సాహికత–పట్టుదలతో చాలా ఆతురుతతో వుంటారు. వీరి ఆతురత ఎంతగా వుంటుందంటే అందుకు తగిన వ్యక్తి తమకు లభించాడా లేదా అనేది కొంచమైనా ఆలోచించరు. మనలో దాగివున్న శత్రు గూఢచారుల సమస్యను మనం జాగ్రత్తగా అధ్యయనం చేయలేదు కాబట్టి, ఈ గూఢచారులు తమ లక్ష్యాలను తరచుగా సాధించగలుగుతున్నారు. ఒక నాశనమైన సంస్థను ఎన్ని సార్లైనా పునఃస్థాపించవచ్చు; కాని, అందులోనే నక్కి వున్న శత్రు గూఢచారులను ఏరివేయడంలో అది విఫలమైతే, రక్తంతో తడిసివున్న శత్రు కబంధ హస్తాలకు అన్నిసార్లూ విప్లవకారులను అందించడమే జరుగుతుంది. ఒక నాశనమైన సంస్థను పునరుద్ధరించడంలో అజ్ఞాతవాసంలో పనిచేస్తున్న విప్లవకారులు తొందరపడకూడదని చైనాలో, ఇతర చోట్లా లభించిన అనేక సంవత్సరాల అనుభవం మనకు నేర్పింది. ఎవరైనా శత్రు గూఢచారుల పాత్ర వున్నదా లేదా అనేది అత్యంత స్పష్టంగా తేలిపోయేంత వరకు, వినాశనానికి గల కారణాలను పరిశోధించడం విప్లవ కారుల ప్రథమ కర్తవ్యం. ఒక సంస్థను పునఃస్థాపించడానికి మనం వేచి వుంటే మనం తాత్కాలిక నష్టాలకు గురికావచ్చనేది వాస్తవమేగాని, ఈ నష్టాలు మనం అనాలోచితంగా పునఃస్థాపన ప్రయత్నాలు చేయడం ద్వారా కలిగే వెలలేని క్యాడర్ల మరణాల నష్టాల కన్నా చాలా తక్కువ. విప్లవ కేడర్లను పోగొట్టుకోవడం అన్నింటినీ మించిన నష్టం. విప్లవ క్యాడర్లు పట్టుదలగా చేసే పోరాటం లేకుండా విప్లవంలో విజయాన్ని సాధించడం అసాధ్యం.

శత్రు గూఢచారులు విప్లవ సంస్థల్లోకి జొరబడడానికి వినియోగించే మూడవ పద్ధతి తమను తాము తప్పించుకొని పారిపోయి వచ్చిన విప్లవకారులుగా, సామ్రాజ్యవాదుల, కొమింగ్‌టాంగ్ జైళ్ళ నుండి విడుదల చేయబడిన వారిగా చెలామణి చేసుకోవడం. వారి తలల నుండి రక్తం కారుతూ కనబడి, తాము చిత్రహింసల పాలైనామని చెప్పుకుంటారు. ఇలాంటి కుయుక్తులు తరచుగా పనిచేస్తాయి. ఎందుకంటే విప్లవకారులు సాధారణంగా

దయార్ద్ర హృదయులూ, వెన్నలాంటి మనసు కలిగినవారు. అయితే, ముందు పరిశోధన జరగకుండా అప్పుడే జైలు నుండి బయటకు వచ్చిన వ్యక్తిని సంస్థలోకి అనుమతించడం వాస్తవానికి సరైనది కాదు. అలాంటి వ్యక్తితో వెంటనే సంబంధాలను నెలకొల్పడానికి బదులు, అతను నిజమైన విప్లవకారుడైనప్పటికీ, సంస్థ అతనిని కఠినమైన పరీక్షకు గురిచేయాలి. శతృవు జొరబడతాడనే ప్రమాదమేగాక, జైల్లో వుండగా అతని ఫోటోను తీసుకునే అవకాశం వుంది. ఇతర విప్లవకారుల గురించి జరిగే వేటలో డిటెక్టివ్‌లు అతన్ని తప్పనిసరిగా వెన్నంటుతారు. ఇలాంటి పరీక్షకు గురిచేయడాన్ని నిజమైన విప్లవకారులెవరైనా ఆక్షేపణ తెలుపరు; ఎందుకంటే, సంస్థ భద్రతను కాపాడి విప్లవ లక్ష్యానికి జరిగే నష్టాన్ని నిరోధించడమే దాని లక్ష్యమని అతనికి తెలుసు.

ఇక, శతృ గూఢచారులను ఎలా గుర్తించాలి? వారందరికీ ఉమ్మడిగా కొన్ని ప్రత్యేక లక్షణాలుంటాయి.

మొదటిది, వారు ఎంతగా నటించినా వాస్తవానికి విప్లవం కొరకు ప్రయత్నించరు. వారు ఎంత అణకువగా వున్నప్పటికీ, విప్లవం కొరకు రాత్రింబవళ్ళు పనిచేస్తూ విరామ మెరుగకుండా వున్నామని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ, కమ్యూనిస్టు పార్టీ మరియు ఇతర విప్లవ సంస్థల మౌలిక విధానాలనూ ఎత్తుగడలను ఆచరించటానికి వారు ఇచ్చగించరు. ఉదాహరణకు జాతీయ విముక్తి జపాన్ వ్యతిరేక ఐక్య సంఘటన విధానాన్ని అనుసరించాలనీ, కార్మిక- విద్యార్థి ఉద్యమాలలో పని కేంద్రీకరణను దానికనుగుణంగా మార్చుకోవాలనీ కేంద్రకమిటీ ఇప్పుడు నిర్ణయించింది కాబట్టి శతృ గూఢచారులు దీన్ని నిరవధికంగా నిలువరించడానికీ, ఆ విధానాన్ని ఉద్దేశ్యపూర్వకంగానే తప్పుగా అన్వయించడానికీ లేదా దాన్ని నిర్వీర్యం చేయడానికీ ప్రయత్నిస్తారు.

రెండవది, శతృ గూఢచారుల మౌలిక లక్ష్యం విప్లవకారులను అరెస్టు చేసి, హత్య చేయడం, వారి సంస్థలను నాశనం చేయడం. అందువల్ల, విప్లవకారుల నమ్మకాన్ని పొందగలిగిన వెంటనే తమమీద అనుమానం రాకుండా వుండేలా తమతో సంబంధం లేని, లేదా ప్రత్యక్ష సంబంధం లేని (సంస్థలలో వున్న వారి) అరెస్టులు, హత్యలనూ జరిపించడం మొదలుపెడుతారు. విప్లవకారులు పట్టుబడడం జరిగినపుడల్లా వీరు తరచుగా 'వెంట్రుకవాసిలో తప్పించుకోవడం' అనేది చేయగలుగుతారు. విప్లవ సంస్థలో, 'ఎ' స్థానంలో పనిచేయడానికి వారు నియమితులైన వెంటనే ఆ సంస్థ నాశనం చేయబడుతుంది. వారు 'బి' స్థానానికి, ఆ తరువాత 'సి' స్థానానికి బదిలీ చేయబడిన తర్వాత కూడా ఇదే జరుగుతుంది. స్పష్టంగానే, ఇదే వారిని శతృ గూఢచారులుగా గుర్తు చేస్తుంది.

మూడవది, విప్లవ సంస్థల సభ్యత్వాన్ని రిజిష్టర్లలో కెక్కించడం. ఇప్పటికే వారికి లేని ఇతర సమాచారాన్ని సంపాదించడం కొరకు శతృ గూఢచారులు పరమ కుతూహలంగా వుంటారు. తరచుగా వారు వివరణాత్మక వ్యక్తిగత సమాచారాన్ని పొందడానికి పై కమిటీల పేరుతో అనేక ప్రశ్నావళులను, గణాంక పత్రాలను (స్టాటిస్టికల్ ఫారాలనూ) తయారు చేస్తారు. ఆ తరువాత, కొన్ని సార్లు విప్లవకారులను వెంటనే అరెస్టు చేయిస్తారు. కానీ చాలా సందర్భాలలో రికార్డులను భద్రపరచిన చోట్లను పోలీసులతో వెతికించి, వాటిని జప్తు చేయించి, ఆ తరువాత అరెస్టులు చేయిస్తారు, ఇలాంటి ఎత్తుగడలు బాగా పనిచేస్తాయి. ఎందుకంటే, ఈ గూఢచారులు అజ్ఞాత కార్యకలాపాలను శాసించే సూత్రాలకు భిన్నంగా యేమేమి చేస్తున్నారో గమనించడాన్ని కొంతమంది విప్లవకారులు ఎన్నడూ లెక్కచేయరు. పైసంస్థల్లో వున్న కొందరు ఖచ్చితంగా రహస్యంగా వుంచాల్సిన ముఖ్యమైన సమాచారాన్ని రాసిపెట్టడమేగాక పత్రికల్లో ప్రచురించడం కూడా చేస్తారు. ఇలాంటివారు మూర్ఖులన్నా కావచ్చు లేదా శతృవు గూఢచారులన్నా కావచ్చు.

నాల్గవది, శతృ గూఢచారుల మరో ఎత్తుగడ ఏమిటంటే, ఒక వ్యక్తికి లేదా సంస్థకు వ్యతిరేకంగా ఉద్దేశ్యపూర్వకంగానే అసంతృప్తిని రెచ్చగొట్టడం ద్వారా విప్లవ శ్రేణుల్లో లేదా భేదాభిప్రాయాలకు (అపోహలకు) బీజాలు వేసి ముఠాలను సృష్టించడం. విప్లవ సంస్థల్లో భిన్నాభిప్రాయాలకు (అపోహలకు) బీజాలు వేసి ముఠాలను సృష్టించడం. విప్లవ సంస్థల్లో భిన్నాభిప్రాయాలు, అంతులేకుండా గొడవలకు దారితీస్తాయనీ, ఆ విధంగా ఉద్యమం ముందుకు సాగడాన్ని అసాధ్యం చేస్తాయనీ వారికి తెలుసు. అలాంటి భేదాభిప్రాయాలను తమ ప్రయోజనాల కోసం వాడుకోగలరు. మా యూపూ దీనికొక ఉదాహరణ; ఇతను 1929లో జియాంగ్సు ప్రావిన్షియల్ పార్టీ కమిటీని కేంద్రకమిటీకి వ్యతిరేకంగా రెచ్చగొట్టడానికి ప్రయత్నించి అటు తరువాత లీడింగ్ ట్రాట్స్కైట్‌గా మారాడు. ఇప్పుడు ఇతను పోలీసు డిటెక్టివ్ అయి, నాంజింగ్‌లో బహిరంగంగానే పనిచేస్తున్నాడు.

ఐదవది, విప్లవ సంస్థలో తన స్థానాన్ని చేపట్టాడానికి ఒక నూతన వ్యక్తి వచ్చినప్పుడూ, లేదా ప్రజా ఉద్యమం ప్రగతి తానింకా కొనసాగడాన్ని అసాధ్యం చేసినప్పుడూ, అది తెలుసుకున్న శతృ గూఢచారి, ఆ సంస్థ ప్రతిష్టను దెబ్బతీయడానికి వార్తా పత్రికలలో తన 'తప్పును ఒప్పుకుంటూ' ప్రకటనలు చేయడం ద్వారా పార్టీ సభ్యుడిగా తనను తాను 'సమర్పించుకుంటాడు'. పత్రికల్లో తరచుగా కనబడే కమ్యూనిస్టుల తప్పులు ఒప్పుకోవడాలు వాస్తవానికి శతృ గూఢచారులు ఇలా సృష్టించిన కట్టుకథలే.

శతృ గూఢచారులు ఎలాంటి మోసకారులంటే వారు పైన చెప్పిన కుట్రపూరితమైన ఎత్తుగడలకు మాత్రమే పరిమితం కారని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వాటిని కనుగొనడానికి విప్లవకారులు నిరంతరం జాగరూకులుగా వుండాలి.

కొన్నిసార్లు శతృ గూఢచారులు విజయం సాధించడానికి గల ఒక కారణం, వారు గత కొన్ని సంవత్సరాలుగా మరింత జిత్తులమారిగా మారడమేననేది నిర్వివాదం. కానీ ప్రధాన కారణం విప్లవకారులు తగినంత జాగరూకులుగా లేకపోవడమే. కొన్ని

సందర్భాలలో, శత్రు గూఢచారుల ప్రతీఘాతుక విప్లవ దాడులపట్ల విప్లవకారులు పూర్తిగా గుడ్డిగా వ్యవహరించారు. ఉదాహరణకు, 1932-33లలో మూడు సందర్భాలలో షాంఘై కమ్యూనిస్టు పార్టీ సంస్థ అర్జీదారుల గత చరిత్రను పరిశీలించకుండానే బహిరంగంగా చేర్చుకోవడం ద్వారా సభ్యులను రిక్రూట్ చేసుకొని, పార్టీలోకి శత్రు గూఢచారులు ప్రవేశించడానికి బ్రహ్మాండమైన అవకాశాన్ని అందించింది. ఒక విప్లవ సంస్థ నాశనం చేయబడిన ప్రతిసారీ శత్రు గూఢచారుల పాత్ర ఏదైనా వుందేమోననేది కనుగొనడానికి బదులు, ఎవరినో డిటెక్టివ్‌లు వెన్నంటే వుంటారనే వివరణకు సంబంధిత కేడర్లు ఎల్లప్పుడూ ఆమోదిస్తూ వచ్చారు. కొంతమంది వ్యక్తులు ముఠాలను ఆర్గనైజ్ చేసేవారిగా గుర్తించబడ్డారు. వారు వెళ్ళిన ప్రతిచోట, విప్లవ సంస్థలు నాశనమయ్యాయి. వారు అరెస్టు కాబడినప్పుడు, డిటెక్టివ్‌లు వారిని మర్యాదపూర్వకంగా వదిలేశారు. తమ శ్రేణుల్లో శత్రు గూఢచారులున్నారేమోనని తెలుసుకోవడానికి ఇలాంటి అసాధారణ సంఘటనలను పరిశోధించడానికి బదులు, అలాంటి అనుమానించదగిన వ్యక్తులను మంచివారిగానే సంబంధిత సంస్థలు భావిస్తూ వచ్చాయి, అటు తరువాత, ఆ సంస్థలు అనుకున్నట్టుగానే గొప్ప నష్టాలకు గురయ్యాయి. విప్లవ సంస్థల్లో కొంతమంది ఎంతటి మూర్ఖులంటే, వారు బహిరంగంగా పోలీసులకు దాసోహమని, అటు తరువాత శత్రు గూఢచారులుగా తయారై విప్లవకారులను అరెస్టుచేసి చంపిన కొంతమంది వ్యక్తులను తమ 'కామ్రేడ్స్'గా భావించారు. ఆ గూఢచారులు తిరిగి విప్లవ మార్గంలోకి వస్తారని వారు ఆశించారు. వీరి మూర్ఖత్వానికి హద్దులు లేకుండా పోయాయి.

కింది స్థాయి సంస్థలలో పనిచేస్తున్న అనేక మంది విప్లవకారులు, కొంత మంది అనుభవం లేని కామ్రేడ్స్ ఎంత అమాయకంగా వున్నారంటే వారు చాలా సులువుగా శత్రు గూఢచారుల బంధాల్లో ఇరుక్కుంటున్నారు. ఉన్నతస్థాయి సంస్థలు వారికి విప్లవ జాగరుకతతో శిక్షణనివ్వక పోవడం వల్ల కొంత ఆ సంస్థలోగల అనేక నిర్మాణపరమైన బలహీనతల వల్ల కొంత అలా జరగడానికి కారణం. వీటిని శత్రు గూఢచారులు వినియోగించుకుంటున్నారు. ఉదాహరణకు, అజ్ఞాత పనివిధానంలో వుండే ప్రమాదాలను విస్మరిస్తూ కొన్ని సంస్థలు డజను సంవత్సరాలకు పైగా తమ నిర్మాణాలను మార్పు చేయకుండా అలాగే కొనసాగిస్తున్నాయి. వారు చేయాల్సిన పని మొత్తాన్ని గానీ లేదా, వారికి వాస్తవంగా అవసరమైన మనుషుల సంఖ్యను గానీ పరిశీలించకుండా, వారు తమ ఊర్థ్వతల-సమతల నిర్మాణాలను మార్పు చేయడానికి ఎప్పుడూ విముఖంగానే వుంటున్నారు. అందుకే సిబ్బంది సంఖ్యను స్థిరంగా వుంచడం కోసం జనాన్ని చిత్తం వచ్చేటట్లు రిక్రూట్ చేస్తున్నారు. వాస్తవమేమిటంటే ప్రస్తుత పరిస్థితుల్లో నిర్మాణం ఎంత సరళంగా వుంటే, సంస్థ ఎంత స్వతంత్రంగా వుంటే అంత మంచిది. ఈ నిర్మాణపరమైన బలహీనతల వల్ల, అలవాటుకు గల బలం వల్ల, శత్రు గూఢచారులు పరిచయ పత్రాన్ని ఫోర్జరీ చేసినప్పటికీ ఒక విప్లవ సంస్థ, మరో సంస్థ లేదా వ్యక్తి పరిచయం చేసిన ఎవరినైనా పరిశోధన చేయకుండానే ఆమోదించవలసి వస్తున్నది. బుద్ధికి తోచిన విధంగా, బాధ్యతారాహిత్యంగా జనాన్ని పరిచయం చేస్తూ కొంత మంది వ్యక్తులూ, కొన్ని సంస్థలూ అజాగ్రత్తగా వుంటున్నాయి. ఇలాంటి వారి నుండి పరిచయం పత్రాలను పొందడంలో శత్రు గూఢచారులకు ఏ మాత్రం ఇబ్బంది లేదు. అందువల్ల ఈ విధంగా పరిచయం చేయబడిన వ్యక్తిని సంస్థలోకి ఆమోదించే ముందు, అతను ఎక్కడినుండి వచ్చిన వాడైనా అతని గురించిన సర్వ వాస్తవాలను కనుగొనడం తప్పనిసరి, శత్రు గూఢచారులు పన్నిన వలలో పడకుండా తప్పించుకోవాలంటే మనకు ఇదొక్కటే మార్గం. అజ్ఞాత పని విధానం సూత్రాలను విస్మరిస్తున్న సంఘటనలను అన్నిచోట్లా గల విప్లవ సంస్థల్లో మనం చూడగలం. ఖచ్చితంగా రహస్యంగా వుంచాల్సిన ప్రతిదాన్నీ కొంత మంది సాధారణంగా రాసే ఉత్తరాలలో కూడా రాసేస్తున్నారు. ఇది మరింత బాగా తెలుసుకోవడానికి మనకు రక్తసిక్తమైన గుణపాఠాలు తగినన్ని లేవా?

క్రూరమైన శత్రు నిర్బంధం వల్ల సృష్టించబడిన భయానక పరిస్థితుల్లో విప్లవ సంస్థలు అనేక ప్రాంతాల్లో నిరంతరం వినాశనమయ్యే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. ప్రతి విప్లవకారుడు కూడా తన సంస్థతో సంబంధాన్ని కోల్పోయే అవకాశం వుంది. ఇలా జరగడమంటే అర్థం ఉద్యమానికి గణనీయమైన నష్టం జరగడమే కానీ, దీనర్థం విప్లవకారులు తమకుతాముగా తమ పనిని కొనసాగించలేరని కాదు. తమ సంస్థలతో విప్లవకారులకు సంబంధాలు తెగిపోవడమనేది అసాధారణమైన విషయమేమీ కావని ప్రపంచ వ్యాప్తంగా లభించిన అనుభవం మనకు తెలుపుతున్నది. అలాంటి సంస్థలు విదేశాల్లో చాలా ప్రాంతాల్లో నిషేధించబడి, కొద్దిమంది నాయకులచే ప్రచురించబడే ఒక వార్తాపత్రికపై మాత్రమే ఆధారపడగలుగుతున్నారు. ఆ పత్రిక తరచుగా విప్లవానికి మార్గదర్శకత్వం వహించడానికి వ్యూహం, ఎత్తుగడలకు సంబంధించిన వ్యాసాలను ప్రచురిస్తుంది. అందువల్లనే తమ సంస్థలతో సంబంధాలను పోగొట్టుకున్నవారు తమ పనిని కొనసాగించడం మానుకోలేదు. వారు ఎక్కడినుంచో వచ్చే ఆ వార్తా పత్రిక ఇచ్చిన మార్గదర్శకత్వాన్ని అనుసరించి స్వతంత్రంగా తమ పోరాటాన్ని కొనసాగించారు. ఈ విధంగా తమకు తాముగా పనిచేయగలిగే సామర్థ్యంగల ప్రముఖమైన విప్లవకారులు ఎంతో మంది పుట్టుకొచ్చారు. అంతేగాక, వారికి సంబంధాలే లేనప్పుడు శత్రు గూఢచారులు వారిని వెన్నంటి పట్టుకోవడమనేది అసాధ్యం.

నా అభిప్రాయంలో చైనా విప్లవకారులు ఈ ఉదాహరణను తప్పకుండా అనుసరించాలి. షాంఘై, తదితర చోట్ల శత్రు గూఢచారులు ఇప్పటికే 'కమ్యూనిస్టు హెడ్‌క్వార్టర్స్'ను, 'విప్లవ సంస్థలను' నెలకొల్పారు. ఇలాంటి బూటకపు సంస్థలలో చేరి, మోసగించబడిన నిజమైన విప్లవకారులు వెంటనే దాని నుండి బయటపడి, చడీచప్పుడు లేకుండా స్వతంత్రంగా తమ పనిని ప్రజల్లో కొనసాగించాలి. ఫిబ్రవరి విప్లవానికి ముందు చాలాకాలం వరకు రష్యన్ విప్లవకారులు చేసింది ఇదే కదా? అప్పుడు వారు

పోటెత్తుతున్న ప్రజా వెల్లువ

# కార్పెట్ సెక్యూరిటీపై కదం తొక్కుతున్న ప్రజలు

కార్పెట్ సెక్యూరిటీ పేరుతో అడుగడుగునా నెలకొల్పుతున్న అర్ధ సైనిక, పోలీసు క్యాంపులకు వ్యతిరేకంగా దండకారణ్యం, ఝార్ఖండ్ స్పెషల్ గెరిల్లా జోన్/స్పెషల్ ఏరియా ప్రాంతాలలో ప్రజా పోరాటాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. ఇది రాజ్య వ్యతిరేక పోరాటం మాత్రమే కాదు, ఈ ప్రభుత్వాల దన్నుతో తమ భూములను కబ్జా చేసుకుని, ప్రాకృతిక సంపదను దోచుకుపోవాలనుకుంటున్న సామ్రాజ్యవాదులు, దేశ దళారీ నిరంకుశ బడా బూర్జువా వర్గం, బడా భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం. సామ్రాజ్యవాదులతో కలిసి దోపిడీ పీడనలను మరింత పటిష్టంగా వ్యవస్థీకృతం చేయడం కోసం బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టులను అధికారంలో నిలిపిన దేశ పాలక వర్గాలపై జరుగుతున్న వర్గ పోరాటంలో భాగం. కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని ఖర్చు పెడుతూ కేంద్ర అర్ధ సైనిక, ప్రత్యేక, రాష్ట్ర, జిల్లా పోలీసు బలగాలను కలిపి ప్రజల భూములలో ఏర్పాటు చేస్తున్న క్యాంపులకు వ్యతిరేకంగా పోరాడడం ప్రజలు తమ మనుగడను కొనసాగించడంలో ఒక భాగంగా మారిపోయింది. మావోయిస్టు పార్టీపై యుద్ధం పేరుతో ప్రజలపై యుద్ధం చేస్తున్న పాలక వర్గాలకు వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న ప్రజాయుద్ధంలో క్యాంపులకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలు భాగమయ్యాయి.

సామ్రాజ్యవాదుల ఎల్‌పిజీ విధానాన్ని అనుసరిస్తూ భారత పాలక వర్గాలు మావోయిస్టు పార్టీ నాయకత్వంలో సాగుతున్న విప్లవోద్యమాన్ని తుడిచివేయడానికి ఒకదాని తరువాత మరొక నిర్బంధ క్యాంపెయిన్‌లను అమలు చేస్తూ వస్తున్నాయి. 2017 మే నాటి నుంచి వ్యూహాత్మక విధానంగా పేర్కొంటూ 'సమాధాన్' దాడిని చేపట్టాయి. ఇందులో భాగంగా మావోయిస్టు ఉద్యమం బలంగా ఉన్న ప్రాంతాలలో వందల కోట్ల ఖర్చుతో రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఆ ప్రాంతాలలో గని తవ్వకాలను సుగమం చేయడం కోసము, అందుకోసం పోలీసు బలగాల రాకపోకలకు అనువుగానూ ఈ రోడ్లు నిర్మాణం అవుతున్నాయి. వీటితో పాటుగా గడచిన రెండు సంవత్సరాలలో ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో, ఆయా రాష్ట్రాల సరిహద్దులలో పదుల సంఖ్యలో నూతన క్యాంపులను నెలకొల్పారు. ఈ క్యాంపుల కోసం పోలీసులు ప్రజల సాగు భూములను ఆక్రమించడమే కాకుండా నిత్యం గస్తీ తిరుగుతూ ప్రజల జీవనాధారమైన వ్యవసాయ పనులను అడ్డుకుంటున్నారు. గ్రామాలపై దాడులు చేస్తూ, ప్రజలను అరెస్టు చేస్తున్నారు. గని తవ్వకాలను, పోలీసు క్యాంపులనూ నిలిపివేయాలంటూ పోరాడుతున్న ప్రజలు 2020 చివరి కాలం నుంచి తమ పోరాటాన్ని మరింత తీవ్రతరం చేసారు.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కొండగాం జిల్లా కడియమెట్ట గ్రామంలో 2020 ఫిబ్రవరిలో కేంద్ర అర్ధ సైనిక బలగం ఇండో టిబెటన్ బార్డర్ పోలీస్ (ఐటీబీపీ) క్యాంపు వచ్చింది. ఈ గ్రామం నారాయణపూర్, బీజాపూర్ జిల్లాల మధ్య ఇనుప ఖనిజం కోసం గని తవ్వకాలు ప్రారంభం అవుతున్న ఆమ్‌దాయి, ప్రతిపాదిత తూలాడ కొండలను ఆనుకుని ఉన్న ప్రాంతంలో ఉన్నది. నారాయణపూర్ జిల్లా ఛోటా డోంగర్ నుంచి కడియనార్, కడియమెట్ట, బోదిలి, మాలెం గ్రామాల మీదుగా ఎర్పుండ్ నుంచి బార్సూర్ వరకు రోడ్డు వేయాలన్న పథకం కూడా ప్రభుత్వానికి ఉన్నది. ఈ క్యాంపుల రక్షణలో రోడ్డు నిర్మాణ పనులు సాగిస్తున్నారు. జనవరిలో బోదిలి, ఫిబ్రవరిలో కడియమెట్టలలో వచ్చిన క్యాంపులకు వ్యతిరేకంగా ప్రజలు అనేక రోజులు పోరాటం చేశారు. అయితే ఆ క్యాంపులను ఎత్తివేయలేదు. ప్రజలు అడపా దడపా క్యాంపు వద్దకు వెళ్లి ఖాళీ చేయమంటూ పోలీసులతో ఘర్షణ పడుతూనే ఉన్నారు.

నవంబర్ 12వ తేదీన పోలీసులు కడియమెట్ట గ్రామంపై దాడి చేసి బుద్రు, ఫుల్‌దర్, కొడియాల్ అనే ముగ్గురు యువకులను

---

స్వతంత్రంగానే పనిచేసినా సుదూర ప్రాంతం నుండి వచ్చే వార్తాపత్రిక వారికి వ్యూహాత్మక మార్గదర్శకత్వాన్ని అందించింది. గొప్ప ఫిబ్రవరి విప్లవం బ్రద్ధలైనప్పుడు వివిధ ప్రాంతాల్లో విడివిడిగా పనిచేస్తున్న వారు తమ ప్రయత్నాలను సమన్వయించుకోవడం సాధ్యమైంది. అందువల్లనే ఈ పద్ధతిని ఈరోజు కేవలం షాంఘైలోనే గాక, అన్ని కొమింగ్‌టాంగ్ ప్రాంతాల్లో అనుసరించవచ్చు. ఉన్నత, క్రింది స్థాయి సంస్థల మధ్య కొన్ని ప్రాంతాల్లో సంబంధాలు కొనసాగించగలుగుతున్నప్పటికీ, ఏ సమయంలోనైనా అవి తెగిపోవడానికి గల అవకాశాల్ని విప్లవకారులు విస్మరించరాదు. స్వతంత్రంగా పనిచేయడానికి వారు సిద్ధంగా వుండాలి.

శతృవు ఎంత క్రూరంగా విప్లవకారులను అణచివేసినా, చరిత్ర గమనాన్ని నిరోధిస్తున్న అభివృద్ధి నిరోధకులు విప్లవాన్ని ఎన్నటికీ నిలువరించలేరు. అణచివేతను తీవ్రతరం చేయడం ద్వారా వారు తమ వినాశనాన్ని తప్పించుకోలేరు. ప్రజలకూ, విప్లవకారులకూ సంబంధించినంత వరకు, వారిపై శతృవు అమలుచేసే అధికారిక క్రూరత్వం వారి ద్వేషాన్ని పెంచడానికీ, పోరాటాన్ని కొనసాగించడంలో వారి సంకల్పాన్ని మరింత ధృడతరం చేయటానికి దోహదపడుతుంది. ✶



అరెస్టు చేశారు. ప్రజలు వెంటనే క్యాంపు వద్దకు వెళ్లి తమ గ్రామ యువకులను ఎందుకు తీసుకువచ్చారంటూ నిలదీసారు. వారిని విడిచిపెట్టమని డిమాండ్ చేసారు. ప్రజల డిమండ్ గురించి ఏమీ మాట్లాడకుండా పోలీసులు ప్రజలపై లాఠీఛార్జి చేశారు. ప్రజలు తమ సంప్రదాయ ఆయుధాలైన గొడ్డళ్లు, కర్రలతో తిరగబడ్డారు. క్యాంపు గేటును ధ్వంసం చేసి ఆ యువకుల కోసం లోపలకు వెళ్లారు. దాంతో పోలీసులు అతన్ని వాహనంలో తీసుకుపోయేందుకు విఫల యత్నం చేశారు. ఆ మర్నాడు సమీప గ్రామాల నుంచి మరింత సంఖ్యలో ప్రజలు తిరిగి క్యాంపు వద్దకు వెళ్లారు. ఆ యువకులను తీసుకుపోకుండా వాహనాలకు అడ్డంగా కూర్చున్నారు. కొద్ది రోజుల తరువాత పోలీసులు మోరోడ్ గ్రామంలో నడుస్తున్న జనతన సర్కార్ ఆశ్రమ్ స్కూలుపై దాడి చేశారు. ప్రజలు మరోసారి తమ పిల్లలతో సహా కడియమెట్ట క్యాంపు ముందు ప్రదర్శన చేశారు.

అరవింద్ నేతాం, సోనీ సోడీ వంటి వివిధ పార్టీల రాజకీయ నాయకులు, బేలా భాటియా వంటి సామాజిక కార్యకర్తలూ పోరాడుతున్న ప్రజలను కలిసారు. నెల రోజుల సమయం ఇస్తే క్యాంపులు ఖాళీ చేయడం గురించి ఆలోచిస్తామంటూ ప్రజలకు మాయమాటలు చెప్పిన అధికారులు, కొద్ది రోజులకే ఆమ్‌దాయి మెట్ట మీద కొత్తగా మరో క్యాంపు వేసారు. ప్రభుత్వ మోసాలకు, ప్రజా వ్యతిరేక నాయకుల రాజీలకూ లొంగకుండా ప్రజలు తమ డిమాండ్ల నుంచి ఏ మాత్రం వెనుకకు తగ్గకుండా పోరాడుతున్నారు.

దంతేవాడ జిల్లాలో తరాల్‌మెట్ట గ్రామంలో ప్రతిపాదిత గనులకు రక్షణగా గుమియాపాల్ గ్రామంలో ప్రభుత్వం తలపెట్టిన నూతన పోలీసు క్యాంపుకు నిరసనగా నాలుగు వేల మంది ప్రజలు సెప్టెంబర్ 7వ తేదీన భారీ ర్యాలీ నిర్వహించారు. తమ సంప్రదాయ ఆయుధాలతో తరలి వెళ్లిన ప్రజలు 'తరాల్‌మెట్టను రక్షించండి', 'మాకు పోలీసు క్యాంపు వద్దు, స్కూలు, ఆస్పత్రి కావాలి' అని నినదించారు.

సుకుమా జిల్లాలో సిలింగేర్, కర్రిగూడెం గ్రామాలలో వచ్చిన పోలీసు క్యాంపులకు వ్యతిరేకంగా ప్రజలు పెద్ద సంఖ్యలో పోరాడుతున్నారు. పోలీసులు తమ క్రూరత్వాన్ని మరోసారి నిరూపించుకుంటూ ప్రదర్శన నిర్వహిస్తున్న ప్రజల పైకి జాగిలాలను విడిచారు. ప్రజలు గాయపడుతూ, పోలీసుల వేధింపులను ఎదుర్కొంటూ క్యాంపులకు వ్యతిరేకంగా మిలిటెంటుగా పోరాడుతున్నారు.

అక్టోబర్ 4వ తేదీన నారాయణపూర్ జిల్లాలో ఆకబేడ పోలీసు క్యాంపు వద్ద సుమారు నాలుగున్నర వేల మంది మాడియా గోండ్ ఆదివాసీ ప్రజలు భారీ ప్రదర్శన చేశారు. నాలుగు సంవత్సరాల క్రితం వచ్చిన ఈ క్యాంపుకు అదనంగా ఇప్పుడు అక్కడకు పది కిలోమీటర్ల దూరంలో మూంది గ్రామం వద్ద మరో క్యాంపు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ప్రజలు నవంబర్ 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు సర్వ్ ఆదివాసీ సమాజ్ నాయకత్వంలో ప్రదర్శన నిర్వహించారు. తరాల నాటి తమ సంస్కృతిని ఈ క్యాంపులు ఛిన్నాభిన్నం చేస్తాయంటూ అక్కడ గుమిగూడిన గ్రామ పెద్దలు, ప్రజలు మాట్లాడారు. తమ కళా రూపాలను ప్రదర్శించి, ఆదివాసుల సాంస్కృతిక ఔన్నత్యాన్ని చాటారు. గవర్నర్‌కు విజ్ఞప్తి పత్రం పంపించారు.

అదే విధంగా అక్కడి నుంచి మరో పది కిలోమీటర్ల దూరంలో కుతుల్ వద్ద, అలాగే కచ్చపాల్ ఇరుకుబట్టి మొదలయిన ప్రాంతాలలో పోలీసు క్యాంపులు వేయాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ పది పంచాయితీల ప్రజలు భారీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తమ గ్రామాల నుంచి పారిపోయి పోలీసు శాఖలో చేరి ద్రోహులుగా మారి తమ మీద దాడులు చేస్తున్న వారిని ప్రజలు హెచ్చరిస్తున్నారు. ఈ అన్ని ప్రాంతాలలో వరుసగా సమావేశాలు నిర్వహించారు. రెవెన్యు భూపట్టాలను, భూకబ్జాను నిలిపివేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మాడ్ ప్రాంతంలో 750 చదరపు కిలోమీటర్ల స్థలాన్ని భారత సైన్యానికి అందించాలన్న ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని, కోరోనాను వ్యాప్తి చేస్తున్న పోలీసు గస్తీలను నిలిపి వేయాలనీ డిమాండ్ చేస్తున్నారు. 'అడవిపై హక్కు ఆదివాసులదే'నన్న నినాదంతో మాడ్ స్వయం ప్రతిపత్తి కోసం, తమ మనుగడ, అస్తిత్వాల కోసం ప్రజలు పోరాడుతున్నారు.

ఝార్ఖండ్ రాష్ట్రం గిరిడిహ్ జిల్లా పిర్తండ్ బ్లాక్ పాండేయ్‌డీహ్ గ్రామంలో కేంద్ర రిజర్వు పోలీసు బలగాల 7వ బెటాలియన్ పికెట్‌ను ఏర్పాటు చేశారు. ఉద్యమానికి గుండెకాయగా ఉంటూ ఎందరో వీరులను అందించిన ఈ గ్రామ ప్రజలు ఈ పోలీసు చొరబాటును వ్యతిరేకించారు. అధిక సంఖ్యలో మహిళలతో దాదాపు వెయ్యి మంది ప్రజలు డిసెంబర్ 23వ తేదీన తమ సంప్రదాయ ఆయుధాలతో తరలి వెళ్లారు. ఆ పికెట్‌పై దాడి చేశారు.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లా కోయిల్‌బేడా బ్లాక్‌లో డిసెంబర్ రెండో వారంలో మేండ్‌కీ నదిని ఆనుకుని ఉండే కర్మాఘూట్, తుమిరిఘూట్ వద్ద కొత్తగా సరిహద్దు భద్రతా దళ (బీఎస్ఎఫ్) క్యాంపులు వెలిసాయి. ఈ క్యాంపుల పోలీసులు ప్రజల రాకపోకలను అడ్డుకోవడమే కాకుండా ఆ ప్రాంతాన్ని కలుషితం చేస్తారని, వాటిని తక్షణమే ఖాళీ చేయాలంటూ ప్రజలు డిమాండ్ చేశారు. దూర ప్రాంతాల నుంచి ప్రజలు బియ్యం, గిన్నెలు పట్టుకుని ఈ క్యాంపుల వద్దకు చేరుకున్నారు. అక్కడే వండుకుంటూ తమ ప్రదర్శనను కొనసాగించారు. వారిని మెత్తబరచడానికి పోలీసులు వారికి టీ, బిస్కెట్లు ఇవ్వబోతే ప్రజలు నిరాకరించారు. ఈ ప్రాంతం తమ అమ్మ దేవతైన బంజారిన్ దేవీ పూజా స్థలం అని, ఇటువంటి ప్రదేశంలో క్యాంపు వేయడం తమ సంస్కృతిని, జీవనాన్ని భంగపరచడమేననీ ప్రజలు నినదించారు. అంతేకాకుండా ఈ ప్రాంతం ప్రభుత్వ రాజ్యాంగం ప్రకారం ఐదవ షెడ్యూల్ పరిధిలో ఉన్నదని, గ్రామసభ అనుమతి లేకుండా క్యాంపు వేయడం రాజ్యాంగ విరుద్ధమని కూడా ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రదర్శన నుంచి తిరిగి వెళుతూ ప్రజలు తమ ఇష్ట దేవతకు పూజలు నిర్వహించారు. అయితే పోలీసులు క్యాంపులు ఖాళీ చేయకపోవడంతో ప్రజలు ప్రతాపూర్ గ్రామం వద్దకు వెళ్లి పై స్థాయి అధికారులతో తలపడ్డారు. అక్కడా వారి డిమాండ్లు నెరవేరకపోవడంతో రాజధాని నగరమైన రాయ్‌పూర్‌కు ఒక ప్రతినిధి వర్గాన్ని పంపాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సమూహాల సమాజాలు, యువజన సంఘాలూ పాల్గొన్నాయి.

ఒడిశా రాష్ట్రంలో ప్రారంభమై ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో నుంచి మహారాష్ట్ర సరిహద్దులో గోదావరి నదిలో కలిసే ఇంద్రావతి నదిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ రెండు రాష్ట్రాలలో వివిధ చోట్ల ఆనకట్టలు కట్టారు. నది నీటిని పారిశ్రామిక అవసరాల కోసం మళ్లించారు. ఇప్పుడు ఆ పరిశ్రమల రక్షణ కోసం, వాటికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా ఉద్యమ అణచివేత కోసం పోలీసు బలగాల రాకపోకలను సుగమం చేసేందుకు ఆ నదిపై వంతెన నిర్మాణం ప్రారంభించారు. నదిని ఆనుకుని పోలీసు క్యాంపులను నెలకొల్పసాగారు. బీజాపూర్ జిల్లా భైరంగఢ్ బ్లాక్‌లో ఈ నదిని ఆనుకుని అనేక గ్రామాలలో ఆదివాసులు నివసిస్తున్నారు. సల్వా జుడుం సమయంలో వచ్చిన క్యాంపులకు అదనంగా ఇప్పుడు ఏ కాలంలోనైనా నది దాటి గ్రామాలపై దాడులు చేసేందుకే ప్రభుత్వం ఈ వంతెన నిర్మాణం చేపట్టింది. దాంతో ఈ ప్రాంత ప్రజలు ఇంద్రావతి బచావో ఆందోళన్ సంఘంగా ఏర్పడి వీటికి వ్యతిరేకంగా పోరాటం ఆరంభించారు. ముప్పై వేల మంది ప్రజలు సమీకృతులై భైరంగఢ్ బ్లాక్ ప్రభుత్వ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

ఇదే జిల్లా గంగలూరు వద్ద పూంబడ్ గ్రామానికి 4 కిలోమీటర్ల దూరంలో డిసెంబర్ రెండో వారంలో ఒక క్యాంపు నెలకొల్పారు. విప్లవంలో చురుకైన పాత్ర వహిస్తున్న ఈ గ్రామ ప్రజలు తక్షణమే ఈ క్యాంపుకు వ్యతిరేకంగా పోరాట బాట పట్టారు. పోరాటం ఆరంభమైన మొట్టమొదటి రోజునే పోలీసులు 9 మందిని అరెస్టు చేశారు. వీరిని విడుదల చేయాలంటూ ప్రజలు గంగలూరు పోలీసు స్టేషన్ ముందు బైఠాయించారు. పోలీసు క్యాంపుని వెనక్కి తీసుకోకుండా తాము అంగుళం మేర కూడా ఇక్కడి నుంచి కదలం అంటూ ప్రజలు పట్టుబట్టారు. పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. దాంతో పోలీసులు లాఠీఛార్జి చేశారు. కుక్కలను విడిచిపెట్టారు. ముందు గాలిలోకి, ఆ తరువాత ప్రజలపైకీ కాల్పులు జరిపారు. ఈ దాడిలో 90 మంది గాయపడ్డారు. ఇందులో అధికంగా మహిళలున్నారు. బైలదిల్లా గనుల కోసం ఇనప ఖనిజాన్ని రవాణా చేసేందుకు జరుగుతున్న రోడ్డు నిర్మాణాన్ని కూడా ప్రజలు వ్యతిరేకిస్తున్నారు.

పోలీసు క్యాంపులతో పాటుగా పోలీసుల అరెస్టులను, వేధింపులనూ వ్యతిరేకిస్తూ ప్రజలు పోరాడుతున్నారు. కాంకేర్ జిల్లా



ఛోటా బెటియా పోలీసు క్యాంపు అధికారి ఆ సమీప గ్రామ ప్రజలు మార్కెట్‌కు వెళ్లే మార్గంలో తనిఖీలు నిర్వహిస్తున్నాడు. మేండ్‌కీ నది దాటాలంటే పడవ ఎక్కాలి. పడవ నడిపే వారిని, పడవలో దాటే వారినీ ఈ అధికారి మావోయిస్టుల కోసమే సామాన్లు కొనుగోలు చేస్తున్నారంటూ నిత్యం వేధింపులకు గురి చేస్తున్నాడు. విసిగిపోయిన ప్రజలు అక్టోబరు మొదటి వారంలో ఐక్యంగా వెళ్లి ఆ అధికారిని నిలదీసారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో చివరకు అధికారి దిగి వచ్చి ప్రజలకు క్షమాపణలు చెప్పాడు.

నారాయణపూర్ జిల్లా ఈకినార్ గ్రామంలో పోలీసులు డిసెంబర్ మూడో వారంలో కుమ్మోటి మంగ్తు అనే యువకుడిని అరెస్టు చేసారు. ప్రజలు వెంటనే అతన్ని తీసుకువెళ్లిన ధనోరా పోలీసు క్యాంపు వద్దకు వెళ్లి చుట్టుముట్టేందుకు ప్రయత్నించారు. తాము అతన్ని తీసుకురాలేదని పోలీసులు బుకాయించారు. కానీ ప్రజలు నమ్మలేదు. క్యాంపు లోపలకు కొందరిని పంపారు. అరెస్టయిన వారిని దాచిపెట్టిన పోలీసులపై ప్రజలు విరుచుకుపడ్డారు. ఆ తరువాత సమీప గ్రామాల ప్రజలు మరింత సంఖ్యలో చేరుకోవడంతో పోరాటం తీవ్రతరమయింది. ప్రజలంతా ఛోటా డోంగర్ క్యాంపుకు వెళ్లి నారాయణపూర్ నుంచి ఓర్చా వెళ్లే రోడ్డుపై బైఠాయించారు. ఛోటా డోంగర్ నుంచి డౌల వరకు 8 కిలోమీటర్ల మేర రోడ్డంతా ప్రజలే నిండిపోయారు. పోలీసులు క్యాంపు దగ్గర 200 మీటర్ల దూరంలో ఫెన్సింగ్ తీగలు కట్టి ప్రజలను అడ్డుకున్నారు. 55 కిలోమీటర్ల దూరమున్న నారాయణపూర్-ఓర్చా రోడ్డుపై నాలుగు రోజుల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పాత్రికేయులు వెళ్లి ప్రజల డిమాండ్‌లను తెలుసుకుని పత్రికలలో రాశారు. ప్రభుత్వ, పోలీసు అధికారులు ప్రజలను నమ్మించడానికి ఏం చెప్పినా ప్రజలు తమ పోరాటం విరమించలేదు. చివరకు అధికారులు దిగి వచ్చి ప్రజల డిమాండ్ ప్రకారం అతన్ని విడిచిపెట్టకపోయినా అరెస్టు చేసిన వారిని కోర్టులోనయితే హాజరు పరిచారు.

ఈ పోరాటాలకు కొనసాగింపుగా నారాయణపూర్ జిల్లా ఓర్చాలో ఆ సమీప గ్రామాలలో ప్రతిపాదిత పోలీసు క్యాంపులకు వ్యతిరేకంగా ఐదు వేల మందితో ప్రజలు ర్యాలీ తీసారు. బార్సూర్ సమీపంలో ఇంద్రావతి నదిపై బోధ్‌ఘాట్ వద్ద డ్యాం నిర్మాణానికి వ్యతిరేకంగా కూడా ప్రజలు పోరాడుతున్నారు. జల విద్యుత్కేంద్రం కోసం ప్రతిపాదించిన ఈ డ్యాం వల్ల కొన్ని గ్రామాలు మునిగిపోతాయి, మరి కొన్ని గ్రామాలు ఎండిపోతాయి. ఈ డ్యాం నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రజలు 20 సంవత్సరాల క్రితమే పోరాటం ప్రారంభించారు. ప్రజా పోరాట ఒత్తిడితో ప్రభుత్వం కొంత కాలం పాటు బోధ్‌ఘాట్ డ్యాం పనులను నిలిపివేసింది. సామ్రాజ్యవాదులకు దేశాన్ని అమ్మివేసే బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు కేంద్ర భాజపా ప్రభుత్వ విధానాలలో భాగంగా అనేక ప్రాజెక్టుల మాదిరిగానే ఈ డ్యాం నిర్మాణం కూడా మరోసారి ప్రారంభమయింది.

ప్రజల విస్తృత భాగస్వామ్యంతో జరుగుతున్న ఈ పోరాటాలు మరిన్ని పోరాటాలకు ప్రేరణనిస్తున్నాయి. రాజ్య బలాన్ని నిలదీస్తూ సాగుతున్న ఈ పోరాటాలకు మైదాన, పట్టణ ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, ప్రజా సంఘాలూ మద్దతు అందించడం అవసరం. ✶

# ఏఓబి రిపోర్ట్-2020

## కోవిడ్-19 మహమ్మారిని ఎదుర్కొంటూ ప్రజా సంక్షేమ కార్యక్రమాలు.

కోవిడ్-19 వైరస్, 2019 డిసెంబర్‌లో చైనా దేశంలోని ఊహాన్ ప్రాంతంలో ఉనికిలోకి వచ్చి, 2020 ప్రారంభానికి ప్రపంచంలోని అన్ని దేశాలకు విస్తరించి ప్రకంపనలు సృష్టించింది. ప్రధానంగా పీడిత ప్రజలు కోవిడ్-19 బారిన పడటమే కాకుండా ఉపాధి కోల్పోయి, కనీస అవసరాలు లభించక తీవ్రమైన కష్టాలలో కూరుకుపోయారు.

ఇటువంటి పరిస్థితులలో, ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోవడం ఒక కీలకమైన కర్తవ్యంగా ఏఓబీ పార్టీ భావించింది. ఇందుకనుగుణంగా ఉద్యమ ప్రాంతంలో సైనికచర్యలను ఆపేస్తామనీ, ప్రభుత్వం కూడా తన సాయుధ బలగాలను ఉపసంహరించాలని డిమాండ్ చేసింది. ఒకవేళ ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే పీ.ఎల్.జీ.ఏ తన ప్రతి దాడులను కొనసాగిస్తుందని ప్రకటించింది. అయితే ఆ ప్రకటనకు ఏ.పీ, ఒడిశా ప్రభుత్వాల నుంచి ఎటువంటి ప్రతిస్పందన రాలేదు. అటువంటి పరిస్థితులలో పార్టీ, పీ.ఎల్.జీ.ఏ, ప్రజా నిర్మాణాలు దోపిడీ ప్రభుత్వాల దాడిని ఎదుర్కొంటూ, వాటి ప్రజా వ్యతిరేక నైజాన్ని రాజకీయంగా బహిర్గత పరుస్తూ, 'ప్రజల సంక్షేమానికి' కార్యక్రమాన్ని రూపొందించుకొని పథకం ప్రకారం కృషి చేసాయి.

### మల్కనగిరి-కొరాపుట్ డివిజన్

ఆదివాసీ ప్రాంతాల్లో సంతలపై ఆధారపడి ప్రజలు తమ నిత్యావసరాలను తీర్చుకుంటారనే విషయం తెలిసినదే. అయితే పాలకవర్గాలు ముందుచూపు లేకుండా విధించిన లాక్‌డౌన్ మూలంగా ఆదివాసుల బతుకులు పెనంమీద నుండి పొయ్యిలో పడ్డ విధంగా తయారయ్యాయి. ప్రయాణాలు, సంతలు పూర్తిగా ఆగిపోవడంతో, ప్రజలు ఉప్పు లాంటి కనీస అవసరాలను కూడా తీర్చుకోలేని దుస్థితులకు నెట్టబడ్డారు. ఇలాంటి సంక్లిష్ట సమయంలో ప్రజల కనీస అవసరాలను తీర్చే విధంగా పార్టీ తీవ్రంగా ప్రయత్నం చేసింది. దీంట్లో భాగంగా వివిధ ఛానల్స్ ద్వారా కనీసం 10 టన్నుల ఉప్పును సేకరించి, 200 గ్రామాలకుపైగా ప్రతి కుటుంబానికి 2 కేజీల ఉప్పును పంపిణీ చేసింది. సరైన సమయంలో పార్టీ తీసుకున్న ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో ఒక మంచి పాజిటివ్ ప్రభావాన్ని వేయగలిగాం.

మరోవైపు ఈ సమయంలోనే ప్రజల ఆరోగ్య సమస్యలపై దృష్టి పెట్టి, వాటిని పరిష్కరించే విధంగా కృషి జరిగింది. ఈ ప్రాంతంలో మలేరియా, టైఫాయిడ్, టీ.బీ, డయేరియా, కంటి సమస్యలతోపాటు, రకరకాల చర్మవ్యాధులతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరైన సమయంలో మందులు అందుబాటులో లేక అనేక మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

పై పరిస్థితుల నేపథ్యంలో, కటాఫ్ ఏరియాలో స్థానిక విప్లవ పార్టీ నెల రోజులపాటు 52 గ్రామాలలో మెడికల్ క్యాంపులు నిర్వహించింది. ఈ మెడికల్ క్యాంపులు అమరుడు కామ్రేడ్ అడ్మాల్ పేరుతో జరిగాయి. ఈ క్యాంపుల్లో సుమారు 4వేల మందికి వైద్యం చేశారు. ఈ సందర్భంగా మందులకూ, ఇతర జీవిత అవసరాలకు (ఉప్పు) ప్రజా సంక్షేమ నిధి నుంచి రూ॥ 5,50,000 ఖర్చు అయింది. ఈ మొత్తం క్యాంపెయిన్‌లో గ్రామస్థాయి పార్టీ, ప్రజా నిర్మాణాలు, మిలీషియా ఎంతో చురుగ్గా పాల్గొన్నాయి.

ఒకవైపున ప్రజల కష్టాలనూ, ఇబ్బందులను పట్టించుకుంటూ విప్లవ పార్టీ కార్యక్రమాలను చేపడుతుంటే, ఒడిశాలో నవీన్ ప్రభుత్వం మాత్రం మావోయిస్టుల వల్లనే గ్రామాల్లో కొరోనా వ్యాప్తి చెందుతున్నదని దుష్ప్రచారాన్ని కొనసాగిస్తూ, తీవ్రమైన నిర్బంధాన్ని అమలు చేసింది. శత్రు దాడులను ఎదుర్కొంటూ, ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోవడం వల్ల విశాల ప్రజానీకంలో కార్యక్రమం మంచి ప్రభావాన్ని వేసింది. అంతేకాదు, ప్రజలు ప్రభుత్వ రాజకీయ స్వభావాన్ని మరింత లోతుగా తెలుసుకున్నారు.

### విశాఖ-ఈస్ట్ డివిజన్

కరోనాపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వైరస్ వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పోస్టర్స్ వేయడం జరిగింది. పెదబయలు-కోరుకొండ పరిధిలో విప్లవ ప్రజాసంఘాల, ప్రజా కమిటీల నుండి నాయకత్వం, మరికొంత మంది సభ్యులు కలిసి మొత్తం 10 క్యాంపెయిన్ టీమ్స్‌గా ఏర్పడినాయి. కరోనాపై వేసిన కరపత్రాన్ని ఒక్కోటీం ప్రతీ గ్రామానికి వెళ్ళి చదివి అర్థం చేయించాయి. దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి చెప్పడంతో పాటు, అనారోగ్యంతో వున్నవారికి వైద్యాన్ని కూడా అందించాయి. ఈ సందర్భంగా లక్ష రూపాయల విలువైన మందులను కూడా తెప్పించి, ప్రజలకు అందజేశాయి. ఈ క్యాంపెయిన్ 10 రోజులపాటు జరిగింది.

రెండు డివిజన్స్‌లో చేపట్టిన ఈ క్యాంపెయిన్ ద్వారా దోపిడీ ప్రభుత్వాలను రాజకీయంగా ఎండగట్టగలిగాము. విప్లవ పార్టీ ప్రజలలోకి విస్తృతంగా వెళ్ళగలిగింది. వారి ప్రేమను చూరగొంది. ఈ సందర్భంగా కొన్ని కొత్త గ్రామాల నుంచి ప్రజలు పరిచయాల్లోకి వచ్చారు. ప్రజలు విపత్తులకు గురైనప్పుడు వారి సంక్షేమమే ప్రధాన కార్యక్రమంగా పార్టీ చేపడుతుందనే సందేశం ప్రజలకు చేరింది.

## విజయవంతమైన మార్చ్ 8 విశ్వ శ్రామిక మహిళా దినం

అంతర్జాతీయ శ్రామిక మహిళా దినాన్ని ఎమ్.కె.బి, విశాఖ-ఈస్ట్ డివిజన్‌లలో జరుపుకున్నారు. పాలక ప్రభుత్వాలు నిర్వహిస్తున్న దానికి భిన్నంగా పోరాటస్ఫూర్తితో జరిగింది.

2020 మార్చి 8ని మహిళలపై కొనసాగిన రాజ్యహింసకు వ్యతిరేకంగానూ, స్థానిక తెగ వ్యవస్థలో కొనసాగుతున్న పితృస్వామ్యానికి వ్యతిరేక క్యాంపెయిన్‌గా నిర్వహించారు.

అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినమైన మార్చి 8ని విజయవంతం చేయాల్సిందిగా, బ్రాహ్మణీయ హిందూ ఫాసిజం, రాజ్యం మహిళలపై అమలు జరుపుతున్న అమానవీయ హింస, అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడాల్సిందిగా విస్తృతంగా ప్రచారం జరిగింది. పెదబయలు-కోరుకొండ పరిధిలో సువ్వపల్లి పాకెట్‌లోని 7 గ్రామాలకు చెందిన 300 మంది సభను జరిగింది. ఆదివాసీ విప్లవ మహిళా సంఘాలలో మహిళలు మరింతగా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. ఈసభ అనంతరం ఎ.వి.ఎమ్.ఎస్ ప్రణాళిక -నిబంధనావళి, కర్తవ్యాల పై ఒకరోజు క్లాసు జరిగింది.

కోంద్రు పాకెట్‌లో మార్చి 8 సభను నిర్బంధం కారణంగా జరగలేదు. అయితే మార్చి 15న ఆ పాకెట్‌లోని ఎ.వి.ఎమ్.ఎస్ కార్యకర్తలకు ప్రణాళిక, నిబంధనావళి, కర్తవ్యాలను క్లాసు చెప్పారు. తదుపరి 15 మంది మహిళలు కలిసి క్యాంపెయిన్ టీంగా ఏర్పడి మార్చి 8 స్ఫూర్తితో ఆ పాకెట్‌లోని గ్రామాలలో మహిళా సంఘాల సమావేశాలు వేసి, మార్చి 8 ప్రాధాన్యతను వివరించారు. తెగలోని పితృస్వామ్య భావజాలంతో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించారు. అలాగే ఆ పాకెట్‌లోని 3గ్రామాల్లో భార్యాభర్తల మధ్య వచ్చిన పురుషాధిపత్య సమస్యలను కూడా ఈ క్యాంపెయిన్ టీం పరిష్కరించింది.

ఈ సభలకి ముందు అన్నిచోట్ల భారీ ఊరేగింపులు నిర్వహించారు. 'మహిళలేని విప్లవం గెలువలేదు', 'మహిళా విముక్తి కోసం పి.ఎల్.జి.ఎలో చేరండి', 'రాజ్య నిర్బంధానికి వ్యతిరేరంగా పోరాడండి', 'బహుభార్యత్వం, బాల్యవివాహాలను వ్యతిరేకించండి', 'గ్రామాలపై పోలీసు దాడులను వ్యతిరేకించండి', 'మహిళలు అన్ని విప్లవ నిర్మాణాల్లో చేరాలి' అని నినాదాలు చేసారు.

## మల్కనగిరి-కోరాపుట్ బోర్డర్ డివిజన్

ప్రజా నిర్మాణాలు, మిలీషియా మద్దతుతో 15రోజుల పాటు మార్చి8 కార్యక్రమ ప్రచారం ఒడియా, తెలుగు భాషలలో కరపత్రాలు, పోస్టర్లు, బ్యానర్ల ద్వారా జరిగింది. ముఖ్యమైన సెంటర్‌లలో, సంతలలో ప్రచార కార్యక్రమాలు ముమ్మరంగా జరిగాయి. కటాఫ్ ఏరియాలోని మూడుచోట్ల బి.ఎస్.ఎఫ్ క్యాంపులు నిర్మించినప్పటికీ, ప్రజలు ధైర్యంగా సభలను జరుపుకున్నారు. 4 క్యాంపెయిన్ టీంలు 7 పాకెట్‌లలో 70 గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. 5 చోట్ల బహిరంగ సభలు నిర్వహించారు. జొంత్రి పాకెట్‌లోని జొంత్రి గ్రామంలో అమ్లిబేద, తాబేరు, జొంత్రి గ్రామాలకు చెందిన దాదాపు 1,850 మంది ప్రజలు హాజరు కాగా, మరో 200 మంది నది దాటలేక ఆగిపోయారు. అంద్రపల్లి పాకెట్‌లో దాదాపు 200 మంది, పనసపుట్ పాకెట్‌లో 250 మంది, ముకుడుపల్లి పాకెట్‌లో 260 మంది, కోసంపుట్ పాకెట్‌లో కాల్‌గూడ, కోసంపుట్ గ్రామాలకు చెందిన ప్రజలు దాదాపు 300 మంది హాజరయ్యారు. మహిళలపై అమలవుతున్న రాజ్యహింసనూ, మహిళలకు వ్యతిరేకంగా ఉన్న తెగ సాంప్రదాయాలనూ, భూస్వామ్య, సామ్రాజ్యవాద విష సంస్కృతిని వ్యతిరేకిస్తూ ఈ సభలలో తీర్మానించారు.

## రాజ్యాధికార లక్ష్యంతో పురోగమిస్తున్న వ్యవసాయ విప్లవ కార్యక్రమం

'దున్నేవారికే భూమి-విప్లవ ప్రజాకమిటీలకే అధికారం' అనే వ్యవసాయక విప్లవ నినాదంతో విప్లవ రైతు కూలీ సంఘాలు గ్రామాలలో వర్గ విశ్లేషణ జరిపి ఆదివాసీ, ఆదివాసేతర భూస్వాములు, కొంత మంది తెగపెద్దలు ప్రజల నుంచి అక్రమంగా స్వాధీనం చేసుకున్న భూములను వ్యవసాయ కూలీ, పేద రైతాంగానికి పంపిణీ చేస్తున్నాయి. అలాగే సాగుభూమి తక్కువగా వున్న గ్రామాలలో భూమి చదును కార్యక్రమాన్ని చేపడుతున్నాయి. వ్యవసాయ యోగ్యం కాని బీడుభూములను సైతం సాగులోకి తేవడానికి చెరువుల నిర్మాణం చేపట్టాయి. విశాఖ-ఈస్ట్ డివిజన్ పరిధిలోని కోరుకొండ ఏరియా, చింతలదూళి గ్రామంలో గ్రామ మునసబు గతంలో ప్రజల నుంచి ఆక్రమించిన సుమారు 10 ఎకరాల భూమిని, అదే గ్రామంలోని భూమిలేని 5 వ్యవసాయ కూలీ కుటుంబాలకు విప్లవ రైతుకూలీ సంఘం నాయకత్వంలో పంపిణీ చేసారు. ఇదే ఏరియాలో సువ్వపల్లి గ్రామ మునసబు తన రాజకీయ ఆధిపత్యాన్ని ఉపయోగించుకొని, ప్రజల నుంచి ఆక్రమించిన భూములు, అటవీ భూములను విప్లవ ప్రజా కమిటీ నాయకత్వంలో విచారణ జరిపి, అదనంగా ఉన్న 8 ఎకరాల భూమిని తిరిగి స్వాధీన పరుచుకొని, కొక్కులగడ్డ, సువ్వపల్లి గ్రామాలలోని భూమిలేని ప్రజలకు పంపిణీ చేసాయి. అలాగే గతంలో ఇదే మునసబు నుంచి స్వాధీనం చేసుకున్న చెరువు పూడికను తీసి గ్రామ ప్రజలు సమష్టిగా చేపల పెంపకానికీ, వ్యవసాయ సాగుకూ, ఎండకాలం పశువుల త్రాగునీటికి ఉపయోగించుకుంటున్నారు. కిష్టారం గ్రామ మాజీ సంఘ నాయకుడు, ప్రజా వ్యతిరేకి, విప్లవ ద్రోహి మల్లేశం 2 సంవత్సరాల క్రితం గ్రామం వదిలి కుటుంబంతో సహా పారిపోయి, శతృవు ఏజెంటుగా పని చేస్తున్నాడు. గ్రామంలో మల్లేశానికి ఒక ఇల్లు, పసుపు దొడ్డి, కాఫీ ప్లాంటేషన్, మరికొంత గరువు ఉంది. ఈ ఆస్తులను ఆర్‌పీసీ ప్రజలకు పంపిణీ చేసింది. ఈతలపాడు

గ్రామంలో సాగుయోగ్యం లేక నిరుపయోగంగా ఉన్న బీడు భూమిని, సంఘం నాయకత్వంలో గ్రామ ప్రజలందరు సమిష్టిగా నెలరోజులు పని చేసి, భూమిని చదునుచేసి, నీటి సౌకర్యం కల్పించి, పొలాన్ని సాగు చేసే విధంగా తయారు చేసారు. మొదటి 2 సంవత్సరాలు సమిష్టిగా సాగుచేసి, పండిన వరిపంటను సమానంగా పంపిణీ చేసుకున్నారు. సుమారు 10 ఎకరాలు ఉన్న ఈ భూమిని గ్రామంలోని 17 కుటుంబాలకు ఆర్‌పీసీ పంపిణీ చేసింది.

పెదబయలు ఏరియాలోని కోంద్రు, ఇంజరి గ్రామాలలో విప్లవ ప్రజా కమిటీ నాయకత్వంలో సుమారు 6 గ్రామాల ప్రజల సమష్టి భాగస్వామ్యంతో 20 రోజులు పని చేసి, 2 చెరువులను పోసుకున్నారు. ఇంజరి పంచాయితీ కోంద్రు, ఇంజెరి గ్రామాలలో ప్రజలంతా నెల రోజులపాటు శ్రమ చేసి చెరువు పోసుకున్నారు. ఈ చెరువులు చేపలు పెంచటానికీ, పోలాలు సాగు చేయడానికి కూడా ఉపయోగపడతాయి.



## వ్యవసాయక విప్లవ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు

రాళ్ళగడ్డ పాకెట్‌లో రాళ్ళగడ్డ గ్రామంలో ప్రజలు సమష్టి శ్రమ ద్వారా చెరువును తవ్వుకున్నారు. సువ్వపల్లి గ్రామంలో గతంలో తీసిన చెరువులో 3 రోజులు సమష్టిగా శ్రమ చేసి పూడిక తీసారు. రాళ్ళగడ్డ పాకెట్‌లో గత సంవత్సరం ప్రజల త్రాగునీటి సమస్యను పరిష్కరించుకునేందుకు ఈతలపాడు, చీకటిపల్లి, కొక్కులగడ్డ, గాజులమామిడి గ్రామాల్లో కొండల నుంచి నీటిని పైపుల ద్వారా తెచ్చి గ్రామాల్లో కొళాయిలకూ చుట్టూ సిమెంట్‌తో గచ్చులు వేశారు. రాళ్ళగడ్డ పాకెట్‌లో ప్రజల సంక్షేమ నిధితో ఒక ధాన్యం మిల్లుని తీసుకువచ్చారు. ఈ మిల్లు రావటంతో చుట్టుపక్కల 3, 4 గ్రామాల ప్రజలు ముఖ్యంగా మహిళలు చాలా సంతోషించారు. మహిళల పని భారాన్ని తగ్గించేందుకు మంచినీళ్ళ పైపులు వేయడం, ధాన్యం మిల్లులు ఏర్పర్చడం వలన మహిళలు కొంత మేరకు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెసులుబాటు కలిగింది.

మల్కనగిరి-కోరాపుట్ బోర్డర్ డివిజన్‌లోని కటాఫ్ ఏరియా, గురుశెట్టి గ్రామంలో సుండి (ఆదివాసేతర) భూస్వాముల నుంచి గతంలో సుమారు 300 ఎకరాల భూములను పార్టీ నాయకత్వంలో ప్రజలు స్వాధీనం చేసుకున్నారు. విప్లవ రైతుకూలీ సంఘం చేసిన వర్గ పరిశోధనపై ఆధారపడి ప్రజల అభిప్రాయాలనూ, ఆమోదాన్ని తీసుకొని, భూమి కలిగి ఉన్న 30 కుటుంబాల భూములను తీసుకొని, గతంలో భూమి లభించని 30 కుటుంబాలకు పునఃపంపిణీ చేసారు. ప్రస్తుతం ఈ భూములన్నీ సాగులోకి వచ్చాయి.

## విప్లవ ప్రతీఘాతుక ఇంటలిజెన్స్‌కు వ్యతిరేకంగా చేపట్టిన కార్యకలాపాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విప్లవోద్యమాన్ని నిర్మూలించేందుకు సమాచార యంత్రాంగాన్ని (ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్) బలోపేతం చేయడాన్ని ఒక వ్యూహాత్మక కర్తవ్యంగా చేపట్టాయి. శత్రువు అనేక కుట్ర పద్ధతులు అనుసరిస్తూ, పార్టీకీ, పి.ఎల్.జి.ఎకీ, ప్రజా నిర్మాణాలకు అనేక నష్టాలు కల్గిస్తున్నాడు. విప్లవోద్యమ పురోగమనాన్ని అడ్డుకుంటున్నాడు. వాటిని వ్యతిరేకిస్తూ పార్టీ కార్యక్రమాలు చేపట్టింది.

### *విప్లవ ప్రతీఘాతుక ఇంటలిజెన్స్‌ను దెబ్బతీయడంపై చర్యలు*

రెండు డివిజన్‌లలో ముందునుంచే, శత్రు నెట్‌వర్క్‌కు భౌతిక పునాదిగా ఉన్న శక్తులను నియంత్రిస్తూ వచ్చారు. ముఖ్యంగా వర్గ శతృవులను అణచివేయడం, మత సంస్థలనూ, స్వచ్ఛంద సంస్థలను కట్టడి చేయడం, లుంపెన్ యువతను రాజకీయంగా తీర్చిమలుచు కొనేందుకు యువజన సంఘాలలోకి సమీకరించడం వంటి

రకరకాల పద్ధతులు అనుసరించారు. అలాగే పార్టీ, ప్రజా నిర్మాణాలు, మిలీషియాలలోని ముఖ్యులను బహిరంగ, చట్టబద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండేలా, రహస్య, సమరశీల కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొనేలా వారి పనిశైలిలో మార్పు తెచ్చేందుకు ప్రయత్నించారు. ప్రజలలో విప్లవ ప్రతీఘాతుకులను, ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను నియంత్రించాల్సిన అవసరం గురించి ప్రచారం చేసారు. అయినప్పటికీ విప్లవోద్యమం ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్ సమస్యను నిరంతరం ఎదుర్కొంటూనే ఉంది.

పై కృషి నేపథ్యంలో ప్రజల నుంచి ఇన్‌ఫార్మర్ల సమాచారం పార్టీకి అందుతున్నది. ఇలా వచ్చిన ప్రాథమిక సమాచారాన్ని మరింత లోతుగా తెలుసుకొని సంబంధిత వ్యక్తులను ప్రజాకోర్టులో విచారిస్తున్నారు. ఇన్‌ఫార్మర్లుగా తేలిన వారిని వాళ్ళ తప్పులను దృష్టిలో ఉంచుకొని ప్రజల సమక్షంలోనే శిక్షలు వేస్తున్నారు. సాధ్యమైన మేరకు ఇన్‌ఫార్మర్ల ప్రవర్తనలోనూ, వైఖరిలోను మార్పు తెచ్చేందుకు కృషి చేస్తూ, వారిపై ప్రజల పర్యవేక్షణ ఉండేలా తీర్పులు ఇస్తున్నారు.

పై పరిస్థితుల్లో ప్రజా ఇంటలిజెన్స్‌పై ఆధారపడి, జనవరి 2020 నుంచి జూన్ వరకు మల్కనగిరి-కోరాపుట్ బోర్డర్ డివిజన్, విశాఖ-ఈస్ట్ డివిజన్‌లలో కొంతమంది ఇన్‌ఫార్మర్‌లను శిక్షించారు. దీనితోశత్రు నెట్‌వర్క్ కార్యకలాపాలను కొంతమేరకు స్థంభించాయి. ఈ అనుకూలతను వినియోగించుకొని అన్ని ప్రాంతాలలో విప్లవ కార్యక్రమాలు కొనసాగాయి.

### మల్కనగిరి, కోరాపుట్ బోర్డర్ డివిజన్

1. మల్కనగిరి జిల్లా, కటాఫ్ ఏరియా జొంత్రి పంచాయితీలోని తాబేరు, అర్లంగిపాడు గ్రామాలకు చెందిన సాధు, లచ్చ, బుట్టి, నీలలు ఎ.పి ఎస్.ఐ.బి గైడెన్స్‌లో ఇన్‌ఫార్మర్స్‌గా పని చేస్తూ వచ్చారు. ఇక్కడ ప్రజలిచ్చిన తీర్పునను సరించి అర్లంగిపాడు సాధు, తాబేరు లచ్చలకు మరణశిక్ష విధించారు. అర్లంగిపాడు బుట్టి, తాబేరు నీలలను హెచ్చరించి వదిలారు. మల్కనగిరి జిల్లా, కొయ్యురుపుట్ బ్లాక్, ఒండ్రాల్ పంచాయితీలోని, కాల్‌గూడ గ్రామంలో సోనియా అనేవాడు ఇన్‌ఫార్మర్‌గా తయారయ్యాడు. ప్రజాసభలో అతడి కార్యకలాపాలన్నింటిని బహిర్గతపరిచి, ప్రజల నిర్ణయం మేరకు దేహశుద్ధి చేసి, దానిని చివరి అవకాశంగా గుర్తించాలని చెప్పి వదిలారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ముంచంగిపుట్ మండలం, రంగబయలు పంచాయితీలోని, జోడిగుమ్మ గ్రామంలో రతన్, సర్విలు ఎ.పి ఎస్.ఐ.బి లింక్‌లోకి వెళ్ళారు. ప్రజలు చేసిన హెచ్చరికతో రతన్ తిరిగి వచ్చి తన తప్పులన్నింటిని ప్రజల సమక్షంలో ఒప్పుకొని గ్రామంలో ఉండేందుకు సిద్ధపడ్డాడు. ప్రజలు రతన్‌పై కొన్ని ఆంక్షలు పెట్టి, గ్రామంలో ఉండేందుకు ఆమోదించారు. సర్వి మాత్రం పోలీసులతోనే ఉండిపోయాడు. మల్కనగిరి జిల్లా, గుమ్మ ఏరియా పరిధిలోని, ట్రైమల్ గ్రామంలో సుక్కు, లైకోన్‌లు దాదాపుగా 2 సంవత్సరాల నుంచి శత్రు నెట్‌వర్క్‌లో ఉంటూ, తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. సుక్కు తప్పించుకోగా, లైకోన్ దొరికాడు. లైకోన్ తన తప్పులన్నింటిని ఒప్పుకొని, ఒక్కసారికి క్షమాబిక్ష పెట్టమని కోరగా, వాడిని ప్రజల ఆమోదంతో వదిలివేయడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ముంచంగిపుట్ మండలం, లక్ష్మీపూర్ పంచాయితీలోని, గరం గ్రామంలో జగబందు, సునోదార్ అనే ఇరువురు అన్నదమ్ములు గ్రామం వదిలివెళ్ళి, పోలీసులతో కలిసి ప్రజలపైనా, సంఘంపైన కత్తిగట్టారు. వీరిని పట్టుకున్నపుడు జగబందు తప్పించుకోగా, సునోదార్ దొరికాడు. వీడిని ప్రజలలో విచారించగా, తప్పులు ఒప్పుకున్నాడు. ప్రజల ఆమోదం మేరకు కొన్ని ఆంక్షలు పెట్టి, గ్రామంలో బ్రతికేందుకు అవకాశం ఇచ్చారు. ఒడిశా రాష్ట్రం, బైఫర్‌గూడ బ్లాక్, బాల్కొండ గ్రామానికి చెందిన క్రిష్ణ గతంలో సంఘంలో పని చేసి, శతృవుకు లొంగిపోయాడు. ప్రజలు ఇతడికి దేహశుద్ధి చేసి, బుద్ధి మార్చుకోమని చెప్పి వదిలివేసారు.

## పోలీసు దాడులకు వ్యతిరేకంగా కదులుతున్న విప్లవ ప్రజానీకం

## ఎమ్.కె.బి డివిజన్‌లో సిమిలిపాదూర్ గ్రామసంఘం నాయకత్వం అరెస్టుకు నిరసన

సిమిలిపాదూర్ సంఘ నాయకత్వాన్ని పోలీసులు మాటుకాసి పట్టుకొని, తీవ్ర చిత్రహింసలకు గురి చేసి, తమ వెంట పట్టుకెళ్ళారు. ఈ విషయం తెలిసిన సిమిలిపాదూర్, బియ్యన్‌కుడి, కొజ్జరగూడ, ముక్కుదుపల్లి, సిందిపుట్ తదితర గ్రామాలకు చెందిన 10 వేల మంది ప్రజలు రకరకాల పద్ధతుల్లో తమ నిరసన తెలియజేసారు. పోలీసు క్యాంపులు ఎత్తివేయాలనీ, అక్రమ అరెస్టులను నిలిపివేయాలనీ, గ్రామాలపై పోలీసుల దాడులను ఆపివేయాలని డిమాండ్ చేసారు. పోలీసులు చేస్తున్న అరాచకాలను పత్రికా విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి ఎండగట్టారు. ఈ సందర్భంగా పోలీసులు ఇచ్చిన రకరకాల వస్తువులను విలేకర్ల ముందే తగులబెట్టారు.

### విశాఖ-ఈస్ట్ డివిజన్‌లో

2020 జనవరి 19 నుండి 26 వరకూ పెదబయలు-కోరుకొండ ప్రాంతంలో పోలీసులు ఏరియా డామినేషన్ తీసుకున్నారు. ఈ సందర్భంగా 20వ తేదీ ఉదయం నీరుమామిడి అనే గ్రామంలో ఒక ఫంక్షన్ కోసం అవసరమైన వంట పాత్రలను

తెచ్చుకోవడానికి నలుగురు గ్రామస్తులు సింగవరం అనే గ్రామానికి వెళ్ళి వంటపాత్రలను తీసుకొని తిరిగి వస్తుండగా దారిలో వున్న ఒక పోలీసు బ్యాచ్ వీరిని పట్టుకున్నది. మావోయిస్టుల కోసమే వంట పాత్రలు తీసుకువెళుతున్నారని వారిని పక్కకు తీసుకుపోయి ఇంటరాగేషన్ చేయడం మొదలుపెట్టారు. ఈ లోపు వంట పాత్రలకు వెళ్ళినవారు ఎంతకూ తిరిగి రాకపోవడం, చుట్టుపక్కల పోలీసు బ్యాచ్‌లు కూడా వచ్చిన విషయం అర్థమయిన నీరుమామిడి ప్రజలు ఫంక్షన్‌ను ఆపుకుని, ఫంక్షన్‌కు వచ్చిన వారినీ, పక్కనే ఉన్న దగుడుపల్లి గ్రామ ప్రజలను కలుపుకొని తమ వారికోసం కొండలన్నీ వెతకడం మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే వీరికి తమ పక్క గ్రామమైన గజ్జెడి గ్రామంలో వంటలు చేసుకుంటున్న ఒక పోలీసు బ్యాచ్ తారసపడింది. తమ వారిని ఎక్కడ పెట్టారో చెప్పాలనీ ఆ బ్యాచ్‌తో ప్రజలందరూ ఘర్షణకు దిగారు. పోలీసుల వంట ఏర్పాట్లను, వంట పాత్రలను చెల్లాచెదురుగా పడవేశారు. వంటలు చేసుకోనీయకుండా అడ్డుకున్నారు. ముఖ్యంగా మహిళలు గొడ్లను కట్టే తాళ్ళతో నలుగురు పోలీసులను కట్టివేయటానికి తీవ్రంగా ప్రయత్నించారు. ఈ ఘర్షణలో మహిళల గాజులు పగిలి పోలీసుల చేతులకు గాయాలయ్యాయి. పోలీసులు మహిళలను గట్టిగా నెట్టడానికి ప్రయత్నిస్తే పురుషులు కర్రలతో పోలీసులపై దాడికి దిగారు. తమవారు నలుగురిని విడిచిపెడితేనే మిమ్మల్ని విడిచిపెడతామని ఆ బ్యాచ్‌ను ఎక్కడికీ కదలనీయకుండా చుట్టూ కూర్చున్నారు. ఈ ఘర్షణ ఉదయం 10 గం॥ నుండి సాయంత్రం 5గం॥ల వరకు జరిగింది. ప్రజలు ఆకలితో, ఆగ్రహావేశాలతో పోలీసులను కూడా పచ్చి మంచినీళ్లయినా ముట్టనీయలేదు. చివరకు పోలీసులు ఫోన్లద్వారా ఈ విషయాన్ని తెలియజేసుకొని గ్రామస్తులను విడిచిపెట్టిన తర్వాతనే ప్రజలు తమ వారిని తీసుకొని పోలీసులను వదిలిపెట్టారు.

2020 మార్చి 8వ తేదీ మధ్యాహ్నం 3గం॥ల సమయానికి కోంద్రు గ్రామానికి చెందిన నలుగురు సెల్ టవర్ సిగ్నల్ పాయింట్ దగ్గరకు ఫోన్ చేయడం కోసం వెళ్ళారు. వీరిని గమనించిన పోలీసులు పట్టుకోవటానికి దగ్గరకు వెళ్లటంలో ఆ నలుగురిలో ఒకరైన మిలీషియా కమాండర్ వేగంగా పరుగెత్తి తప్పించుకుని వెళ్ళిపోగలిగాడు. మిగతా ముగ్గురిని పోలీసులు పట్టుకుని వారి ఆధార్‌కార్డు వగైరాలు చెకింగ్ చేసి, ఇద్దరిని విడిచిపెట్టారు. అయితే తప్పించుకున్న మిలీషియా కమాండర్ తాలూకు ఫోన్‌ను పట్టుకుని ఉన్న లక్ష్మణ్ అనే యువకుడిని మాత్రం వదిలిపెట్టకుండా తమతో తీసుకుని వెళ్ళిపోయారు. తప్పించుకున్న వారి ద్వారా సమాచారం తెలుసుకున్న కోంద్రు, నానాబరి గ్రామాల ప్రజలంతా కత్తులు, గొడ్డళ్ళతో కేకలు వేసుకుంటూ బిడింగ్‌ల మీదకు ఎక్కి పోలీసుల కోసం వెతకడం మొదలుపెట్టారు. అప్పటికే లక్ష్మణ్‌ను దూదిపల్లి అనే గ్రామ పరిసరాలలో పెట్టి ఇంటరాగేషన్ చేస్తున్న పోలీసులకు తమ చుట్టు ఉన్న అన్ని కొండల నుండీ జనం కేకలు, అరుపులతో రావడం కనిపించింది. అంతలోనే లక్ష్మణ్ తండ్రి కూడా పెద్ద గొడ్డలి పట్టుకుని “నా కొడుకుని ఎందుకు తెచ్చారు? మీకు తుపాకీ ఉంటే నాకు గొడ్డలి ఉంది” అంటూ ఎత్తడంతో పాటు చుట్టుపక్కల నుండి జనాలు కూడా దగ్గరకు రావడంతో పోలీసులు లక్ష్మణ్‌ను వదిలిపెట్టి పరుగు లంకించుకున్నారు. దమ్ముంటే ఆగండిరా అని ప్రజలు కొంత దూరం వెంటబడ్డారు. అప్పటికే చీకటి కావడంతో లక్ష్మణ్‌ను తీసుకుని ప్రజలు వెనుదిరిగారు. అయితే పోలీసులు తీసుకుపోయిన ఫోన్ కోసం మళ్ళీ మరుసటి రోజు కూడా ఎక్కడ పోలీసు బ్యాచ్ కనబడినా ఘర్షణకు దిగి, ఆ ఫోన్‌ను లాక్కోవాలనే ఆలోచనలో కోంద్రు పాకెట్‌లోని 5 గ్రామాల ప్రజలు కొండలన్నీ వెతికినప్పటికీ పోలీసు బ్యాచ్‌లు ఎక్కడా కనబడకపోవడంతో వెనక్కువచ్చారు. ఈ రెండు సందర్భాల్లో తమ వాళ్ళను విడిపించుకోవటానికి పోలీసులతో ప్రజలు ఘర్షణ పడటం, ప్రతిఘటించి విడిపించుకోవడం మిగతా గ్రామాల ప్రజలలో కూడా మంచి ప్రభావాన్ని, నైతిక స్థైర్యాన్ని పెంచాయి.

## విశాఖ-ఈస్ట్ డివిజన్‌లో

1. విశాఖ జిల్లా, జిమాడుగుల మండలం, కిల్లంకోట పంచాయితీ, అగ్రంపాడు గ్రామానికి చెందిన తాబేలు కోటేష్‌ను, 2. మల్కనగిరి జిల్లా, చిత్రకొండ బ్లాక్, రాళ్లగడ్డ పంచాయితీ, చింతలధూళి గ్రామానికి చెందిన కొర్రసాలు అనే గ్రామం మునసబును, 3. విశాఖ జిల్లా, జిమాడుగుల మండలం, కిల్లంకోట పంచాయితీ, చింతగుప్ప గ్రామానికి చెందిన గెమ్మెల సుబ్బారావును, 4. మల్కనగిరి జిల్లా, చిత్రకొండ మండలం, రాళ్ళగడ్డ పంచాయితీ, కొక్కులగూడ గ్రామానికి చెందిన కొర్ర ప్రవీన్‌ను, 5. మల్కనగిరి జిల్లా, చిత్రకొండ మండలం, రాళ్ళగడ్డ గ్రామానికి చెందిన కొర్ర గంగినాయుడు, ఆనందరావులను, 6. విశాఖ జిల్లా, పెదబయలు మండలం, ఇంజరి పంచాయితీ, నానాబరి గ్రామానికి చెందిన వంతల సుత్తిలను ప్రజాకోర్టులలో విచారించి సంవత్సరకాలం పాటు ఎక్కడికి వెళ్ళకూడదని కండీషన్ పెట్టారు. అదేవిధంగా 7. విశాఖ జిల్లా, జిమాడుగుల మండలం, కిల్లంకోట పంచాయితీ తరతల గ్రామానికి చెందిన వంతల సత్తిబాబు గ్రామంలోని మునసబు. గతంలో ఇతడి భూమి పంపకం కూడా జరిగింది. అలాగే ఇతడి తమ్ముడు విజయ్, చెల్లి లలిత దళంలో పని చేసి సరెండర్ అయి శత్రువు దగ్గరే ఉంటున్నారు. సత్తి బాబు కొడుకు రాజు శత్రువు దగ్గరుంటున్నాడు. పంచాయితీ నిర్వహించి, కుటుంబ సభ్యులందరి గురించి వివరంగా అన్ని విషయాలు రాబట్టి, సత్తిబాబు కుటుంబంపై కొన్ని షరతులు విధించి గ్రామం నుంచి ఎటు వెళ్ళకూడదని హెచ్చరించారు. ఇలా జరిగిన ప్రజాకోర్టులకు ప్రజారాజ్య కమిటీల పరిధిలోని గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరైనారు.

## మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలపై ప్రజా కోర్టులు

మల్కనగిరి జిల్లా, గుమ్మ ప్రాంతంలో, అంద్రపల్లి పంచాయితీ,

గుసొంపొదూర్ గ్రామంలో కన్న కూతురుపై తండ్రి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం బయటకి చెబితే చంపుతానని కూతురిని బెదిరించాడు. తన కుటుంబ సభ్యులు చెప్పినప్పటికీ అతడు వినిపించుకోలేదు. తప్పు చేసిన తండ్రికి ప్రజాపంచాయితీ నిర్వహించి దేహశుద్ధి చేసి, కుటుంబ సభ్యుల అభిప్రాయంతో వేరే గ్రామానికి చెందిన యువకుడికి ఆ అమ్మాయిని యిచ్చి పెళ్ళి చేయాలని నిర్ణయించారు. ఈ పంచాయితీకి 270 మంది ప్రజలు హాజరయ్యారు.

విశాఖ జిల్లా, కుమడ పంచాయితీ, కిముడుపుట్ గ్రామంలో ఒక వ్యక్తి భార్యను 2 సంవత్సరాల నుంచి వేధిస్తూ తీవ్రంగా కొట్టేవాడు. ప్రజలు హెచ్చరించినా వినకపోవడంతో, అతడిని ఎ.వి.ఎమ్.ఎస్ నాయకత్వంలో సుమారు 70 మంది మహిళలు, ఆ గ్రామ మిలీషియా కలిసి దేహశుద్ధి చేసారు.

శతృవు ప్రజల విజయాలను వమ్ముచేసి, తిరిగి భూస్వామ్యాన్నీ, పాత తెగ పెద్దల అభివృద్ధి నిరోధక అధికారాన్ని నిలబెట్టడానికి సాయుధ బలగాలను వినియోగించి, కార్పొరేట్ సెక్యూరిటీని విస్తరింపజేసి, పార్టీ, పీఎల్‌జీఏ, ప్రజా నిర్మాణాలను నిర్మూలించే లక్ష్యంతో సైనిక దాడిని తీవ్రతరం చేసాడు. ఈ పరిస్థితుల్లో స్వాధీనం చేసుకున్న భూములనూ, సాధించుకున్న అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ప్రజలు సాయుధులు కావాల్సిన అవసరం పెరుగుతున్నది. ఈ లక్ష్యం దిశగా కార్యకలాపాలను మరింత పట్టుదలతో, సృజనాత్మకంగా ముందుకు తీసుకెళ్లుతున్నారు. ✶

---

# తెలంగాణ రిపోర్టు

### ఆదిలాబాద్

## ఆదివాసుల అస్థిత్వానికే ప్రమాదం–పోరాటమే మార్గం

ఆదిలాబాదు జిల్లాలోని 5 మండలాలలోని 40 గ్రామాల ఆదివాసీ ప్రజలను కవ్వాల టైగర్ జోన్ పేరిట నిర్వాసితులను చేస్తున్నారు. ఆ ప్రాంత అటవీ భూమిలో క్వార్ట్జ్, క్రిస్టల్, ఐరన్ ఓర్ లాంటి సహజ వనరులు ఉన్నాయి. ఈ వనరులను భవిష్యత్‌లో బహుళ జాతి కంపెనీలకు ధారాదత్తం చేయడానికే ఈ టైగర్ జోన్ ఏర్పాటు చేశారు.

ఆదివాసీ ప్రాంతాలైన డొర్లి, కొర్లిగూడ, అబ్బాపూర్ ప్రాంతాలలో ఓపెన్ కాస్ట్‌లు వచ్చి ప్రజలను నిర్వాసితులను చేశాయి. కొత్తగా ఆసిఫాబాద్ జిల్లాలోని 'మోపాడ్' ప్రాంతంలో ఓపెన్ కాస్ట్‌కు అనుమతినిచ్చారు. ఏజెన్సీ మండలాలైన కాసిపేట, మందమర్రిలో కె.కె–2 ఓపెన్ కాస్ట్‌ను బలవంతంగా తెచ్చి పెట్టారు. ప్రజాభిప్రాయ సేకరణ, వన్ ఆఫ్ సెవెన్టీ, పెసా, 5వ, 6వ షెడ్యూల్‌లకు భిన్నంగా యథేచ్ఛగా పరిశ్రమలు, ఓపెన్ కాస్ట్‌లు ఏర్పాటు చేస్తూ, ఆదివాసులను నిర్వాసితులను చేస్తున్నారు.

నిర్మల్ జిల్లాలోని కుంటాల హైడల్ ప్రాజెక్టు వలన నేరడిగొండ మండలంలోని ఆదివాసీ ప్రజలు నిర్వాసితులు అవుతున్నారు.

జిల్లాలో నీటి ప్రాజెక్టుల కింద భూమి కోల్పోయిన ఆదివాసులు అనేక మంది ఉన్నారు. ఆ ప్రాజెక్టులు పూర్తి కాలేదు, సాగు నీరు రాలేదు. భూములు మాత్రం పోయాయి. ప్రాణహిత చేవెళ్ళ ప్రాంత పనులు, మిషన్ భగీరథ పనులు కాకపోవడంతో ఆ ప్రాంత ప్రజల పరిస్థితి ఎటూ పాలుపోని దుస్థితి.

ఏజెన్సీలో కలుషిత నీరు తాగి డయేరియా, విషజ్వరాలకు ప్రజలు చనిపోతున్నారు. రక్త హీనత అత్యధికంగా ఉన్నది. కొరోనా మరణాలు అధికంగా ఉన్నాయి. మరణాలు ఆగడం లేదు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంటున్నది. జిల్లాలో ఆదివాసులకు విద్య, ఉపాధి కరువైంది. అనేక స్కూల్లు మూసి వేయడంతో పిల్లలు విద్యకు దూరమవుతున్నారు. ఆదివాసీ విద్యార్థుల సీట్లు వేరే సామాజిక వర్గాలకు కేటాయించడం వలన ఉన్నత విద్యా అవకాశాలు తగ్గిపోతున్నాయి. జీ.ఓ. నెం:27 వలన ఆదివాసులు హక్కులను కోల్పోతున్నారు.

ఆదివాసులను నిర్లక్ష్యం చేసి, బతుకు భారం చేసి, మద్యానికి బానిసలుగా మార్చి ఆ ప్రజల సంస్కృతిని దెబ్బతీస్తున్నారు. ఏజెన్సీలో అన్ని జీఓలను ప్రభుత్వం నీరు కారుస్తూ, వారి మనుగడకే ప్రమాదం తెచ్చి పెడుతున్నది.

ఆదిలాబాద్ జిల్లాలో ప్రజల కష్టాలు అధికమయ్యాయి. బతకడం కష్టంగా మారింది. ఫారెస్టు అధికారుల జులుం పెరిగిపోయింది. పశువుల కాపరులను కొట్టి చంపుతున్నారు. కవ్వాల టైగర్ ప్రాజెక్టు పేరుతో గ్రామాలను ఖాళీ చేయిస్తున్నారు. ఓపెన్‌కాస్ట్ వలన ప్రజలు భూములు, ఉపాధి కోల్పోతున్నారు. హరిత హారం పేరుతో పోడు భూముల నుండి ఖాళీ చేయిస్తున్నారు. సాంప్రదాయక ఆదివాసీ వ్యవసాయల నుండి వారిని దూరం చేస్తున్నారు. భూకబ్జాలు, పైరవీలు ఒక్కటేమిటి అనేక రకాలుగా రైతాంగాన్ని వారి జీవిక నుండి బయటికి ఈడ్చివేస్తున్నారు. మరో పక్కన అటవీ ఉత్పత్తులకు, చిరుధాన్యాలకు, అరకొర పండిన పంటలకు గిట్టుబాటు ధరలు అందక, షావుకార్లు, వడ్డీ వ్యాపారుల కబంధహస్తాలలో చిక్కుకున్న ప్రజలు ఉన్న వాటిని అమ్ముకుని, తాకట్టుపెట్టి బతుకులు వెల్లమారుస్తున్నారు. విస్తాపనతో వలస కూలీలుగా మారిన వారి బతుకులు భారమయ్యాయి.

మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయి. మాయం చేయడం, అమ్మివేయడం జరుగుతోంది. పాలకుల, వారి గూండాల రాజ్యంలో అదిలాబాద్ జిల్లాలో ప్రజల మాన, ప్రాణాలకు ప్రమాదం

ఏర్పడింది.

మరో పక్కన మావోయిస్టు అణచివేత పేరుతో పోలీసులు జిల్లా అంతటా ఏజెన్సీ ప్రాంతాల్లో భౌతిక దాడులు చేస్తున్నారు. అమాయక ప్రజలను అరెస్టు చేయడం, తప్పుడు ఆరోపణలతో కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పడం, జైలులో నిర్బంధించడం సర్వసాధారణ మయ్యింది గ్రామ గ్రామాన పోలీసు నిఘా పెరిగింది. గ్రామ పోలీసు, ఇన్‌ఫార్మర్ (నెట్‌వర్క్), ఇంటెలిజెన్స్ సీ.సీ. కెమేరాలు మున్నగు పద్ధతులలో మోటార్ సైకిళ్ళపై పెట్రోలింగ్స్ చేస్తూ నిత్యం గ్రామాలను జల్లెడ పడుతున్నారు. రెగ్యులర్ కూంబింగ్స్, స్పెషల్ ఆపరేషన్స్, సంవత్సరం పొడుగునా ఐ.జీ.పర్యవేక్షణలో, మధ్య మధ్య డీ.జీ.పీ. పర్యవేక్షణలో సమీక్ష సమావేశాలు జరిపి మావోయిస్టు ఉద్యమాన్ని అణచివేయడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అడవి, మైదాన గ్రామాలు, పట్టణాలు రహదార్లు, నదీ తీరాలు పూర్తిగా పోలీసు చెకింగ్‌లలో పహరాతో ఉండి జిల్లా అంతటా పోలీసు రాజ్యం నడుస్తున్నది.

ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా ప్రజలు విప్లవ పార్టీని దళాలను గుండెలకు హత్తుకుని, కంటికి రెప్పలా కాపాడుకుంటూ వారి తక్షణ, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నారు. మరింత సంఘటితం అయ్యేందుకు సిద్ధపడుతున్నారు. అనేక పోరాటాలకు సిద్ధపడుతున్నారు. గత పోరాట వారసత్వాన్ని కొనసాగించడానికి ప్రయత్నిస్తున్నారు. నిత్య నిర్బంధం నడుమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఏప్రిల్ 20న ఇంద్రవెల్లి 39వ అమరుల సంస్మరణ సభను నిషేధాజ్ఞల మధ్యనే 75 గ్రామాల్లో విప్లవోత్సాహంతో జరుపుకున్నారు ప్రజలు.

1/70 చట్టం అమలు చేయాలని, ఏజెన్సీ ప్రాంతంలో భవనాలు కట్టి భూకబ్జాలకు పాల్పడవద్దని ర్యాలీలు తీశారు.

కెరిమెరిలో 600 మంది ఆదివాసీ రైతులు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారిపై పడుకుని నిరసనను తెలిపారు. జిల్లా కలెక్టర్ వచ్చి 300 మందికి పట్టాలు పంపిణీ చేయడంతో పాటు మిగిలిన వారికి వారం రోజుల్లో పట్టాలు ఇస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

పత్తి క్వింటాలుకు 8,500 రూ. గిట్టుబాటు ధర చెల్లించాలని, చిరుధాన్యాలకు గతం కన్నా వెయ్యి రూ॥లు అధికంగా ధర పెంచాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ ప్రాంతాల రైతాంగం ఆందోళనలు చేపట్టారు.

స్కూల్సు మూసివేయడానికి వ్యతిరేకంగా వందల మంది విద్యార్థులు ప్రదర్శనలు నిర్వహించారు. ప్రభుత్వ విధానాలను నిరసించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంతటా జీ.ఓ. నెం:3 రద్దుకు వ్యతిరేకంగా ఆందోళనలు జరిగాయి. ఆదివాసీ ప్రాంతాలలో ఆదివాసులకే ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేసారు. దీనిలో అన్ని సెక్షన్ల ప్రజలు కలిసారు.

ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినాన్ని జిల్లా అంతటా ఉత్సాహంగా జరుపుకున్నారు. ఆసిఫాబాద్, జైనూరు, జన్నారం, ఖానాపుర్‌లలో విప్లవోత్తేజంతో జరుపుకున్నారు. ఆదివాసీ హక్కుల సాధనకు పోరాడుతామన్నారు.

గ్రేహౌండ్స్ పోలీసులు రాత్రి పూట గ్రామాల్లోకి, ఇండ్లలోకి జొరబడి ప్రజలను వేధించడం చేస్తున్న సందర్భాలలో ప్రజలు సంఘటితంగా ప్రతిఘటిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో రాళ్ళతో దాడి చేశారు. మరి కొన్ని గ్రామాల్లో పోలీసులను వెంటబడి తరిమారు.

ప్రజలు క్రమంగా నిర్బంధానికి అలవాటు పడి, ప్రతిఘటనకు సిద్ధపడుతున్నారు. పోరాడడం ద్వారా తమ హక్కులను కాపాడుకోగలమని, కోల్పోయిన భూములను తిరిగి సంపాదించుకోగలమని విశ్వసిస్తున్నారు.

మావోయిస్టు దళాలు ప్రజల సంరక్షణలో ఉంటూ పోలీసు దాడుల్ని తిప్పికొడుతున్నాయి. ప్రజాఉద్యమ నిర్మాణానికి కృషి చేస్తున్నాయి. **ఆదిలాబాద్ విప్లవ ప్రజలకు జేజేలు పలుకుదాం.**

✶

భారత దేశపు సమస్త ప్రాకృతిక వనరులలో 40 శాతం ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలలో ప్రభుత్వం నిర్ణయాత్మక దాడి ప్రకటించిన జిల్లాలలోనే నిక్షిప్తమై ఉన్నాయి. ప్రకృతి వనరులలో కూడా కీలక పరిశ్రమలకు అవసరమైన ముడిపదార్థాలు ఇనుము 87 శాతం, లోహఅయస్క 52 శాతం, కోరమైట్ 90 శాతం, బాక్సైట్ 75 శాతం ఉన్నాయి. ఇవే కాకుండా ఇంకా అనేక రకాల ప్రకృతి వనరులు ఈ రాష్ట్రాలలోనే పుష్కలంగా ఉన్నాయి. ఈ జిల్లాలు మూలవాసుల ప్రాచీన నివాస స్థలాలు. వీటినే మోదీ ప్రభుత్వం ఆకాంక్ష (!) జిల్లాలుగా ప్రకటించింది. గనులున్న ప్రాంతాలను చాణక్యుడు ప్రభుత్వానికి ఖజానా కేంద్రాలన్నాడు. మన కేంద్ర ప్రభుత్వానికి గనుల నుండి రాబడి కేవలం 2 శాతం మాత్రమే ఉందని దానిని 6 శాతానికి పెంచుకోవాలని చాలా కాలంగా పరితపిస్తున్నారు. ఈ ప్రాంతాలలోనే ప్రజల ప్రత్యామ్నాయ ప్రభుత్వాలు ఏర్పడి దాదాపు 25 ఏళ్లుగా పని చేస్తున్నాయి. ఫలితంగా, బహుళ జాతి కార్పోరేషన్‌లకు, దళారీ నిరంకుశ పాలకుల పెట్టుబడులకు దారులు మూసుకుపోయాయి. 1996లో తయారైన పెసా చట్టం అమలు ఎందుకు కావడం లేదని వేలాది మూలవాసుల గొంతులు ఈ ప్రాంతాలలో నినదిస్తున్న వేళ ఇది. ఇక ఇపుడు ఎవరైనా 'నిర్ణయాత్మక దాడి' రహస్యాన్ని సునాయసంగానే ఛేదించవచ్చు.

# దండకారణ్యంలో ప్రజా వెల్లువ

### ఆకబేడ పోలీసు క్యాంపుకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజా పోరాటాలతో ప్రభావితమైన ప్రాంతాల్లో నేడు పోలీసు వ్యవస్థ గస్తీ, గాలింపులతో పాటూ కొత్తగా క్యాంపులు వేస్తున్నది. పోలీసులు గ్రామాలపై దాడి చేసి ప్రజలను పట్టుకొని కొట్టడమూ, బలవంతంగా ఇన్‌ఫార్మర్‌లుగా తయారు చేసుకోవడమూ, డబ్బుల ఆశచూపి ఇన్‌ఫార్మర్లుగా మలచుకోవడమూ, ప్రజాధనాన్ని దోచుకోవడమూ పెరిగిపోతున్నది. భయంకరమైన కరోనా మహమ్మారిని పోలీసులే మాడ్ ప్రాంత ప్రజల్లో వ్యాపింపజేస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా పోస్టర్లు, బ్యానర్లతో కుతుల్ ఏరియాలోని 8 పంచాయితీల, నేల్‌నార్ ఏరియాలోని 3 పంచాయితీల ప్రజలు గుమిగూడి ఆకబేడా క్యాంపు ముందు ర్యాలీ తీస్తూ ప్రదర్శన జరిపారు. దీనిలో కరోనా మహమ్మారీ వ్యాపించిన ఈ కాలంలో పోలీసు గస్తీ, రోడ్ ఓపెనింగ్‌ను, గ్రామ గ్రామానికి పోలీసులు తిరగడమూ బంద్ పెట్టాలని, కేవలం క్యాంపులకే పరిమితమై వుండాలనీ, కొత్త క్యాంపుల విస్తరణ ఆపాలనీ డిమాండ్ చేస్తూ క్యాంపు ముందు ప్రదర్శన చేశారు.

ఈ ర్యాలీలో కనీసం 2వేల మంది దాకా ప్రజలు పాల్గొన్నారు. దీనిలో ఎక్కువ మంది మహిళలు వున్నారు.

### ధనోరా పోలీసు క్యాంపు వద్ద ఆక్రోశంతో ప్రజల ర్యాలీ

నారాయణ్‌పుర్ జిల్లా ధనోరా పోలీసు క్యాంపు ముందు అక్టోబర్ 20న, వెయ్యి మందికి పైగా ప్రజలు గుమిగూడి తమ సాంప్రదాయిక ఆయుధాలతో 5కిలో మీటర్ల పొడవునా ర్యాలీ తీస్తూ ధనోరా థానాను చేరుకున్నారు. పోలీసు, ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ కొత్త పోలీసు క్యాంపులకు వ్యతిరేకంగా భారీ ప్రదర్శన జరిపారు. పోలీసులు చేస్తున్న దౌర్జన్యాలు ప్రజలను కొట్టడం, బెదిరించడం, బూటకపు కాల్పులలో కాల్చి చంపడం, గ్రామాల్లో గాలింపు చర్యలకు వస్తూ కరోనా వ్యాధిని వ్యాపింపచేస్తున్నారనీ వక్తలు తమ ఉపన్యాసాల్లో మాట్లాడారు, అందుకనే పోలీసులు తమ క్యాంపులకే పరిమితమై వుండాలనీ డిమాండ్ చేశారు. ఈ మాడ్ భూమి మాడ్ ప్రజలదే, మా జల్-జంగల్-జమీన్‌పై హక్కు మాకే వుండాలనీ నినాదాలు చేస్తూ, ఉపన్యాసాలు ఇస్తూ మీటింగ్ ముగించారు. ఈ మీటింగ్‌లో మహిళలూ, పిల్లలూ పెద్ద ఎత్తునే పాల్గొన్నారు.

### కోహ్‌కమెట్ట పోలీసు క్యాంపుకు వ్యతిరేకంగా ర్యాలీ

కోహ్‌కమెట్ట ప్రాంతంలో పోలీసు క్యాంపుల విస్తరణను వ్యతిరేకిస్తూ, కరోనా మహమ్మారిని మాడ్ ప్రజలకి సోకనీయకూడదనీ, దీన్ని ఆపివేయాలని ప్రజలంతా కలిసి ఆలోచించి కోహ్‌కమెట్ట పోలీసు థానా ముందు ర్యాలీ తీసారు.

ప్రస్తుతం లోతట్టు ప్రాంతాలలోకి క్యాంపులు వచ్చినప్పటి నుండీ ఊరురా గస్తీ తిరగడం గ్రామస్థులూ, మహిళలూ తమ పొలం పనులకై లేదా అడవిలో ఎటైనా వెళ్ళాలన్నా భయం భయంగా వెళ్ళే స్థితి నెలకొంది. పోలీసులు గాలింపులకు బయలుదేరితే దార్లో దొరికిన వారిని దొరికినట్లే పట్టుకొని కొట్టడం, పట్టుకొని థానాకు తీసుకెళ్ళిపోవడం, అకారణంగా కేసులు పెట్టడం, వారికి సహకరించని వారిని అరెస్టు చేసి జైల్లో పెట్టడం, మహిళలను ముఖ్యంగా యువతులను వేధించడం, అసభ్యంగా ప్రవర్తించడం, ఒంటరిగా ఉన్నవారిపై అత్యాచారానికి పాల్పడడంలాంటి అనేక సమస్యలను క్యాంపు వున్న గ్రామస్థులూ దాని చుట్టుపక్కన వుండే గ్రామాల ప్రజలూ ఎదుర్కొంటున్నారు.

అడవి గ్రామాలలో కరోనా మహమ్మారీ ఎక్కువగా పోలీసుల నుండే వ్యాపిస్తోంది. ఈ విషయాలన్నీ పరిగణనలోకి తీసుకొని 10 పంచాయితీల ప్రజలంతా ఏకమై పోలీసు క్యాంపుల విస్తరణను వ్యతిరేకిస్తూ, కరోనా వ్యాధి విస్తరణను అడ్డుకోవాలంటూ అక్టోబర్ 23న కోహ్‌కమెట్ట గ్రామంలో ర్యాలీ తీశారు. పోలీసు థానా ముందు మీటింగ్ చేశారు. నూతన అటవీ చట్టం-2006లో భాగంగా మాడ్ 'పర్యావాస్' చట్టామూ లేద సామూహికతను దెబ్బతీసే ప్రభుత్వ పట్టాలేవీ మా కొద్దు, మా కొద్దు అంటూ డిమాండ్ చేస్తూ మీటింగ్ ముగించారు. ఈ మీటింగ్‌లో సుమారు 700 మందికి పైగానే ప్రజలు పాల్గొన్నారు, వీరిలో మహిళలు కూడా అధికంగానే వున్నారు.

### పోలీసు జులుంను సహించబోం అన్న ప్రజలు

సెప్టెంబర్ 15వ తేదీన, కాంకేర్ జిల్లా పరాల్‌కోట్ ప్రాంతంలోని వెటియా పోలీసు క్యాంపు పోలీసులు ఓడ నడిపేవాళ్ళను ముగ్గుర్ని పట్టుకొని అకారణంగా కొట్టారు. వాళ్ల తల్లులను, అక్క చెల్లెళ్ళను అవమానించేలా తిట్టారు. అందుకని పోలీసుల జులుం, అత్యాచారాలను వ్యతిరేకిస్తూ సీతారాం, కాందాడి, ఆల్‌దండి గ్రామాల ప్రజలు సుమారు 100 మంది థానాకు వెళ్ళి వెటియా పోలీసులు తమను కొట్టడాన్ని, తిట్టడాన్ని ఖండిస్తూ నిరసనగా ప్రదర్శన జరిపారు. కానీ పోలీసులు లాఠీలు, తుటాలతో అహంకారాన్ని ప్రదర్శించి ప్రజలను వెళ్ళగొట్టారు. తర్వాత రెండో రోజున పొరుగున ఉన్న మహారాష్ట్రలోని గడ్‌చిరోలీ గ్రామాలు సహ వెటియా చుట్టుపక్క ఛత్తీస్‌గఢ్ గ్రామాల వారు, పఖాంజూర్, పరాల్‌కోట్ ప్రాంతాల నుండి గార్పా, పంగుడ్, కొంగే, సీతారాం, కాందాడి పంచాయితీల నుండి సుమారు 880 మంది ప్రజలు వెటియా థానాను చుట్టు ముట్టారు. థానేదార్‌ను బయటికి పిలిచి ప్రజలను కొట్టిన పోలీసులతోను, థానేదార్‌తోనూ ఎదురు నిలిచి వాగ్వివాదంతో బ్రహ్మాండమైన నిరసన ప్రదర్శన జరిపారు. మా తల్లులనూ, అక్క చెల్లెల్లనూ ఎందుకు అవమానించాలి అని ప్రశ్నిస్తూ తమ కోపాన్ని నిరసనను పోలీసులపై ప్రదర్శించారు. థానేదార్ ప్రజలందరి ముందు కాళ్ళా వేళ్ళాపడి తప్పు ఒప్పుకునేంత వరకూ నిరసన ప్రదర్శన జరుపుతూనే వున్నారు. ప్రజలను కొట్టిన, తిట్టిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలంటూ డిమాండ్ చేస్తూ,

వారిని సస్పెండ్ చేసేదాకా తమ పోరాటాన్ని ఆపమని హెచ్చరిక చేశారు.

**'మాడ్‌ను రక్షించుకుందాం' అంటూ మూహిందీలో గొప్ప ప్రదర్శన**

**'మాడ్ భూమి మాడ్ ప్రజలదే'**

మాడ్ డివిజన్‌లోని మూహిందీ, కచ్చపాల్, గార్పలలో పోలీసు క్యాంపులను వేయడాన్ని వ్యతిరేకిస్తూ అన్ని ప్రాంతాల నుండి 15వేల మంది ప్రజలు 5 రోజుల పాటు నిరసన తెలియ జేసారు. ఇందులో 8వేల 5వందల మంది మహిళలు పాల్గొన్నారు. 300 మంది మిలీషియా రక్షణ ఏర్పాటు చూశారు. 15 వేల మందికి తిండి ఏర్పాట్లు స్థానికులే చేసుకుని పోరాడడం ప్రజల్లో పెరిగిన పోరాట చైతన్యానికి నిదర్శనం.

1. మాడ్ భూమి మాడ్ ప్రజలదే
2. మాడ్‌లో భారత సైనిక శిక్షణా శిబిరాలను ఎత్తివేయాలి.
3. మాడ్‌లో పర్యావాస్ చట్టం వద్దు సామూహిక పట్టా వద్దు.
4. కొరోనాను విస్తరిస్తున్న పోలీసు క్యాంపులను నిరసిస్తూ.
5. పోలీసు క్యాంపులను ఎత్తి వేయాలి. కొత్తగా పోలీసు క్యాంపులను వేయవద్దు అంటూ డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనకు ముందు మూహిందీ గ్రామంలో గ్రామసభ జరిగింది.

ఈ ప్రదర్శన జరిగిన 5రోజులు పోలీసులు క్యాంపుల నుండి బయటికి రాలేదు.

## తూర్పు బస్తర్ రిపోర్టు

డిసెంబర్ మొదటి వారంలో 3 రోజులు పాటు దంతెవాడ నారాయణపూర్ (ఎన్.పీ.) పోలీసుల సంయుక్త అభియాన్ జరిగింది. డిసెంబర్ 3న ఆముదాయి కొండపైన పోలీసులు క్యాంపు వేశారు. ఈ కాలంలో ఒక చోట ప్రజలపై కాల్పులు జరిపారు.

ఒక స్కూలుపై దాడి చేసి, ధ్వంసం చేశారు. జులై నుండి డిసెంబర్ వరకు ప్రజలు, పీ.ఎల్.జీ.ఏ. బలగాలు చేసిన ప్రతిఘటన చర్యలలో 18 మంది పోలీసులు చనిపోగా, 13 మందికి గాయపడ్డారు. ప్రజలు గట్టిగా ప్రతిఘటిస్తున్నప్పటికీ, వినకుండా గనుల తవ్వకానికి తరలివస్తున్న పోలీసు, అర్ధ సైనిక బలగాలను అడ్డుకోవడానికి బూబీట్రాప్స్ పెట్టడం, రోడ్లు తవ్వడం, టపాకాయలు పేల్చడం, క్యాంపులలో లైట్లు పగలగొట్టడం, వంతెన నిర్మాణంలో ఉన్న యంత్రాలను తగులబెట్టడం, సిమెంటు కట్టలను ధ్వంసం చేయడం, టెంట్స్ స్వాధీనం శత్రు మోటారు సైకిల్స్‌కు పంక్చర్ చేయడం, ఫెన్సింగ్ వైరులు కట్‌చేయడం, బర్మార్‌లు పేల్చడం లాంటి చర్యలతో శత్రువును చికాకు పరిచే చర్యలలో ప్రజలు మిలీషియా మిలిటెంట్‌గా పాల్గొన్నారు.

## ప్రజాపోరాటాలు

1. ఆగస్టు 9న విశ్వ ఆదివాసీ దినాన్ని జరుపుకోవడం

బంగళా పారలో 500 మంది, డోంగర్‌లో 600 మంది, ఇన్నర్ పంచాయితీలో 700 మంది ప్రజలు పాల్గొన్నారు.

**2వ మహాన్ భూంకాల్ పోరాటానికి గుర్తుగా**

విస్తాపనకు వ్యతిరేకంగా బండ (పథ్థల్‌గఢ్) వేసి సభ జరుపుకున్నారు.

సెప్టెంబర్ 20న డౌలాలో 2,000 మందితోను, అక్టోబర్ 4న డోంగర్‌లో 300 మందితోను అక్టోబర్ 14న పోలీసు క్యాంపుకు వ్యతిరేకంగా బోదిలిలో పోలీసు క్యాంపు ముందు 300 మంది ప్రజలు మీటింగ్ జరుపుకున్నారు. కడియమెట్ట పోలీసు క్యాంపులో 34 మందికి కొరోనా పాజిటివ్ వచ్చింది. బొదిలి క్యాంపులో కొరోనాతో 4గురు పోలీసులు చనిపోయారు. పోలీసులతో కొరోనా వ్యాపించే ప్రమాదం తీవ్రంగా ఉన్నందున వారు క్యాంపులే ఖాళీ చేయాలని ప్రజలు డిమాండ్ చేశారు. ప్రచార కార్యక్రమం చేపట్టారు. నవంబర్ 5న ముహిందీ మీటింగ్‌లో 180 మంది పాల్గొన్నారు. అక్టోబర్ 22న ధనోరాలో గ్రామసభ కార్యకర్త రాకేష్ అరెస్టును నిరసిస్తూ 2,000 మంది రోడ్డు బంద్ చేసి ధర్నా, ప్రదర్శన నిర్వహించారు. బోధ్‌ఘాట్‌కు వ్యతిరేకంగా అనేక గ్రామాలలో మీటింగ్‌లు జరిగాయి. ప్రభుత్వ విధానాలను నిరనిస్తూ విస్తృతంగా ప్రచారం చేశారు.

కడియమెట్ట 2వ దశ పోరాటం. నవంబర్ 12 నుండి మొదలు పెట్టి డిసెంబర్ 7 వరకు జరిగింది. మిలిటెంట్‌గా నడిచింది.

డిసెంబర్ 2 నుండి 7వరకు చెక్కజామ్ పోరాటం 500 మందితో మొదలై చివరికి 35వేల మందికి చేరింది.

అంతకు ముందు జరిగిన పోరాటం నవంబర్ 11 నుండి మొదలై 21వరకు జరిగింది.

నవంబర్ 22 రాత్రికి మరో ఘటన జరిగింది. పోలీసులు వెచ్చ గ్రామం నుండి మనాజి, శివకుమార్, జైలాల్‌లను పట్టుకుపోయారు. వారిని డైరెక్టుగా డోంగర్ పోలీసు క్యాంపుకు తీసుకువెళ్ళారు. దీనికి వ్యతిరేకంగా వెంటనే 600 మంది ప్రజలు జమయ్యారు.

రోజూ క్యాంపు దగ్గర ప్రదర్శన, మీడియా వాళ్ళతో మాట్లాడడం చేశారు. 27న పల్లి, బార్సూర్ రోడ్డుపై ధర్నా ప్రదర్శన, చెక్క జామ్ కార్యక్రమాలు చేపట్టారు. రోడ్డుపై చెట్లు నరికి వేశారు. టెంట్స్‌వేసి వంటలు చేసుకున్నారు. అన్ని గ్రామాలతో సమన్వయించుకుని 28న జరిగిన ప్రజా సమూహాలతో పోలీసులను చుట్టు ముట్టారు. విల్లంబులతో ఆంబుష్ కూర్చుని రోడ్డును తవ్వారు. వంతెనను ధ్వంసం చేశారు. అప్పటికే ప్రజల సంఖ్య 10 వేలకు పెరిగింది. ప్రజలలో పోరాటం పట్ల విశ్వాసం పెరిగింది. మీడియా మద్దతు దొరికింది. డిసెంబర్ 1న రోడ్డును ధ్వంసం చేశారు. డిసెంబర్ 2న 10వేల మంది కాలినడకన నారాయణపూర్ బయలుదేరారు. దారిలో డోంగర్ ప్రజలను కలుపుకున్నారు. తహసీల్‌దార్, పోలీసులు అడ్డువస్తే గొడవ పడ్డారు. అక్కడి నుండి బియ్యం, కట్టెలు జమచేసుకుని డౌలాకు బయలుదేరారు. గొప్ప ప్రజా ప్రదర్శన నిర్వహించారు. డౌలా దగ్గర పల్లీ బార్సుర్ రోడ్డును, నారాయణపూర్, ఓర్చా రోడ్డును జామ్ చేసే విధంగా డౌలా దగ్గరే



పోరాటాన్ని కొనసాగించారు. చెక్క జామ్ కొనసాగింది. ఆయుధాలు విడిచిపెట్టలేదు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మద్దతునిచ్చారు. పట్టణ ప్రజలు తిండి సమకూర్చారు. అన్ని సెక్షన్ల ప్రజలు, సంస్థలు మద్దతునిచ్చాయి.

కడియమెట్ట పోరాటం నవంబర్ 12 నుండి డిసెంబర్ 1వరకు జరిగితే, డెసెంబర్ 2నుండి 7వరకు డోంగర్, డౌలా పోరాటం జరిగింది.

చిన్న చిన్న పోరాటాలు రిహార్సల్స్‌గా ఉపయోగపడ్డాయి. సాంప్రదాయ ఆయుధాలు విడవకుండా పోరాడారు. మిలిటెంట్‌గా పోరాడారు. అన్ని సెక్షన్ల మధ్య, ప్రాంతాల మధ్య సమన్వయంతో పోరాడారు. మీడియా సహకారాన్ని వినియోగించుకున్నారు. రోడ్డు చెక్క జామ్ పోరాటం ప్రధాన రూపంగా ముందు నిలిచింది. కొన్ని కొత్త శక్తులు వచ్చి చేరాయి. పోలీసులను తరిమి కొట్టడం రోడ్లు, వంతెన నిర్మాణాలు ధ్వంసం చేసి శతృ కదలికలను నిరోధించారు. పోరాట ప్రభావం అడవీ, మైదానాలకు విస్తరించింది.

అధికారులు 15 రోజులు సమయం కావాలని, డిమాండ్లు పరిష్కారిస్తామని అనడంతో పోరాటాన్ని తాత్కాలికంగా ఆపి, మరోదశ పోరాటానికి సన్నద్ధ మవుతున్నారు. పోరాట చైతన్యాన్ని అందిస్తున్న విప్లవ ప్రజలకు జేజేలు పలుకుదాం. ✶

---

## క్రాంతి అక్షర శిల్పి విప్లవకవి విమర్శకుడు చిత్రకారుడు పెంచికలపాడు చిన నరసింహారెడ్డి మరణించాడు.



కామ్రేడ్ మిత్రులు పెంచుకలపాడు చిన్న నరసింహారెడ్డి

క్రాంతి టైటిల్ అక్షర శిల్పి పెంచికలపాడు చిన నరసింహారెడ్డి (జననం 3 జులై 1943, మరణం 20 ఆగస్టు 2020) మరణం పట్ల క్రాంతి పత్రిక తీవ్ర సంతాపాని తెలియచేస్తున్నది. మహబూబ్‌నగర్ జిల్లాలోని పెంచికలపాడులో ఒక సంపన్న భూస్వామ్య కుటుంబంలో పుట్టిన నరసింహారెడ్డి అనారోగ్యంతో తుదివరకు విప్లవోద్యమ సమర్థకులుగా, సాహితీ ప్రియులుగా, ప్రజా పక్షపాతిగా నిలిచాడు. ఆయన అనేక అభ్యుదయ, విప్లవ పత్రికలకు, విప్లవకర పుస్తకాలకు తన 'శుక్తి' కుంచెతో బొమ్మలు వేసి అలంకరించాడు. విరసం సభ్యుడిగా ఆయన 'ఐ' కలం పేరుతో రచనలు చేసేవాడు. ఆయన తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగు విభాగ భాషాధిపతిగా పని చేస్తూ ఎంతో మంది విద్యార్థులకు ప్రగతిశీల రాజకీయాల పట్ల మక్కువ కలిపించి వారిని విప్లవ క్యాంపుకు దగ్గర చేశాడు. ఆయన సేవలు చిరస్మరణీయమైనవి. క్రాంతి టైటిల్ ఉన్నంతవరకు ఆయన జ్ఞాపకాలు చెదిరిపోవు.

# పోలీసుల దాడులను ఎదిరించి పోరాడిన ఆవ్‌నార్ గ్రామ మహిళలు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన భూపేశ్ బఘెల్ ప్రభుత్వం కేంద్రంలోని మోదీ ప్రభుత్వంలో కుమ్మక్కై దండకారణ్య విప్లవోద్యమాన్ని నిర్మూంచడానికి తీవ్రమైన ఫాసిస్టు 'సమాధాన్' దాడులను ప్రస్తుతం ప్రహార్ పేరుతో కొనసాగిస్తున్నది.

బీజాపుర్ జిల్లా గంగాలూర్ ప్రాంతంలో పోలీసులు, అర్ధసైనిక బలగాలు సంయుక్తంగా అక్టోబర్ 30, 2020న నేంద్ర, కోర్సీలి, పరల్‌నార్, మురుంగా, ఆవ్‌నార్ గ్రామాలపై దాడి చేశాయి. ప్రజలపై దాడులలో కమాండో బలగాలు కోబ్రా, డీఆర్‌జీలు అత్యంత పాశవికంగా వ్యవహరిస్తున్నాయి. వారు అడవినీ గ్రామాలనూ జల్లెడ పడుతూ ప్రజలపై విచక్షణారహితంగా విరుచుకుపడి కనపడ్డవారినల్లా కొట్టారు. ఆవ్‌నార్‌లో మిలీషియా, సంఘ సభ్యులంటూ ముగ్గురు యువకులను పట్టుకొని తల్లుల ముందే అతి పాశవికంగా కొట్టడాన్ని వారు సహించలేక పోయారు. నిర్ధోషులైన తమ పిల్లలను కొట్టడాన్ని గ్రామస్థులు వ్యతిరేకిస్తూ పోలీసులను చుట్టు ముట్టారు. తమ పిల్లలను వదలాలనీ పోలీసులుతో ఘర్షణ పడ్డారు. పోలీసులు 8 మంది మహిళలను శరీరమంతా నెత్తుర్లు కారేలా విపరీతంగా కొట్టారు. ఈ వార్త గ్రామంలో ని మిగతా ప్రజలందరికీ వెంటనే చేరింది. వరి పంటలు కోస్తున్న మహిళలు కొడవళ్ళుతోనే బయలుదేరగా, పురుషులు గొడ్డళ్ళు, కత్తులు, బాణాలు తీసుకొని అక్కడికి చేరారు. అన్యాయంగా అరెస్టు చేసిన తమ గ్రామ యువకులను విడుదల చేయాలంటూ, గ్రామ మహిళలను కొట్టిన మీకు బుద్ధి చెప్తామని కోపంగా పోలీసులపై గ్రామస్థులు విరుచుకుపడ్డారు. దానితో పోలీసులు కాలుకు బుద్ధి చెప్పి చెర్పాల్ క్యాంపుకు చేరారు. అరెస్టు చేసిన యువకులను ముందే గంగాలూర్ పంపడంతో గ్రామ మహిళలందరూ గంగాలూర్ ఠానా వద్ద అక్టోబర్ 31న బైఠాయించి యువకులను విడుదల చేయాలనీ, మహిళలను కొట్టిన పోలీసులపై చర్య తీసుకోవాలనీ గాయపడ్డ మహిళలకు చికిత్స చేయించాలనీ కొరోనా మధ్య గ్రామాలపై గస్తీ బంద్ చేయాలనీ డిమాండ్ చేశారు.

మరోవైపు దక్షిణ బస్తర్‌లోని పాలోడు, కొమ్మల్, టెట్టం మున్నగు గ్రామాలలోని ప్రజలతో పాటు పశ్చిమ బస్తర్‌లోని పొంబాడు ప్రజలు తమ గ్రామాలలో నూతనంగా పోలీసు క్యాంపులు వేయడాన్ని వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున తమ నిరసన తెలిపారు. ఇప్పటికే తమ చుట్టుపక్కల ఉన్న గ్రామాలలోని పోలీసు క్యాంపులతో రోజువారిగా తమ జీవితాలలో ఎదుర్కొంటున్న అనేక సమస్యలతో వారు ప్రభుత్వ నిర్ణయాన్ని దృఢంగా వ్యతిరేకించారు. 2017-20 మధ్య బీజపుర్, సుక్మా, దంతెవాడ, నారాయణపుర్ జిల్లాలలో అదనంగా దాదాపు 50 వరకు పోలీసు క్యాంపులు కొత్తగా నెలకొన్నాయి. కొత్తగా పశ్చిమ బంగాల్, బిహార్‌లనుండి రెండేసి బటాలియన్‌లను తీశారు,మరో బటాలియన్‌ను ఝుర్ఖండ్ నుండి తీసి మొత్తంగా 5 బటాలియన్‌లను ఈ జిల్లాలలో మొహరించనున్నారు. వీటిని ప్రజలు వ్యతిరేకిస్తుంటే పోలీసులు అత్యంత పాశవికంగా వ్యతిరేకిస్తూ తమ కుక్కలతో ప్రజలను కరిపించి భయభ్రాంతులకు లోను చేశారు. ఈ ఏహ్యమైన సంఘటనను యావత్ ప్రజలు ఖండించాలనీ విప్లవ ప్రజలు విజ్ఞప్తి చేశారు.

పై సమస్య ఆన్‌లైన్ సోషల్ మీడియాలో ప్రసారం కావడంతో వివిధ సామాజిక సంస్థలు రంగంలోకి దిగాయి. దీనితో పోలీసులు ఆలస్యం చేయకుండా గాయపడ్డ మహిళలకు బీజాపుర్‌లో చికిత్స చేయించి గ్రామం వరకు వాహనంలో తెచ్చి విడిచారు. అరెస్టు చేసిన యువకులను ఎన్‌కౌంటర్‌లో హత్య చేయకుండా జైలుకు పంపారు. సామాజిక మాధ్యమాల ద్వార ప్రజల పక్షం నిలిచిన మిత్రులకు, సామాజిక సంస్థలకు ప్రజలు క్రాంతి పత్రిక ద్వార కృతజ్ఞతలు అందచేస్తున్నారు. పోలీసుల దాడులను ఎదిరించి పోరాడిన ఆవ్‌నార్ మహిళల పోరాట స్ఫూర్తిని క్రాంతి ఎత్తిపడుతోంది! ✶



# విప్లవోద్యమాన్ని మట్టుబెట్టే దుష్ట పథకంలో భాగమే దండకారణ్యంలో కోవర్టు కుట్రలు

భారత విప్లవోద్యమంలో కోవర్ట్ ఆపరేషన్స్ కొత్త కాదు. దశాబ్దాలుగా అనేక కుట్రలు చేసి కోవర్టుల ద్వారా ఎంతో మంది విప్లవకారులను పోలీసులు హత్యలు చేశారు. ఇప్పుడు కోవర్టు కుట్రలు దండకారణ్యంలో బలపడుతున్న విప్లవోద్యమాన్ని దెబ్బతీయడానికి కొనసాగుతున్నాయి. ఇటీవల పశ్చిమ బస్తర్‌లో వెలుగులోకి వచ్చిన ఒక పకడ్బందీ కుట్ర పథకాన్ని- కోవర్టు ఆపరేషన్‌ను- పార్టీ, పిఎల్‌జిఏ, ప్రజలు కలిసి విచ్ఛిన్నం చేశారు. కోవర్టులను, గోపనీయ సైనికులను, ఇన్‌ఫార్మర్లను శిక్షించారు. శత్రువు కుట్ర ద్వారా విప్లవోద్యమాన్ని అణచివేయాలని అనుకుంటున్నాడు. పార్టీ, ప్రజలు అప్రమత్తంగా వుండి శత్రు కుట్రలను భగ్నం చేసి విప్లవోద్యమాన్ని కాపాడుకున్నారు. అటువంటి కోవర్టు ఆపరేషన్‌కి వ్యతిరేకంగా విప్లవ క్యాంపును ఎలర్ట్ చేశారు. ఇంకా శత్రు ప్రభావంలో వున్న వారిని హెచ్చరించి, ప్రజల పర్యవేక్షణలో విడిచిపెట్టారు.

2020 ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో బయట పడిన కోవర్టు కుట్రకు సంబంధించిన వ్యవహారం 2017 చివరి నుండి ప్రారంభమయ్యింది. 2022 నాటికి విప్లవోద్యమాన్ని పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో పని చేస్తున్న కేంద్ర ప్రభుత్వం, దాని నాయకత్వంలోని నక్సలైట్ వ్యతిరేక నిర్మాణాలు, సాయుధ బలగాలు యిప్పటి వరకు అనుసరిస్తున్న అణచివేత దాడులకు, మానసిక యుద్ధానికి తోడుగా విప్లవోద్యమంలోనే బలహీనంగా వున్న శక్తులకు ఎరవేసి, ప్రలోభ పెట్టి కోవర్టులుగా మార్చుకుని ప్రధాన నాయకత్వాన్ని నిర్మూలించే లక్ష్యంతో కుట్రలు చేస్తున్నారు. అందులో భాగంగా జరిగిన ఘటనల్లో అతి పెద్ద ఘటన- కొయ్యూరు అమరులు శ్యాం, మహేష్, మురళి లపై బెంగళూరులో గోవిందరెడ్డి అనే కోవర్టు ద్వారా చేసినది. మానాల, పావురాల గట్టు లాంటి ఘటనలు కూడా ఉద్యమానికి చాలా నష్టం చేశాయి. దండకారణ్యంలో కంచాల (2007) ఘటనలో నష్టం తర్వాత విప్లవ పార్టీ, ప్రజలు అప్రమత్తంగా వుండి ఎన్నో కుట్రలను, విష ప్రయోగాలను, కోవర్టు ఆపరేషన్‌లను, శత్రు ఇంటలిజెన్స్ నెట్‌వర్క్ లను ముందుగానే గుర్తించి భగ్నం చేశారు. ఇప్పుడు కూడా పార్టీ, పిఎల్‌జిఏ, విప్లవ ప్రజలు అప్రమత్తమై 3 సంవత్సరాల నుండి కొనసాగుతున్న ఒక పెద్ద కోవర్టు కుట్రను, బలమైన నెట్‌వర్క్‌ను విధ్వంసం చేయగలిగారు.

2020 ఆగస్టు 5న పశ్చిమ బస్తర్ డివిజన్‌లో పూసునార్ వద్ద నాయకత్వం లక్ష్యంగా ఫైరింగ్ జరిగింది. 3 జిల్లాల నుండి 66 బ్యాచులు అంటే, 6,7 వేల మంది కేంద్ర, రాష్ట్ర బలగాలను బీజాపూర్ నుండి బాసగూడా వరకు కేంద్రీకరించి చేసిన దాడి అది. పిఎల్‌జిఏ బలగాలు తక్షణం ప్రతిఘటించి తప్పుకున్నాయి. రిట్రీట్ దారులను ఊహించి శత్రువు మాటుగాచినా పిఎల్‌జిఏ అడవి కవర్‌లో ప్రజల సహకారంతో తప్పుకుంది. రిట్రీట్ అవుతున్న పిఎల్‌జిఏ వెంటబడడం, డేరాలను రిక్కీ చేయడం అర్థం చేసుకుంటూ మరింత నిబ్బరంగా శత్రు కదలికలను ప్రజల ద్వారా, స్కౌట్స్ ద్వారా తెలుసుకుంటూ పిఎల్‌జిఏ కామ్రేడ్స్ నాయకత్వాన్ని సురక్షితంగా కాపాడారు.

2017 లో సమాధాన్ వ్యూహాత్మక దాడిలో భాగంగా మొదలైన ఈ నిర్దిష్ట పథకం కోసం వేలాది బలగాలను సమన్వయించిన అధికారులు 3 సంవత్సరాల కాలంలో లెక్కకు మించిన దాడులు చేశారు. పెద్ద నష్టాలు జరగాల్సినవి తృటిలో తప్పాయి. డేరాలు నిర్దిష్టంగా కనుక్కోలేకపోవడం, సమన్వయం ఆలస్యం కావడంతో డేరాలు ఖాళీ చేయడం, మనకు అనుమానం వచ్చి డేరా మార్చడం, ప్రజలు ముందుగానే మనల్ని శత్రు కదలికల గురించి అప్రమత్తం చేయడం వలన కొన్ని తప్పిపోయాయి. అయినా కొన్ని నష్టాలు జరిగాయి. ఇందులో భాగంగానే 2018లో కామ్రేడ్స్ క్రాంతి, బద్రు లపై పోలీసు కాల్పులు జరిగి వారిద్దరూ అమరులయ్యారు. ఇది ఖచ్చితమైన నెట్‌వర్క్ సమాచారం వలన చేయగలిగారు. 2019, 2020 లలో కూడా కొన్ని సీరియస్ ప్రయత్నాలు, దాడులు జరిగాయి. ఫైరింగ్స్ కూడా జరిగాయి. అయితే, పిఎల్‌జిఏ వాటిని ధైర్యంగా తిప్పికొట్టి నాయకత్వాన్ని, ఉద్యమాన్ని కాపాడింది.

2020 ఆగస్టు 5న జరిగిన పూసునార్ ఎన్‌కౌంటర్ సంఘటన తర్వాత వేల బలగాలు వెంటపడడం, అనేక సార్లు డేరాలను రిక్కీ చేసి, ఘెరావ్ చేయడం లాంటి పరిస్థితి కొన్ని రోజుల పాటు దాగుడు మూతల ఆటలాగ క్షణక్షణం టెన్షన్‌తో నడిచింది. ప్రజల క్రియాశీలమైన మద్దతుతో ఆ వలయం నుండి బయటపడి, మొత్తం పరిస్థితిని విశ్లేషించుకున్నప్పుడు శత్రు పథకం, అందులో భాగమైన కోవర్టులు, గోపనీయ సైనికులు, ఇన్‌ఫార్మర్లు, ఇతర ద్రోహులు బయటపడ్డారు. వారిని ప్రజల సహకారంతో విచారణ జరిపి శిక్షించడం జరిగింది.

ఈ కోవర్టు ఆపరేషన్ సందర్భంగా అర్థమయినవిషయాలు-

1. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి కుట్రలో భాగం, ఎన్ఐఏ పర్యవేక్షణలో ఎస్పి అభిషేక్ పల్లవ్ ప్రత్యక్ష నాయకత్వంలో ఈ కోవర్ట్ ఆపరేషన్ జరిగింది. అన్ని రకాల బలగాల ప్రధాన అధికారుల సమావేశంలో ఏర్పడిన జాయింట్ కమాండ్ ఆధ్వర్యంలో బలగాల సమన్వయం జరిగింది.

2. 2017లో జరిగిన పథక రచనలో ప్రతీ స్థాయిలోను వ్యక్తిగత బాధ్యతలు తీసుకుని, పని విభజన కనుగుణంగా వారివారి లక్ష్యాల కనుగుణంగా దీర్ఘకాలిక పథకంతో ఈ కోవర్టు కుట్రకు పూనుకున్నారు. వెంటవెంటనే సమన్వయించుకుంటూ సైనిక విన్యాసాల మార్పులు, కదలికలు వేగంగా చేశారు.

3. కమ్యూనికేషన్ సెట్స్‌ను, మొబైల్స్‌ను ఉపయోగించి, డిపార్ట్‌మెంటల్ ఇంటలిజెన్స్ ద్వారాను, ఎస్పి స్వయంగా కోవర్టు వ్యక్తుల ద్వారాను, ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్ నుండి స్థానిక డిఆర్‌జి బలగాల కీలక ఇంటలిజెన్స్‌లోని కీలక వ్యక్తి అశోక్ కుంజాం ద్వారాను, వేరు వేరు వ్యక్తుల్ని, ఏజెంట్లను వెంటనే వినియోగించుకుని ఎస్పి కేంద్రంగా సమన్వయంతో నడిపారు.

4. సంతలకు వచ్చి రహస్యంగా సమాచారం సేకరించడం, మొబైల్ ద్వారా కాంటాక్టు పెట్టుకోవడంతో పాటు, విజ్జాల్ లాంటి కోవర్టులను బయట పడకుండా ప్రత్యేక జాగ్రత్తలు, ఏర్పాట్లు చేసుకుని కలవడం, మధ్యవర్తిగా లొంగిపోయిన (గోపి లాంటి) వారిని వినియోగించుకోవడం చేశారు. ప్రతి చిన్న విషయాన్ని పై నుండి సమన్వయిస్తూ, కమాండ్ చేస్తూ కంట్రోల్‌లోవుంచుకున్నారు.

5. ఈ పనికోసం నియమించుకున్న కోవర్టులకు, మధ్యవర్తులకు, ఏజెంట్లకు, రహస్య పోలీసులకు, ఇన్‌ఫార్మర్లకు, రూట్స్ సర్వే చేసి గైడ్స్‌గా వచ్చేవారికి, రికీలు చేసి సమాచారం రెగ్యులర్‌గా అందించే వారికి రెగ్యులర్‌గా డబ్బులు అందించడం, బ్యాంకులో జమ చేయడం చేశారు. ఆర్థికంగా ప్రలోభాలకు, తాగుడు లాంటి వ్యసనాలకు అలవాటు చేశారు. నిరంతరం పోలీసుల కంట్రోల్‌లో వుండి పని చేసేలా నియంత్రించారు.

6. ఆర్థికంగాను, సామాజికంగాను ప్రభావితం అయ్యేలా బంధువులకు డబ్బు ఆశ చూపడం, తాగించడం ద్వారా ఒక గ్రామం మీద, ప్రాంతం మీద కంట్రోల్ తెచ్చుకోవడం, పెద్దాల్, వడ్డేలలో మనకు వ్యతిరేకంగా వున్న వారిని ప్రోత్సహిస్తుండడం, పుకార్లు వ్యాపింపజేయడం ద్వారా ప్రజల రాజకీయ విశ్వాసాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించారు. పెత్తందార్లు, లంపెన్స్ రెచ్చిపోయేలా అవకాశాలు కల్పించి ప్రోత్సహించారు.

7. మీడియాలో చేసే ప్రచారానికి భిన్నంగా క్షేత్ర స్థాయిలో పథకాలు వుండేలా చూడడం కూడా ఒక ఎత్తుగడగానే అమలు చేశారు.

8. మనకు అనుమానం రాకుండా వుండేందుకు, ఒక వేళ వస్తే కూడా అది స్పష్టం కాకుండా చేసేందుకు డైవర్టు చేసే పద్ధతులను కూడా అనుసరించారు. అందులో భాగంగా కోవర్టు మీద అనుమానం రాకుండా, ప్రధాన లింకు వ్యక్తులు అర్థం కాకుండా ఆయా సందర్భాల కనుగుణంగా ఆ విషయాలను పాత ఇన్‌ఫార్మర్ల మీదకు, పార్టీ దృష్టిలో వున్న యితర అనుమానాస్పద వ్యక్తుల మీదకు దృష్టి మళ్లేలా ప్రయత్నించడం, పబ్లిక్ మీటింగ్ లాంటి ఎక్స్‌పోజ్ కార్యక్రమాలు జరిగేలా చూసి పోలీసులు రావడానికి అదే కారణం అని అనిపించేలా చూశారు.

9. కోవర్టులను అనుమానించకుండా వారి వ్యక్తిగత, నైతిక బలహీనతలు మాత్రం బయటపడేలా చేసి రాజకీయ కోవర్టుగా అనుమానించకుండా డైవర్టు చేయించే విధానాలు అనుసరించారు. బయటపడితే పారిపోవడానికి ఏర్పాట్లు, ఉండాల్సిన ప్రాంతం, సదుపాయాలు కూడా సిద్ధం చేశారు.

10. మన ప్రధాన నాయకత్వం టార్గెట్‌గా, ప్రధాన రూట్లు, ఆధారపడే గ్రామాలు, సమన్వయం చేసుకునే ముఖ్య ప్రాంతాలపై నిరంతర నిఘాపెట్టి, రెగ్యులర్‌గా సమాచారం అందే విధంగా మెకానిజం ఏర్పాటు చేసుకున్నారు.

11. పార్టీలోనే అవిశ్వాసం పెంచడానికి, కేడర్ మధ్య విభేదాలు సృష్టించడానికి, నాయకత్వాన్ని చంపి, తుపాకులు, డబ్బులు పట్టుకుని పారిపోవడానికి అవసరమైన శిక్షణ, సైనిక తర్ఫీదుతో పాటు వారిలో వున్న లంపెన్ స్వభావాన్ని బయటకి తీసి పరమ అరాచకులుగా తయారుచేశారు. యాక్షన్ టీంలను, రెక్కీ టీం లను తయారు చేశారు.

12. జిల్లాల మధ్య సమన్వయానికి, పార్టీ కార్యకలాపాల కోసం ఉన్న యంత్రాంగాన్ని దెబ్బతీయడానికి మన నిర్మాణాల్లోని వ్యక్తులనే మార్చుకుని కోవర్టులుగా పని చేయించారు. ✶

అమెరికా స్టేట్ నావికా దళ లెఫ్టినెంట్ కమాండర్ హాన్నాటెక్స్ జూన్ 2008లో సెనేట్‌కు సమర్పించిన 'ది రిసర్జెన్స్ ఆఫ్ నక్సలిజం' రిపోర్టులో 'దక్షిణాసియాలో అమెరికా ప్రయోజనాలకు నక్సలిజం ఒక చాలెంజింగ్ సమస్య, మావోయిస్టుల తిరుగుబాటును అణచడంలో అమెరికా ప్రయోజనాలున్నాయి'- అన్నాడు.

*(45వ పేజీ తరువాయి....)*

కంపెనీలను తన్ని తరుముదాం, వ్యవసాయరంగాన్ని కాపాడుకుందాం' అంటూ నినదిస్తున్నారు. మోదీ ప్రభుత్వం చేసిన నూతన చట్టాల, విధానాల ఫలితంగా చిన్న, మధ్యతరగతి వ్యాపారుల, పెట్టుబడిదారుల దుకాణాలు, కంపెనీలు దివాలాతీయడంతో వాళ్లు కూడా పెద్దెత్తున రోడ్ల మీదకు వచ్చి పోరాడుతున్నారు. మోదీ పాలనలో పీడిత జాతుల పోరాటాలను నిరంకుశంగా అణచివేయడం పరాకాష్టకు చేరింది. 2019 అగస్టులో కశ్మీర్‌ను భారత సైన్యంతో, పారామిలిటరీ బలగాలతో దిగ్బంధించి కశ్మీర్‌కు ప్రత్యేక హోదాను కల్పించే ఆర్టికల్ 370, 35ఏలను రద్దు చేసింది. 'భారత రాజ్యాంగాన్ని' ఉల్లంఘిస్తూ మత ప్రాతిపదికపై 'పౌరసత్వ సవరణ చట్టం' (సీఏఏ), 'జాతీయ పౌరసత్వ రిజిస్టర్' (ఎన్‌ఆర్‌సీ), 'జాతీయ జనాభా రిజిస్టర్' (ఎన్‌పీఆర్)లను రూపొందించింది. ఒక వైపు విద్యను వ్యాపారీకరించడానికి అత్యంత నవీన భావనల గురించి మాట్లాడుతూ మరోవైపు పాఠ్యాంశాలలో తిరోగామి-కాలం చెల్లిన, అప్రజాస్వామిక, అలౌకిక, హిందుత్వ భావాలతో తిరగరాస్తూ 'జాతీయ విద్యా విధానాన్ని' ప్రవేశపెట్టింది.

మొత్తంగా చూస్తే అభివృద్ధి, విశ్వాసం వంటి జనాకర్షక పదజాలంతో మోదీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక, దేశద్రోహ విధానాలను అమలు చేస్తున్నది. సామ్రాజ్యవాద విదేశీ, దేశీయ దళారీ కార్పొరేట్ కంపెనీల, ద్రవ్య సంస్థల దోపిడీ ప్రయోజనాలను ఈడేరుస్తున్నది. 'ఆత్మనిర్భర్ భారత్' పేరుతో దేశాన్ని కార్పొరేట్ కంపెనీలు అడ్డూఆపూలేకుండా దోచుకునే అడ్డాగా, 'ఔట్‌సోర్సింగ్ హబ్'గా, 'పరాధీన భారత్'గా మారుస్తున్నది. 'వన్ నేషన్ వన్ ఎవ్రీథింగ్' లక్ష్యంతో 'నయా భారత్' నిర్మాణం పేరుతో దేశాన్ని 'హిందూ రాజ్యం'గా మారుస్తూ దేశంలోని యావత్తు పీడిత వర్గాల, పీడిత సెక్షన్ల, పీడిత జాతులపై ముప్పేట దాడి కొనసాగిస్తున్నది. భారత దళారీ పాలకవర్గాలకు, మోదీ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా, దేశంలో నిజమైన ప్రజాస్వామ్యాన్నీ, సోషలిజాన్ని స్థాపించే లక్ష్యంతో సాయుధంగా పోరాడుతున్న మా పార్టీనీ, విప్లవోద్యమాన్ని తుదముట్టించేందుకు దాడులను తీవ్రం చేస్తున్నది. ప్రజాస్వామిక, జాతివిముక్తి పోరాటాలపై మోదీ హిందుత్వ ఫాసిస్టు ప్రభుత్వం క్రూరమైన అణచివేతను ప్రయోగిస్తున్నది.

ఈ హిందుత్వ ఫాసిస్టు విధానాలను ఖండిస్తూ దేశ ప్రజలు విరామ మెరుగని పోరాటాలు చేస్తున్నారు. ప్రజలే ప్రజా వేదికలను ఏర్పాటు చేస్తూ మోదీ హిందుత్వ ఫాసిజాన్ని ఎండగడుతున్నారు. మోదీ తొలిసారి అధికారాన్ని చేపట్టాక భూసేకరణ చట్టాన్ని తేవడానికి చేసిన కుట్రలన్నింటినీ ప్రజలు ఒక్కుమ్మడిగా అడ్డుకున్నారు. షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ జాతుల అత్యాచార నిరోధక చట్టంలో మార్పులు, 2006 నూతన అటవీ చట్టంలో మార్పులు చేయడానికి చేసిన కుటిల ప్రయత్నాలను దళిత, ఆదివాసీ ప్రజలు తిప్పికొట్టారు. సీఏఏ, ఎన్‌ఆర్‌సీ, ఎన్‌పీఆర్‌ల అమలుకు వ్యతిరేకంగా దేశం భగ్గుమంది. ఢిల్లీలోని షాహీన్‌బాగ్ ప్రజా ఉద్యమం ఇందుకు సంకేతంగా నిలిచింది. దీన్ని అంతమొందించే కుట్రతో ఫాసిస్టు 'సంఘ్ పరివార్' కాషాయ హంతక ముఠాలు, రాజ్య ఫాసిస్టు పోలీసు బలగాలతో కలిసి ఉద్యమకారులపై దాడి చేసి సామూహిక హత్యాకాండ జరిపి 54 మందిని అత్యంత క్రూరంగా హత్య చేశారు. షాహీన్‌బాగ్ ఉద్యమ మహిళా నాయకులను తప్పుడు కేసులలో ఇరికించి బెయిలు కూడా ఇవ్వకుండా అనేక రోజులు ఇబ్బందులకు గురి చేశారు. ఈ కుట్రలో భాగంగా తప్పుడు ఆరోపణలతో దేశంలోని ప్రజాహిత మేధావులను, విశ్రాంత భారతీయ సర్వీసు అధికారులను సైతం ముద్దాయిలను చేశారు. ఇలా ఎంతో మంది ప్రజాస్వామికవాదులను, సామాజిక కార్యకర్తలను, పోరాటకారులను పట్టణ మావోయిస్టులంటూ 'ఉపా' వంటి చట్టాల కింద జైళ్లలో నిర్బంధిస్తున్నారు. ఢిల్లీ హత్యాకాండపై కోర్టులో పోలీసులు నమోదు చేసిన తప్పుడు కేసును 'రాజ్యాంగ అమలు పర్యవేక్షక బృందం' (కాన్‌స్టిట్యూషనల్ కాండక్ట్ గ్రూపు) సైతం నిందించింది.

అలాంటి సమరశీల, సమైక్య పోరాటాల అవశ్యకత నేడు ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలో నవంబర్ 26న దేశవ్యాప్తంగా జరగనున్న సమ్మె కార్మిక-శ్రామిక-ఉద్యోగ, కర్షక, మధ్యతరగతి తదితర పీడిత ప్రజల ఐక్యతకు ఒక ప్రతీకగా నిలుస్తుంది. ఈ ఐక్య పోరాట సాంప్రదాయాన్ని విజయసాధన వరకూ కొనసాగించాలి. ఈ విశాల ప్రజాస్వామిక వైఖరితో మోదీ ప్రభుత్వ కార్మిక-ఉద్యోగ-రైతు వ్యతిరేక, ప్రజావ్యతిరేక, దేశద్రోహకర విధానాలను ఎండగడుతూ నవంబర్ 26 దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాల్సిందిగా, ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సంఘటిత, సమరశీల, విస్తృత ప్రజా పోరాటాన్ని నిర్మించాల్సిందిగా మా పార్టీ యావత్తు కార్మిక, రైతు సంఘాలకు, ప్రగతిశీల, ప్రజాస్వామిక సంఘాలకు, సంస్థలకు, వ్యక్తులకు మరోసారి విజ్ఞప్తి చేస్తోంది.

Abhay

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

## నవంబర్ 26న ప్రతిపాదిత

## అఖిల భారత సమ్మెను జయప్రదం చేయండి!

## మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, కార్మిక-ఉద్యోగ వ్యతిరేక, రైతు వ్యతిరేక, దేశద్రోహ విధానాలకు వ్యతిరేకంగా సమైక్యంగా పోరాడండి!

మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, కార్మిక-ఉద్యోగ వ్యతిరేక, రైతు వ్యతిరేక, దేశ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశంలోని పది జాతీయ కార్మిక సంఘాలు, వాటి అనుబంధ సంఘాలు, అలాగే అనేక స్వతంత్ర, ప్రాంతీయ, కార్మిక కర్షక సంఘాలు నవంబర్ 26న దేశవ్యాపిత సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ పిలుపును మా పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్రకమిటీ స్వాగతిస్తున్నది, బలంగా సమర్థిస్తున్నది. ఈ అఖిల భారత సమ్మెలో పాల్గొని, దానిని జయప్రదం చేయాల్సిందిగా దేశ జనాభాలో 44 కోట్లు(32 శాతం)గా వున్న అసంఘటిత రంగ కార్మికులకు, సంఘటిత రంగ కార్మికులకు-శ్రామికులకు-ఉద్యోగులకు, విశాల రైతాంగానికీ, మధ్యతరగతి వర్గానికీ, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పెట్టుబడిదారులకు, విద్యార్థి-యువజనులకు, పీడిత సామాజిక సెక్షన్లయిన మహిళలకు, దళితులకు, ముస్లిములు తదితర మతమైనార్టీ ప్రజలకు, ఆదివాసులకు, కశ్మీర్, ఈశాన్య పీడిత జాతులకు, వీరికి ప్రాతినిధ్యం వహించే అసంఖ్యాక ప్రజాస్వామిక సంస్థలకు మా కేంద్రకమిటీ విజ్ఞప్తి చేస్తోంది. అలాగే ఈ సమ్మెలో పెద్దెత్తున కదిలి ప్రజా నిరసనను తెలపాల్సిందిగా మా ఉద్యమ ప్రాంతాలలోని యావత్తు పీడిత ప్రజలకు, విప్లవ ప్రజాసంఘాలకు, ఆర్‌పీసీలకు, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యానికి పిలుపునిస్తోంది.

కార్పొరేట్ కంపెనీలు, ఎంఎన్‌సీలు కార్మికుల శ్రమశక్తిని చౌకగా దోచుకునేలా మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా కుదించి సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువా వర్గ ప్రయోజనాలకు అనుకూలంగా, కార్మికులకు వ్యతిరేకంగా మార్చింది. కార్మికులు పోరాడి సాధించుకున్న 'యూనియన్ హక్కు', 'సమ్మె హక్కు'లను వీటి ద్వారా అది కాలరాచి వేసింది. కొరోనా మహమ్మారితో ఏర్పడిన సంక్షోభంలో దేశ ప్రజలపై 'లాక్‌డౌన్' విధించి ఫాసిస్టు అణచివేతను కొనసాగిస్తూ ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రూరమైన 12 గంటల పని దినాన్ని అమలులోకి తెచ్చాయి. ఓవర్‌టైం పనికి రెట్టింపు వేతనాన్ని రద్దు చేసాయి. కంపెనీలు లాకౌట్ ప్రకటించటానికి వాటి యాజమాన్యాలు అమలు చేయాల్సిన షరతులను సరళీకరించాయి. ప్రపంచీకరణలో భాగంగా దేశ ఆర్థిక వ్యవస్థలోని యావత్తు రంగాలను ప్రైవేటీకరిస్తుండడంతో సంఘటిత కార్మికులు-ఉద్యోగుల స్థానంలో డైలీ లేబర్‌ను, కాంట్రాక్టు లేబర్-ఉద్యోగులను, ఇలా మరెన్నో పేర్లతో నియమిస్తూ సాధారణ కార్మికులకు ఇచ్చే వేతనం కంటే కూడా తక్కువ వేతనం ఇస్తున్నాయి. ఉత్పత్తి ఖర్చులు తగ్గించాలనే ప్రపంచ బ్యాంక్ షరతుల ముందు సాగిలపడి మోదీ ప్రభుత్వం ఇదంతా చేస్తున్నది. ఈ విధానాల కారణంగా దేశంలో నిరుద్యోగం గత 45 సంవత్సరాల రికార్డును బద్దలు చేసింది. ఇటీవల మోదీ ప్రభుత్వం విదేశీ, దేశీయ కార్పొరేట్ల, బడా భూస్వాముల ప్రయోజనాలను ఈడేరుస్తూ వ్యవసాయాన్ని కార్పొరేటీకరిస్తూ, తిండి గింజలతో సహా ఆహార పదార్థాల కోసం దేశాన్ని పరాధీనం చేస్తూ మూడు రైతు వ్యతిరేక వ్యవసాయక చట్టాలను - 1. రైతు ఉత్పత్తుల వ్యాపార, వాణిజ్య (పురోభివృద్ధి-సౌకర్యం) చట్టం, 2. గ్యారంటీ ధర, వ్యవసాయ సేవలపై రైతు హక్కు ఒప్పంద చట్టం, 3. ఆవశ్యక వస్తువుల (సవరణ) చట్టం - రూపొందించింది. అందుకే దేశవ్యాప్తంగా రైతాంగం 'కార్పొరేట్

*(మిగతాది 44వ పేజీలో...)*